WANTED

జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ / మండల రిపోర్టర్లు కావలెను.

తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా మీ ముందుకు వస్తున్న "వారధి తెలుగు దినపత్రిక" లో పనిచేయుటకు ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్/మండల రిపోర్టర్లు ను ఆహ్వానిస్తోంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

సంప్రదించాల్సిన నెంబర్లు:
9492580091



Facebook.varadhi telangana

# విశ్వ వారధి

తెలుగు దిన పత్రిక

www.varadhinews.com

సంపుటి : 1
సంచిక : 50
శుక్రవారం
25.10. 2024


## జైలుకు వెళ్లడానికి సిద్ధమే

- ఒకటి రెండేల్లు జైలులో ఉండడానికి వెనకాడం
- కాంగ్రెస్ చీటింగ్‌పై అందరూ కలసికేసులు పెట్టాలి
- రైతుబంధు, రుణమాఫీ చేయనందుకు నిలదీయాలి
- ఆదిలాబాద్ సభలో పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు



3 లో..

## ఆయిల్‌పామ్ పరిశ్రమ అభివృద్ధికి మలేషియా సహకారం

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల



2 లో..



# చర్చిస్తాం.. పరిష్కరిస్తాం

నేటి సాయంత్రంలోగా డీఏలపై నిర్ణయం ప్రకటిస్తాం

## ఉద్యోగుల సమస్యలపై సబ్ కమిటీ ఏర్పాటు

- దీపావళి తర్వాత శాఖల వారీగా చర్చలు
- రెండు, మూడు రోజుల్లో నిర్ణయం చెప్తాం..
- ఉద్యోగుల సర్వీసు అంశాలను పరిశీలిస్తాం
- ఉద్యోగ సంఘాల జేఏసీతో సీఎం రేవంత్‌రెడ్డి



తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీవో) ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం ముగిసింది. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో చర్చలు జరిగాయి. సీఎస్ శాంతికుమారి, ప్రభుత్వ సలహా దారు కేకే, జేఏసీ ప్రతినిధులు చర్చల్లో పాల్గొ న్నారు. జెఎసి ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమావేశమయ్యారు. ప్రభుత్వ సలహాదారు కే.కేశవ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, జేఏసీ ప్రతినిధులు.

మిగతా 2 లో

## వరంగల్‌లో రైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్

- రూ.650 కోట్ల వ్యయంతో ఏర్పాటు
- యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ పొడిగింపు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, అక్టోబర్ 24 :** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 90 శాతం రైల్వేలైన్ల విద్యుదీకరణ జరిగిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌తో రాష్ట్ర ఎంపీల సమావేశం అనంతరం రైల్ నిలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామన్నారు. వరంగల్‌లో రూ. 650 కోట్లతో రైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.



మిగతా 2 లో

## కేసీఆర్‌లాగే కాంగ్రెస్..

ఏఐసీసీ చీఫ్‌కు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సంచలన లేఖ

ఏఐసీసీ చీఫ్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సంచలన లేఖ రాశారు. కాంగ్రెస్‌లో తనకు జరుగుతున్న అన్యాయం, పరిణామాలను వివరిస్తూ లేఖ రాశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ, ఎమ్మెల్యే సంజయ్, పోచారం శ్రీనివాసరెడ్డిని ఉద్దేశించి తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు.



మిగతా 3 లో

## సింగరేణి కార్మికులకు నేడే దీపావళి బోనస్



- ఒక్కొక్క కార్మికునికి రూ.93,750 బోనస్ చెల్లింపు
- బోనస్ కింద రూ.358 కోట్లు విడుదల
- గత ఏడాది కన్నా ఇది రూ. 50 కోట్లు అధికం
- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రకటన

**మంచిర్యాల అక్టోబర్ 24 :** సింగరేణి సంస్థలో దీపావళి బోనస్‌గా పిలవబడే పి.ఎల్.ఆర్.ఎస్. ప్రొడక్షన్ లింక్డ్ రివార్డ్ స్కీమ్ కార్మికులకు బోనస్ ను నేడు శుక్రవారం సింగరేణి కార్మికులకు చెల్లిస్తున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు మరియు ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు గురువారం సచివాలయంలో ప్రకటించారు. దీని కోసం సింగరేణి సంస్థ 358 కోట్ల రూపాయలను విడుదల చేయాలని సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ ను ఆదేశించారు.



మిగతా 2 లో

## పేదల ఇండ్ల కూల్చివేతకు వ్యతిరేకం



- 'మూసీ పునరుజ్జీవం' పేదల ఇండ్ల కూల్చివేయడాన్ని భరించం
- మూసీ బాధితుల పక్షాన రేపు ఇందిరాపార్క్ వద్ద బీజేపీ మహాధర్నా
- మూసీను కాంగ్రెస్ ఏటీఎంలా వాడుకోవాలనుకుంటోంది
- కాళేశ్వరం పేరుతో బీఆర్ఎస్.. మూసీ పేరిట కాంగ్రెస్‌దోపిడీ
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్

3 లో..



## నల్ల వెంకటేశ్వర్లకు ఘోష్ కమిషన్ ప్రశ్నలు

- మాజీ సీఎం చెప్పినట్లు చేశానని వెల్లడి
- కాళేశ్వరం ఆ లోచన కేసీఆర్‌దే
- నేడు మళ్లీ హాజరు కావాలని ఆదేశాలు

2 లో..

## డిపిఆర్ లేకుండానే మూసీ పునరుద్ధరణ

ప్రభుత్వ తీరుపై మండిపడ్డ ఈటెల

4 లో..





## కాశ్మీర్‌లో రెచ్చిపోయిన ఉగ్రవాదులు

2 లో..

## ఖమ్మం జిల్లా ప్రజలు తీవ్రంగా నష్టపోయారు

- జాతీయ రహదారులు, గ్రీన్ ఫీల్డ్, రైల్వే లైన్స్ కోసం భూములిచ్చారు
- సౌత్ సెంట్రల్ రైల్వే అధికారుల సమావేశంలో ఖమ్మం ఎంపీ రఘురామ్ రెడ్డి

**సికింద్రాబాద్, అక్టోబర్ 24 :** సికింద్రాబాద్‌లోని రైలు నిలయంలో జరిగిన సౌత్ సెంట్రల్ రైల్వే రైల్వే అధికారులు మరియు పార్లమెంట్ సభ్యులతో జరిగిన సమావేశంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రఘురాం రెడ్డి పాల్గొన్నారు రఘురాం రెడ్డి తమ పార్లమెంట్ పరిధిలోని ఉభయ జిల్లాలకి చెందిన పలు రైల్వే సమస్యలపై అధికారులతో చర్చించారు

మిగతా 2 లో



వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com



## వరంగల్‌లో రైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్

(మొదటిపేజీ తరువాయి)



గతంలో ఎన్నడూ లేని విధంగా దక్షిణ మధ్య రైల్వే బ్జడెట్‌ను పెంచామన్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 5 వందే భారత్ రైళ్లు ఉన్నాయని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. మరిన్ని తీసుకొస్తామన్నారు. రూ.720 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పనులు చేస్తున్నట్లు వివరించారు. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. యాదాద్రి వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. దీనికి రూ.650 కోట్లు అవసరమని చెప్పారు. ఘట్‌కేసర్ వరకు ప్రస్తుతం ఎంఎంటీఎస్ సర్వీసు ఉందని.. అక్కడి నుంచి యాదాద్రి వరకు విస్తరించాల్సి ఉందని పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం సహకరించకున్నా ఎంఎంటీఎస్ సర్వీసును పొడిగిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో ఎంపీలు సురేష్‌రెడ్డి, కావ్య, డీకే అరుణ, రఘునందన్‌రావు పాల్గొన్నారు. పలు సమస్యలను వారు జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈదుల నాగులపల్లి స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని ఎంపీ రఘునందన్ రావు కోరారు. కొల్లూరు, ఈదుల నాగులపల్లి రైల్వే బ్రిడ్జిని అభివృద్ధి చేయాలన్నారు. జర్నలిస్టులు, దివ్యాంగులకు రైల్వే పాస్‌లను పునరుద్ధరించాలని కోరారు. మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వే లైన్ పూర్తి చేయాలన్నారు.

## ఉద్యోగ సంఘాలతో సీఎం చర్చ

**హైదరాబాద్, అక్టోబర్ 24 :** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీవో) ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం ముగిసింది. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో చర్చలు జరిగాయి. సీఎస్ శాంతికుమారి, ప్రభుత్వ సలహాదారు కేకే, జేఏసీ ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. జెఎసి ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమావేశమయ్యారు. ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, జేఏసీ ప్రతినిధులు. ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. భేటీ అనంతరం జేఏసీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో మాట్లాడి ప్రకటన చేస్తామని సీఎం చెప్పినట్లు వారు తెలిపారు. 'రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా అన్ని విషయాలను ఒకదాని తర్వాత ఒకటి పరిష్కరించుకుంటూ వస్తున్నాం. ఉద్యోగుల సమస్యలు కూడా నాకు తెలుసు. ఒకటి రెండు రోజుల్లో ఒక నిర్ణయం తీసుకొని ప్రకటన చేస్తాం. బదిలీలు, ఉద్యోగుల సర్వీసు అంశాలను పరిష్కరిస్తాం. వాటితో పాటు మిగతా అన్ని సమస్యలపై చర్చిస్తాం. ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను పరిష్కరిస్తాం అని సీఎం హామీ ఇచ్చినట్లు జేఏసీ నేతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వంపై పూర్తి నమ్మకం ఉందని వారు వెల్లడించారు.

## ఉద్యోగుల సమస్యలపై కేబినేట్ సబ్ కమిటీ

**హైదరాబాద్, అక్టోబర్ 24 :** ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేబినెట్ సబ్ కమిటీని నియమించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షుడిగా, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా.. కె.కేశవరావు ప్రత్యేక ఆహ్వానితుడిగా మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పెండింగ్ డీఏలపై శుక్రవారం సాయంత్రంలోగా నిర్ణయం ప్రకటించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘంగా చర్చలు జరిపారు. దీపావళి తర్వాత శాఖల వారీగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కేబినెట్ సబ్ కమిటీ సమావేశమై చర్చిస్తుందని సీఎం తెలిపారు.

## ఖమ్మం జిల్లా ప్రజలు తీవ్రంగా నష్ట పోయారు

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యంగా సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు ప్రతిపాదించిన డోర్నకల్ టు మిర్యాలగూడ రైల్వే లైన్ మరియు డోర్నకల్ టు గద్వాల రైల్వే లైన్ ఖమ్మం జిల్లా ప్రజలకి మరి ముఖ్యంగా పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల రైతులకు అన్యాయం జరుగుతుంది అని వాదించారు ఈ ప్రాంత రైతులు ఇప్పటికే ఖమ్మం జిల్లా చుట్టుపక్కల ఉన్న జాతీయ రహదారులు 365 ఏ 365 బి మరియు నాగపూర్ అమరావతి గ్రీన్ఫీల్డ్ హైవే సీతారామ లెఫ్ట్ కెనాల్ భక్త రామదాసు లిఫ్ట్ ఇరిగేషన్ కెనాల్ లాంటి ప్రాజెక్టులకు తమ భూమిని దారా దత్తం చేశారు డోర్నకల్ టు విజయవాడ 3వ రైల్వే లైన్ కూడా ప్రారంభమైంది దీనికి తోడుగా డోర్నకల్ టు మిర్యాలగూడ వయా పాపటపల్లి రైల్వే లైన్ అవసరం యంతవరకు ఉపయోగపడుతుంది అని సమీక్షించాల్సిందిగా కోరారు. ఈ రైల్వే లైన్ వల్ల పేద మధ్యతరగతి సన్నకారు రైతులు తమ భూమిని కోల్పోవడం తప్ప గొప్పగా ప్రయోజనం లేదని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. ఈ ప్రతిపాదిత రైల్వే లైన్ అవసరం ఉన్న డోర్నకల్ మన్నెగూడెం అబ్బాయి పాలెం మరిపెడ మోతే ద్వారా విష్ణుపురం అనగా మిర్యాలగూడెం వరకు రైల్వే లైన్ వేయాలని రఘురామిరెడ్డి గట్టిగా ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకి వరంగల్ మరియు మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు కూడా మద్దతు తెలిపారు రఘురాం రెడ్డి తన ప్రతిపాదానను సంబంధిత అధికారులతో పాటు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా తెలియజేసి ఖమ్మం జిల్లా ప్రత్యేకంగా పాలేరు రైతులని కాపాడాల్సిందిగా కోరారు. ఈ ప్రతిపాదిత రైల్వే లైను అవసరమైన డోర్నకల్ మరిపెడ మోతే నుండి విష్ణుపురం వరకు నిర్మించాలని ప్రతిపాదించారు ఈ కొత్త ప్రతిపాదిత రైల్వే లైన్ వరంగల్ మరియు సూర్యాపేట నల్గొండ జిల్లా వాసులకి ఎంతో ఉపయోగపడుతూ ప్రభుత్వానికి అనగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ల్యాండ్ ఎక్విజేషన్ ఖర్చు కూడా తగ్గుతుంది అని తెలియజేశారు.

## సింగరేణి కార్మికులకు నేడే దీపావళి బోనస్

(మొదటిపేజీ తరువాయి)

గత ఏడాది చెల్లించిన దీపావళి బోనస్ కన్నా ఇది రూ.50 కోట్లు అధికం కావడం విశేషం. శుక్రవారం మధ్యాహ్నం కల్లా దీపావళి బోనస్ ను కార్మికుల ఖాతాల్లో జమ చేయాల్సిందిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. దీపావళి బోనస్ కింద ఒక్కొక్క కార్మికుడు రూ.93,750 లు అందుకోనున్నారు. దీపావళి బోనస్ సంస్థలో పనిచేస్తున్న దాదాపు 40,000 మంది కార్మికులకు వర్తిస్తుంది జే.బీ.సీ.సీ.ఐ. విధానాల్లో భాగంగా కంపెనీలు సాధించిన ఉత్పత్తి పరిమాణం ఆధారంగా కార్మికుల శ్రమకు ప్రోత్సాహకంగా ఈ బోనస్ ను చెల్లించే పద్ధతి గత కొన్నేళ్లుగా అమలులో ఉంటోంది. ఈ ఏడాది కూడా కోల్ ఇండియా స్థాయిలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా దీపావళి పండుగకు ముందే చెల్లింపులు జరిగేలా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క మల్లు ఆదేశాలిచ్చారు కాగా ఇటీవలే సింగరేణి ఉద్యోగులందరికీ 33 శాతం లాభాల వాటా కింద 796 కోట్ల రూపాయలను కంపెనీ పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఒక్కొక్క కార్మికుడికి సగటున 1 లక్షా 90 వేల రూపాయలు అందాయి. అలాగే ఔట్ సోర్సింగ్ సిబ్బందికి రూ.5 వేల చొప్పున చెల్లించారు. అలాగే పండుగ అడ్వాన్స్ కింద ఒక్కొక్క కార్మికునికి 25వేల రూపాయలు చొప్పున మరో 90 కోట్ల రూపాయలను కంపెనీ చెల్లించింది. ఇప్పుడు దీపావళి బోనస్ కింద ఒక్కొక్కరికి సగటున రూ.93,750లు లభిస్తాయి మొత్తం మీద ఈ నెల రోజుల వ్యవధిలో దీపావళి బోనస్, లాభాల వాటా, పండుగ అడ్వాన్స్ కింద రూ.1250 కోట్ల ను కంపెనీ చెల్లించింది ఈ విధంగా సగటున సింగరేణి ఉద్యోగులు ఈ నెల రోజుల కాలంలో ఒక్కొక్కరు సుమారు మూడు లక్షల రూపాయల వరకు అందుకున్నారు బోనస్ చెల్లింపుపై తగు ఏర్పాటు చేయాలని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ పర్సనల్ అండ్ ఫైనాన్స్ విభాగం అధికారులను ఆదేశించారు.

## తెలంగాణలో పెట్టుబడులకు జర్మనీ ఆసక్తి

### శ్రీధర్‌బాబుతో రైన్‌ల్యాండ్ ప్రతినిధి బృందం భేటీ



**హైదరాబాద్, అక్టోబర్ 24 :** తెలంగాణలో పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలకు జర్మనీలోని రైన్‌ల్యాండ్ రాష్ట్రం ఆసక్తి కనబర్చిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. రైన్‌ల్యాండ్‌కు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం సచివాలయంలో శ్రీధర్ బాబుతో భేటీ అయింది. రైన్‌ల్యాండ్ మంత్రి డానియెల్ బృందం, చెన్నైలోని జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేలా కలిసి పెట్టుబడులపై మంత్రితో చర్చించారు. ఫార్మా ఉత్పత్తులు, బయోటెక్నాలజీ, వ్యాక్సిన్‌లు, ప్యాకేజింగ్, పౌల్ట్రీ, వ్యవసాయం, ఆటోమొబైల్స్, లాజిస్టిక్స్ వంటి విభాగాల్లో భాగస్వాములు కావడం, పెట్టుబడులు పెట్టే అవకాశాలపై చర్చించారు. సులభతర వాణిజ్య విధానాలు, తక్షణ అనుమతుల జారీలో తెలంగాణ అగ్రగామిగా ఉందని ఈ సందర్భంగా జర్మనీ బృందానికి శ్రీధర్ బాబు తెలిపారు. నూతన ఆవిష్కరణలు, ఆధునిక పరిశోధనలను ప్రోత్సహించే విధంగా ప్రపంచ స్థాయి వ్యవస్థను ఏర్పాటు చేయడంపై దృష్టి సారించామన్నారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా పెట్టుబడులకు తెలంగాణ ప్రపంచ స్థాయి గమ్యస్థానంగా నిలుస్తోందన్నారు. నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యతతో పాటు అత్యున్నత మౌలిక సదుపాయాలతో పరిశ్రమ దృష్టిని ఆకర్షిస్తోందని అన్నారు. హైదరాబాద్‌లో జరిగే బయో ఆసియా-2025 సదస్సుకు హాజరు కావాలని శ్రీధర్ బాబు.. ప్రతినిధుల బృందాన్ని కోరారు. రైన్‌ల్యాండ్, తెలంగాణ రాష్ట్రాలు ఇకపై పరస్పర సహకార సంబంధాలు కలిగి ఉండాలని ఇరు పక్షాలు అంగీకరించాయి. రైన్‌ల్యాండ్‌ను సందర్శించి అక్కడి అభివృద్ధిని పరిశీలించాలని మంత్రి డానియెల్ బృందం శ్రీధర్ బాబును ఆహ్వానించింది.

## తెలంగాణలోనే సొంతంగా సీడ్ గార్డెన్

### మలేషియా పర్యటనలో మంత్రి తుమ్మల

**హైదరాబాద్, అక్టోబర్ 24 :** భవిష్యత్తులో తెలంగాణలోనే సొంతంగా సీడ్ గార్డెన్ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మలేసియా పర్యటనలో ఉన్న మంత్రి.. రెండో రోజు పలు సంస్థలను సందర్శించారు. ప్రపంచంలో అతి పెద్ద వ్యాపార ఆధారిత క్రూడ్ ఫామాయిల్ ఉత్పత్తిదారుల్లో ఒకటైన ఎఫ్‌జీవీ కంపెనీ సీడ్ గాడ్గన్‌ను సందర్శించారు. నర్సరీలను, అధునాతన సాంకేతిక పద్ధతులతో ఉన్న విత్తన కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆ కంపెనీ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సొంతంగా సీడ్ గాడ్గన్ ఏర్పాటుకు ఎఫ్‌జీవీ కంపెనీ సహకరించాలని కోరారు. అందుకు రాష్ట్ర భాగస్వామ్యంతో పని చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు.



## కాశ్మీర్‌లో రెచ్చిపోయిన ఉగ్రవాదులు

### కాల్పుల్లో ఒకరికి తీవ్ర గాయాలు

**శ్రీనగర్, అక్టోబర్ 24 :** జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. పుల్వామాలోని స్థానికులపై ఒక్కసారిగా కాల్పులకు తెగబడ్డారు. గురువారం ఉదయం జిల్లాలోని త్రాల్ ప్రాంతంలో జరిపిన కాల్పుల్లో ఒక కార్మికుడు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. బటాగుండ్ గ్రామంలో టెర్రరిస్టులు కాల్పులు జరపడంతో బిజ్నోర్‌కు చెందిన శుభమ్ కుమార్ చేతికి బుల్లెట్ గాయమైందని అధికారులు వెల్లడించారు. ఉగ్రవాదుల కోసం ఆర్మీ అధికారులు గాలిస్తున్నారు. ఆదివారం ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు కార్మికులు, ఒక వైద్యుడు మరణించిన ఘటన తీవ్రకలకలం రేపింది. నాలుగురోజుల్లోనే మరోసారి దాడికి పాల్పడటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వారంరోజుల్లో ఉగ్రవాదులు మూడుసార్లు కాల్పులకు పాల్పడటం కలకలం రేపింది.

## పరస్పర భద్రత సూత్రం ఆధారంగా..

### సరిహద్దుల్లో భారత్, చైనా ఒప్పందం: రాజ్‌నాథ్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 :** వాస్తవాధీన రేఖ వెంబడి గత నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ భారత్- చైనాల మధ్య ఇటీవల కీలక గస్తీ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఈ ఒప్పందంపై కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. ఈ సందర్భంగా చర్చలకు ఉండే శక్తి ప్రాముఖ్యతను వివరించారు. పరస్పర భద్రత సూత్రం ఆధారంగా ఇరుదేశాల మధ్య సరిహద్దు పరిస్థితులను పునరుద్ధరించేందుకు ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరింది. పెట్రోలింగ్, కీలక ప్రాంతాల్లో వ్యవహరించాల్సిన తీరుపై ఒప్పందంలో స్పష్టంగా ఉంది. కీలక ప్రాంతాల్లో పెట్రోలింగ్, పశువుల మేత విషయాల్లో ఏకాభిప్రాయం కుదిరింది. ఈ భేటీ ద్వారా సమస్య పరిష్కారాలకు అవకాశం దొరికింది. చర్చలు ఫలించాయి. చర్చలకు ఉండే శక్తి ఇదే' అని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లు ఈ ఒప్పందానికి ఆమోదం తెలిపారు. కాగా.. ఎల్ఏసీ వెంబడి గస్తీ పునఃప్రారంభంపై భారత్-చైనా కీలక ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీని ప్రకారం.. 2020 నాటి యథాస్థితి ఎల్ఏసీ వెంబడి ఇక కొనసాగనుంది. ఇరు దేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు ఇక స్వేచ్ఛగా వెళ్లొచ్చు. ఈ ఒప్పందాన్ని ఇరుదేశాధినేతలు ఆమోదించారు.

## తెలంగాణలో డ్రగ్స్ నియంత్రణకు కీలక నిర్ణయం

### సోల్జర్స్‌ను, నియంత్రణ కమిటీలను ఏర్పాటు

**హైదరాబాద్, అక్టోబర్ 24 :** తెలంగాణలో డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం మరో కీలకమైన నిర్ణయం తీసుకుంది. డ్రగ్స్ నియంత్రణకు సోల్జర్స్‌ను, నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేయ-ంబోతోంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయనుంది. ఇప్పటి వరకు డ్రగ్స్ వాడకం నగరాలకు, పట్టణాలకు మాత్రమే పరిమితం అయ్యేది. ఇప్పుడు గ్రామస్థాయికి చేరుకుంది. కొన్ని ప్రాంతాల్లో స్కూల్‌కు సమీపంలో ఉన్న దుకాణాల్లో కూడా డ్రగ్స్ పెడ్లర్లు అమ్మకాలు మొదలు పెట్టారు. ఇలా రోజుకో రూపంలో గంజాయి లాంటి మత్తు పదార్థాలను విక్రయించే ముఠాలను అరికట్టడం పోలీసులకు ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. ఒకట్రెండు డిపార్టుమెంట్లతో దీన్ని నిర్మూలించడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. సమాచారం ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా చైతన్యం అవుతున్న వాళ్లు తక్కువమందే ఉంటున్నారు. ప్రజల సహకారంతో ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఓవైపు పెడ్లర్లపై ఉక్కుపాదం మోపుతూనే వినియోగ దారులను అరికట్టే ప్రయత్నాల్లో ప్రభుత్వం సరికొత్త విధానం తీసుకొస్తోంది. ప్రభుత్వ టీచర్లు, ప్రిన్సిపల్, రెవెన్యూ అధికారులను ఇందులో భాగస్వాములను చేయనుంది. వీరితోపాటు వైద్యులు, పారామెడికల్ స్టాఫ్, ఆశా వర్కర్లు, అంగన్వాడీలతో కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. వీళ్లకు డ్రగ్స్ కంట్రోల్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. గ్రామస్థాయిలో పోలీస్ సర్వేలెన్స్‌కు దూరంగా మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న, వినియోగిస్తున్న వారి వివరాలు సేకరించనున్నారు. వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం, వాటికి దూరంగా ఉండేలా చేయనున్నారు. ఇలా దశల వారీగా వివిధ ప్రణాళికలు అమలు చేసి డ్రగ్స్‌రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దాలని చూస్తున్నారు. ఇప్పటికే తెలంగాణలో డ్రగ్స్‌పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. పబ్బులు, ఇతర ప్రైవేటు పార్టీలపై దాడులు చేస్తోంది. అమ్మేవారిపై నిఘా పెట్టారు. కొంటున్న వారికి కౌన్సిలింగ్ ఇస్తున్నారు. విమానాశ్రయం, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లలో తనిఖీలు విస్తృతం చేశారు. అనుమానం ఉన్న వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఉద్యోగులందరితోపాటు ప్రజలను కూడా భాగస్వాములను చేయాలని ప్రభుత్వం చూస్తోంది.



## నల్ల వెంకటేశ్వర్లుకు ఘోష్ కమిషన్ ప్రశ్నలు

### డిపిఆర్ మార్పుపై నిజాలు ఆరా

**హైదరాబాద్, అక్టోబర్ 24 :** కాళేశ్వరం కమిషన్ విచారణకు విశ్రాంత ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఆయన్ను విచారణ కమిటీ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ విచారించారు. ఆనకట్టల నిర్మాణం, నాణ్యత, నిబంధనలు, నిర్వహణపై పలు ప్రశ్నలు వేశారు. గతంలోనూ నల్లా వెంకటేశ్వర్లును జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారించింది. ఆయన్ను గురువారం మరోసారి క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. నల్లా వెంకటేశ్వర్లుపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. నిజాలు, దస్త్రాల ఆధారంగానే సమాధానాలు చెప్పాలంది. కమిషన్ ముందు నిరాధారమైన వ్యాఖ్యలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది. కాళేశ్వరం డీపీఆర్‌పై నిర్ణయం ఎప్పుడు, ఎవరు తీసుకున్నారని ఆయన్ను ప్రశ్నించారు. 2016లో అప్పటి సీఎం ఆదేశాలతో నిర్ణయం జరిగిందని వెంకటేశ్వర్లు బదులిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఆలోచన అప్పటి సీఎందేనని తెలిపారు. సమీక్షకు పిలిచేవరకు తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. సీడబ్ల్యూసీ ఆమోదం తర్వాతే డీపీఆర్ మార్పులు జరిగాయా అని కమిషన్ ప్రశ్నించింది. దానికి వెంకటేశ్వర్లు అవునని సమాధానమివ్వగా.. మార్పులు ఎవరు చేశారని జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు. ఉన్నత స్థాయి కమిటీ ఆదేశాలతో మార్పులు జరిగినట్లు వెంకటేశ్వర్లు చెప్పారు. 3 ఆనకట్టల నిర్మాణ స్థలాన్ని వ్యాప్కోస్ సూచించిందన్నారు. ప్రభుత్వం, అధికారుల ప్రమేయం లేకుండానే వ్యాప్కోస్ ఎలా సూచిస్తుందని కమిషన్ ప్రశ్నించింది.

## ఆయిల్‌పామ్ పరిశ్రమ అభివృద్ధికి మలేషియా సహకారం

### రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

**హైదరాబాద్ :** ఆయిల్‌పామ్ పరిశ్రమ అభివృద్ధికి రానున్నకాలంలో ఆయిల్‌పామ్ సాగులో అగ్రగామి ఉన్న దేశాల్లో ఒకటైన మలేషియా సహకారం తీసుకోనున్నట్టు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆయిల్ పామ్ విస్తరణావకాశాలు, ప్రాసెసింగ్ ప్లాంట్ల నిర్వహణ, సాగులో అనుసరిస్తున్న సాంకేతిక విధానాలు, ఆయిల్‌పామ్ ఉత్పాదకాలపై శాస్త్రీయ అధ్యయనానికి మంత్రి తుమ్మల, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషాలు మలేషియాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా మలేషియా ప్లాంటేషన్, కమోడిటీస్ మంత్రి జోహరి అబ్దుల్ ఘనితో బుధవారం భేటీ అయ్యారు. పామాయిల్ ఉత్పత్తికి అన్ని విధాలా సహాయసహకా రాలు అందిస్తున్నామని, త్వరలోనే మలేషియా బృందం తెలంగాణలో పర్యటిస్తుందని తెలిపారు. అనంతరం ఎంఏటీఆర్ఏవోఈ చైర్మన్ డాటో సెరి రీజల్ మెరికన్ భేటీతో అయి మలేషియాతో వ్యవసాయపరంగా వ్యాపార అవకాశాలపై చర్చించారు. తమ దేశంలో నూకలకు అత్యంత డిమాండ్ ఉందని డాటో చెప్పారు. వెంటనే మంత్రి తుమ్మల... హాకా ఎండీ చంద్రశేఖర్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. నూకలు ఎగుమతి చేయడానికి సంబంధించిన అంశాలను పరిశీలించాలని, తెలంగాణ వరి రైతులకు అదనపు ప్రయోజనం కలిగితే వచ్చే యాసంగి సీజన్‌కల్లా ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. అనంతరం మలేషియా పామాయిల్ బోర్డును సందర్శించారు. ఎంపీవోబీ చైర్మన్ డా.అహ్మద్ పర్వేజ్ గులామ్‌ఖదీర్‌తో భేటీ అయ్యారు.

# పేదల ఇండ్లను కూల్చితకు వ్యతిరేకం


- 'మూసీ పునరుజ్జీవం' పేదల ఇండ్ల కూల్చివేయడాన్ని భరించం
- మూసీ బాధితుల పక్షాన రేపు ఇందిరాపార్క్ వద్ద బీజేపీ మహాధర్నా
- మూసీ ప్రాజెక్టును కాంగ్రెస్ ఏటీఎంలా వాడుకోవాలనుకుంటోంది
- కాళేశ్వరం పేరుతో బీఆర్ఎస్.. మూసీ పేరిట కాంగ్రెస్‌దోపిడీ
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్

**హైదరాబాద్, అక్టోబర్ 24:** 'మూసీ పునరుజ్జీవం" పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్ల కూల్చివేయడాన్ని భారతీయ జనతా పార్టీ పక్షాన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం' అని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పథకం పేరుతో కాంగ్రెస్ పార్టీ భారీ ఎత్తున అవినీతికి తెరదీస్తోందన్నారు. రూ.1 లక్షా 50 వేల కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ పార్టీ ఏటీఎంలాగా ఉపయోగించుకోవాలనుకుంటోందని ఆరోపించారు. ఉద్యోగులకు జీతాలివ్వడమే గగనమైందని, గత పాలకులు చేసిన దాదాపు రూ.6 లక్షల కోట్ల పైచిలుకు అప్పులకు 10 నెలల్లోనే రూ.60 వేల కోట్లు వడ్డీల రూపంలో చెల్లిస్తూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్నదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించడానికే నానా తంటాలు పడుతూ సంక్షేమ పథకాలను అమలు చేయలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. ఈ డబ్బుల్లేక రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని చెప్పారు. గత పాలకులు లక్ష కోట్ల రూపాయలకుపైగా అప్పు చేసి కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకుంటే, ఇప్పుడు కాంగ్రెస్ పాలకులు 'మూసీ పునరుజ్జీవం' పేరుతో మరో లక్షన్నర కోట్లు అప్పు చేసి ఏటీఎం మాదిరిగా వాడుకోవాలని చూస్తుండటం బాధాకరమన్నారు. ఈ అప్పుల భారమంతా వివిధ రకాల పన్నుల రూపంలో ప్రజలపై భారం పడుతుందని వాపోయారు. ఇప్పటికే ప్రజలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. నాబార్డ్ సంస్థ ఇచ్చిన "ఆల్ ఇండియా రూరల్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ సర్వే" నివేదిక ప్రకారం దేశంలోనే అత్యధికంగా అప్పుల్లో ఉన్నది తెలంగాణ వాసులే అని చెప్పారు. ఒక్కో కుటుంబంపై సగటున రూ.1,29,599 అప్పు ఉందని, జాతీయ సగటు కంటే రూ.40 వేలు ఎక్కువ అని తెలిపారు.

## 'మూసీ ప్రక్షాళన'కు వ్యతిరేకం కాదు.

వాస్తవానికి భారతీయ జనతా పార్టీ 'మూసీ ప్రక్షాళన'కు వ్యతిరేకం కానేకాదని బండి సంజయ్‌స్పష్టం చేశారు. కానీ తెలంగాణ రాష్ట్రం, ప్రజల ఆర్థిక పరిస్థితి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న ఈ తరుణంలో మళ్లీ లక్షన్నర కోట్ల రూపాయలకుపైగా అప్పులు చేసి మూసీ పునరుజ్జీవం పేరుతో ప్రజలపై మోయలేని భారం మోయడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నదని చెప్పారు. పేదల ఇండ్లను కూల్చివేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోందని చెప్పారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ మూసీ బాధితుల పక్షాన నేడు(శుక్రవారం) హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. మూసీ బాధితులు, ప్రజలు పెద్దఎత్తున మహాధర్నా కార్యక్రమంలో పాల్గొనాలని పిలునిచ్చారు.

# ప్రజలు, రైతుల కోసం జైలుకు వెళ్లడానికి సిద్ధమే



- ఒకటి రెండేల్లు జైలులో ఉండడాని వెనకాడం
- కాంగ్రెస్ చీటింగ్‌పై అందరూ కలసికేసులు పెట్టాలి
- రైతుబంధు, రుణమాఫీ చేయనందుకు నిలదీయాలి
- ఆదిలాబాద్ సభలో పార్టీ శ్రేణులకు కెటిఆర్ పిలుపు

**ఆదిలాబాద్, అక్టోబర్ 24 :** ఈ రాష్ట్ర ప్రజలు, రైతుల సంక్షేమం కోసం జైలుకు పోవడానికి కూడా రెడీగా ఉన్నానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. జైలుకు పోవడానికి రెడీ.. ప్రజలు, రైతుల కోసం ఒకట్రెండు ఏండ్లు జైల్లో ఉండేందుకు సిద్ధం. ఎవనీ అయ్యకు భయపడేది లేదు. తప్పకుండా కాంగ్రెస్‌ను ఉరికించి కొట్టే రోజులు దగ్గర పడ్డాయి. అసలు చీటింగ్ కేసులు ఎవరి మీద పెట్టాలి.. తులం బంగారం ఇస్తామని చెప్పి మోసం చేసిన ఈ చార్ సౌ బీస్‌గాని మీద కేసులు పెట్టాలి. రైతుబంధు ఎగ్గొట్టి, రుణమాఫీ చేయనందుకు రైతులు కేసులు పెట్టాలి. 2 లక్షల ఉద్యోగాలని చెప్పి.. ఇప్పటి వరకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వనందుకు యువత కేసులు పెట్టాలి. ఇలా అన్ని వర్గాలు పోలీసు స్టేషన్ల ముందు లైన్లు కట్టి చీటింగ్ కేసు పెడితే ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా ఈ రాష్ట్రంలో మిగలడు అని కేటీఆర్ తెలిపారు. తప్పకుండా కాంగ్రెస్ పార్టీ నేతలను ఉరికించి కొట్టే రోజులు దగ్గర పడ్డాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని రామ్‌లీలా మైదానంలో ఏర్పాటు చేసిన రైతన్నల ధర్నాలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్ నుంచి ఉదయం ఏడున్నరకు వెళ్లినం.. కానీ కాంగ్రెస్ పాలన ఎట్ల ఉందంటే.. అన్ని పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. మేడ్చల్ వద్దనే 45 నిమిషాలు పట్టింది. ఇక డిచ్‌పల్లి వద్ద కొందరు మహిళలు రోడ్డుకు అడ్డంగా కూర్చుని ధర్నా చేస్తున్నారు. ఏం కష్టమొచ్చింది అని దిగాను. వాళ్లు పోలీసోళ్ల భార్యలు. వన్ పోలీసింగ్ కావాలని డిచ్‌పల్లి బెటాలియన్ వద్ద ధర్నా చేస్తున్నారు. ధర్నా చేస్తున్న మమ్మల్ని రక్తం కారేలా గుంజుకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఆ ఆడబిడ్డలు. అఖరికి కాంగ్రెస్ పాలనలో పోలీసోళ్ల భార్యలు ధర్నాలు చేసే పరిస్థితి.. వారు కూడా పోలీసోళ్ల చేతిలో దెబ్బలు తినే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ మండిపడ్డారు. పోలీసులను కోరుతున్నా.. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. ఇలాంటి కిరాతక పనులు బీఆర్ఎస్ పాలనలో చేయలేదు. మంత్రినో, కంత్రినో ఫోన్ చేస్తే ఆగం కాకండి.. న్యాయం, ధర్మం ప్రకారం నడుచుకోండి. పోలీసులైనా, అధికారులైనా ఎక్స్‌ట్రాలు చేస్తే పేర్లు రాసిపెట్టి మిత్తితో సహా ఇస్తాం. రేవంత్ రెడ్డి రాజు, చక్రవర్తి కాదు. చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి లాంటి నాయకులతోనే కొట్లాడినం.. వీడెంత చిట్టినాయుడు.. గింతంత మనిషి.. వాని చూసి ఆగం కావొద్దు. ఉద్యోగులు పద్ధతి ప్రకారం ఉద్యోగం చేయండి. అతికి పోతే మా టైమ్ వచ్చాక మిత్తితో సహా ఇస్తామని కేటీఆర్ హెచ్చరించారు. దే ఆదిలాబాద్‌లో ఖానాపూర్ చెరువు వద్ద 2 వేల ఇండ్లు కూలగొట్టేందుకు అధికారులు వెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఆ ఇండ్లకు పర్మిషన్లు, పట్టాలు ఇచ్చారు. బాధితుడు బొడిగెం గంగన్న నాలుగు తిట్లు తిట్టిండు. ఇల్లు కూలగొడితే ఎవడన్న ఊకుంటాడా..? ఆయన తిట్టిండని ఆయన మీద కేసు పెట్టారు.. జైల్లో పెడుతారట.. వంద రోజుల్లో అన్ని చేస్తానని తప్పించుకున్న లుచ్చాగాళ్ల మీద కేసులు పెట్టాల్నా.? పేదల మీద కేసులు పెట్టాల్నా..? అల్లం బెల్లం ఇస్తామని అడ్డగోలు మాటలు చెప్పి రైతులను మోసం చేస్తున్న లుచ్చాగాళ్లపై చీటింగ్ కేసులు పెట్టాలి. రైతుల మీద కేసులు పెడుతాం అంటే ఊరుకునేందుకు సిద్ధంగా లేమని కేటీఆర్ తేల్చిచెప్పారు.

## సరిహద్దు రాష్ట్రాల నుంచి మహారాష్ట్రకు డబ్బులు

**శివసేన నాయకుడి ఆరోపణలను ట్వీట్ చేసిన కెటిఆర్**

**హైదరాబాద్, అక్టోబర్ 24 :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక సరిహద్దులను మూసేయాలని, భద్రతను కట్టుదిట్టం చేయాలని శివసేన నాయకుడు కిరణ్ పావస్కర్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. ఎందుకంటే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక నుంచి మహారాష్ట్రకు వందల కోట్ల నగదును తరలించే అవకాశం ఉందని కిరణ్ పేర్కొన్నారు. ఈ నగదును మహా వికాస్ అఘాడీకి ఖర్చు పెట్టే అవకాశం ఉందని తెలిపారు. కిరణ్ లేవనెత్తిన అంశం జాతీయ మీడియాలో ప్రచురితం అయింది. ఈ వార్తలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ అంశంపై కేటీఆర్ కూడా ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంగా మారిందని ధ్వజమెత్తారు. ఆర్ఆర్ ట్యాక్స్ నుంచి హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల ఎన్నికలకు నిధులు సమకూర్చుతున్నారని కేటీఆర్ ఆరోపించారు.

## పెట్టుబడి పేరుతో 24 కోట్లు కాజేసిన నిందితుల అరెస్ట్

**హైదరాబాద్,అక్టోబర్ 24 :** పెట్టుబడి పేరుతో బాధితుల నుంచి రూ.24 కోట్లు కాజేసిన నలుగురు నిందితులను హైదరాబాద్ ఆర్థిక నేరవిభాగం పోలీసులు అరెస్టు చేశారు. బైబ్యాక్ పేరుతో రూ.17 లక్షలు పెట్టుబడి పెడితే.. 100 నెలల పాటు ప్రతి నెలా రూ.30వేలు ఇస్తామని ఆకర్షించారు. దీనికి అదనంగా పలు ప్రాంతాల్లో స్థలాలను రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పారు. ఆ భూమిలో గంధపు చెట్లు నాటి 13-15 ఏళ్లకు 50శాతం వాటా ఇస్తామని నమ్మబలికారు. పెట్టుబడి పెట్టిన మొదటి రెండు నెలలు చెప్పిన విధంగా రూ.30 వేలు చొప్పున ఇచ్చారు. ఆ తర్వాత డబ్బులు చెల్లించడం ఆపేశారు. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

## తెలంగాణలో మోసపోయామని చెప్పండి మహారాష్ట్రలో ఓడించమనండి

**హామీలు ఇచ్చి మోసం చేసారని తెలపండి**

**ఆదిలాబాద్ సభలో కెటిఆర్ పిలుపు**



**ఆదిలాబాద్, అక్టోబర్ 24 :** తెలంగాణలో మోసపోయామని, మహారాష్ట్రలో చెప్పి కాంగ్రెస్‌ను ఓడించాలని సరిహద్దు గ్రామాల ప్రజలకు కెటిఆర్ పిలుపునిచ్చారు. పొరుగున ఉన్న మహారాష్ట్రలో ఈ నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ లుచ్చగాళ్లకు ఓటేయొద్దని మహారాష్ట్రలో ఉన్న బంధువులకు, దోస్తులకు గట్టిగా చెప్పండి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. ఆదిలాబాద్ జిల్లాలోని రామ్‌లీలా మైదానంలో ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. నవంబర్‌లో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఆదిలాబాద్ వాళ్లకు అక్కడ చుట్టాలు, దోస్తులు ఉంటారు. కాంగ్రెస్ లుచ్చగాళ్ల సంగతి వారికి తెలియజెప్పండి.. మేం మోసం పోయాం.. మీరు మోసపోకండి అని చెప్పండి. రైతు భరోసా, తులం బంగారం, పెన్షన్లు, స్కూటీలు అని కథలు చెప్పి ఓట్లు వేయించుకుని మోసం చేశారు. ఈ కాంగ్రెస్ కు ఓట్లేస్తే మళ్లా మోసం జరుగుతదని గట్టిగా చెప్పాలని కేటీఆర్ సూచించారు. ఈ పోరాటం ఈ రోజుతో ఆగిపోయేది కాదు. ఈ ఆదిలాబాద్ ఆనాడు తెలంగాణ ఉద్యమంలో ముందుంది. బోరాజ్ చెక్ పోస్టు వద్ద వంటావార్పు చేస్తే నేనొచ్చాను. ఇవాళ ఆదిలాబాద్‌లో అగ్గి రాజుకుంది. ముత్రా కే గ్రామం వద్ద ఆగి సర్పంచ్ మీనాక్షిని పలుకరించాను. రైతులంతా కలిసి పోస్టు కార్డులు కొన్నారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా, పెన్షన్, తులం బంగారం, స్కూ.. ఎక్కడికి పోయినయ్.. ఎప్పుడు ఇస్తావని రాహుల్ గాంధీకి ఉత్తరం రాశారు. ఆనాడు ఉగ్గుపాలతోనే ఉద్యమాలు నేర్పిన గడ్డ ఆదిలాబాద్.. కుమ్రంభీం పుట్టిన ఈ గడ్డలో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పే రోజు వస్తదని కేటీఆర్ అన్నారు. రుయ్యాడ గ్రామంలో రైతుల మీద కేసులు పెట్టారని తెలిసింది. రుణమాఫీ మోసాన్ని నిరసిస్తూ దిష్టిబమ్మ కాలపెడితే కేసులు పెట్టారు. వాళ్లను జైల్లో పెడుతారట.. రైతులు బాధపడాల్సిన అవసరం లేదు. మీ కోసం మేం జైలుకు వెళ్తాం.. మీరు ఇదే విధంగా మాకు శక్తినివ్వండి.. కాంగ్రెస్ నాయకులతో మేం కొట్లాడుతాం.. కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమంలో కొట్లాడినట్టే రేపు కూడా పోరాడుతామని కేటీఆర్ స్పష్టం చేశారు.



# కేసీఆర్‌లాగే కాంగ్రెస్..

- ఏఐసీసీ చీఫ్‌కు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సంచలన లేఖ

**హైదరాబాద్, అక్టోబర్ 24 :** కేసీఆర్‌లాగే కాంగ్రెస్.. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం పట్ల ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారని అంటూ ఏఐసీసీ చీఫ్‌కు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సంచలన లేఖ రాశారు. రాహుల్ గాంధీ ఆలోచనలకు భిన్నంగా పార్టీ నడుస్తోందని తెలిపారు. పార్టీ ఫిరాయించిన వారికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వబడుతుందనే అభిప్రాయాన్ని కల్గించే విధంగా పార్టీ వ్యవహారం ఉన్నట్లు పేర్కొన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలతో పో చారం ఇంట్లో సమావేశం నిర్వహించడాన్ని ఎమ్మెల్సీ తీవ్రంగా తప్పుబట్టారు. ముఖ్య అనుచరుడి హత్యతో తీవ్ర మనోవేదనకు గురైనఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై కూడా అసహనాన్ని వ్యక్తం చేస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. తాజాగా పార్టీలో కొనసాగుతున్న పరిణామాలను జీర్ణించుకో లేక తీవ్ర మానసిక వ్యథతో ఏఐసీసీ చీఫ్‌కు జీవన్ రెడ్డి లేఖ రాశారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ గురించి లేఖలో సంచలన వ్యాఖ్యలు చేశారు. నేను నమ్ముకున్న కాంగ్రె స్ నన్ను అగౌరవంగా, అవమానంగా చూస్తోంది. నా భవిష్యత్తు కార్యాచరణ పార్టీనే మార్గదర్శకం చేయాలి. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి , పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లకు ఎమ్మెల్సీ లేఖ రాశారు. కాంగ్రెస్‌లో తనకు జరుగుతున్న అన్యాయం, పరిణామాలను వివరిస్తూ ఎమ్మెల్సీ లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే సంజయ్ అనుచరుడిగా భావించే సంతోష్ కాంగ్రెస్ పార్టీ నాయకుడిని హత్య చేశాడని వెల్లడించారు. పదేండ్లు అనేక దౌర్జన్యాలను ఎదుర్కున్నామని.. కాంగ్రెస్ ముసుగు కప్పుకొని మళ్ళీ దౌర్జన్యాలు చేస్తామంటే ఎలా భరించాలని అడిగారు. పార్టీని కన్నతల్లి అనుకున్నానని.. పార్టీ తనకు అనేక అవకాశాలు ఇచ్చిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్‌పై పోటీ చేయమంటే చేశానన్నారు. నన్ను ప్రతిపక్షాలు ఏకాకిని చేసి హేళన చేసినా తట్టుకొని నిలబడ్డాను. పార్టీ అధిష్ఠానం నా గౌరవాన్ని కాపాడతానని నోటి మాటగా చెప్పింది. పార్టీ ఫిరాయింపులకు ముఠా నాయకుడు ఉన్నాడు. పార్టీ ఫిరాయింపులకు ముఠా నాయకుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి. పది మంది ఎమ్మెల్యేలు లేకపోతే ప్రభుత్వం కొనసాగాదా.. రాహుల్ ఏం చెప్తున్నాడు. మనం ఏం చేస్తున్నాం. మా పార్టీ నాయకుడు గంగారెడ్డిని చంపిన వ్యక్తి బీఆర్ఎస్ తరపున ఎన్నికల్లో డబ్బులు పంచారు. గంగారెడ్డిని చంపిన సంతోష్‌పై అనేక క్రిమినల్ కేసులు ఉన్నాయి. గంగారెడ్డిని మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నేను ప్రపోజ్ చేశారు. ఎవరి అండదండలు చూసుకొని సంతోష్ మా నాయకుడిని చంపాడు అంటూ ఆయన ప్రశ్నలు కురిపించారు. అలాగే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌పై కూడా జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కాంగ్రెస్ పార్టీ పుట్టిందే మా ఇంట్లో అంటున్నాడు. మీ ఇంట్లో కాంగ్రెస్ పార్టీ పుడితే పరాయి ఇంటికి ఎందుకు వెళ్ళాడు. సంజయ్ ఎప్పుడైనా కాంగ్రెస్ పార్టీకి ఓటేశాడా.. నేను రాజీవ్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరాను. సంజయ్ చొక్కారావు మనవడిని అని చెప్పుకుంటున్నారు. ఇందిరా గాంధీ కష్టకాలంలో ఉన్నప్పుడు చొక్కారావు జనతా పార్టీలో చేరాడు. సంజయ్ టీఆర్ఎస్‌లో ఎన్నడూ లేడు. అక్కడి ఉద్యమ నాయకుల మధ్య సమన్వయ లోపం వల్ల సంజయ్ తెరపైకి వచ్చాడు. అభివృద్ధి జరగాలంటే అధికార పార్టీలో చేరతామంటే ప్రజాస్వామ్యం ఉంటుందా. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన కేసీఆర్ పరిస్థితి ఏమయిందని అంటూ వ్యాఖ్యలు చేశారు. అలాగే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పైనా ఎమ్మెల్సీ విరుచుకుపడ్డారు. భట్టికి ప్రతిపక్ష నేత హోదా పోవడానికి కారణం పోచారమన్నారు. పోచారం లాంటి వాడిని పార్టీలో చేర్చుకోవడం ఏంటి? పోచారం సలహాదారుడు ఏంటి. పార్టీ ఫిరాయింపుల క్రమబద్ధీకరణ విషయంలో పోచారం సలహాలు ఇవ్వగలడు అంటూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. నేను నిద్రలేని రాత్రులు గడుపుతున్నాను. పార్టీని వదిలి వెళ్ళాలనే ఆలోచన చేయలేకపోతున్న. అవమానాలు భరించుకుంటూ ఉండాలా? రేవంత్ మా నాయకుడు. ఆయన్ని తప్పకుండా కలుస్తాను. కాంగ్రెస్ కార్యకర్తల ఆవేదన మా వ్యక్తిగతం అని పీసీసీ చీఫ్ భావిస్తే నేనేం చేయగలను. పార్టీ పట్ల గౌరవం లేకనే నేను ఇక్కడి దాకా వచ్చానా.. ఇప్పటికీ నాకు పార్టీపై గౌరవం ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. రేవంత్ నాయకత్వంలో ప్రభుత్వం సమర్థవంతంగా పని చేస్తోంది. నేను రాజకీయం చేయడం లేదు. సంజయ్ భుజాలు తడుముకుంటున్నాడు. మా పార్టీ నాయకుడిని చంపిన నిందితుడు సంజయ్ అనుచరుడు కాదని చెప్పగలరా.. సంజయ్ ఏ పార్టీలో ఉన్నాడో ఆయనకి క్లారిటీ లేదా.. దానం నాగేందర్‌కు ఎంపీ టికెట్ ఇవ్వడాన్ని సమర్థించడం లేదు. నేను ఎప్పుడూ పార్టీ ఫిరాయించలేదు. నాకు నేనుగా మంత్రి పదవికి రాజీనామా చేశారు. పదేండ్లలో నేను పార్టీని నిలబెట్టాను. రాహుల్ ప్రధాని కావాల్సిందే. నామినేటెడ్ పదవులు మాకు ఇవ్వాలి. పార్టీలో మాదే ఆధిపత్యం ఉండాలి అంటే ఎలా. పార్టీ ఫిరాయించి ముసుగేసుకొని దౌర్జన్యం చేయడం బ్లాక్ మెయిల్ కాదా. నా మానసిక పరిస్థితి అర్థం చేసుకోండి. పార్టీ ఫిరాయింపులు జరిగాయో లేదో క్లారిటీ లేకుండా పోతుంది. నేను పార్టీకి అంతర్గతంగా లేఖ రాశాను. ఆవేదన భరించలేక బయటకి చెప్పుకుంటున్నానని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

## జీవన్‌రెడ్డి వ్యాఖ్యలను స్వాగతించిన వేముల

**ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటేయాలని డిమాండ్**



**నిజామాబాద్, అక్టోబర్ 24 :** కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసి ఎన్నికలకు వెళ్లాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే వేముల స్పందించారు. మీ పార్టీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసన సభాపతి ప్రసాద్, ఎమ్మెల్సీ గుత్తా సుఖేందర్ రెడ్డి త్వరగా నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రజాక్షేత్రంలోకి వెళ్దాం. ప్రజలే న్యాయ నిర్ణేతలు. మీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారు. ప్రజలు మీకు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. సొంత పార్టీ నేతలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో తగు నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు.

## కుటుంబం అంతా

# జగన్.. మాయ !

జగన్ అంతరంగం ఏమిటో బయటపడ్డది. చెల్లికి తల్లికి వాటా చెల్లించకుండా కేసులు వేసిన ఘనుడు ..ప్రజలకు మేలు చేస్తాడని, చేశాడని అనుకోవడం భ్రమే అవుతుంది. నీకింత..నాకింత అన్న చందంగా ఐదేళ్ల రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన జగన్ ఓ మంచి నేతగా మాత్రం నిరూపించుకోలేక పోయారు. అందివచ్చిన అవకాశాన్ని చేజార్చుకున్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశంతో ఎపిని దేశంలోనే అగ్రభాగానా నిలిపే అవకాశం వచ్చినా వదులుకున్నారు. ఐదేళ్లలో పోలవరం పూర్తి చేయలేదు. రాజధాని అన్నది లేకుండా చేశారు. అభివృద్ధి అన్నది లేకుండ ఆచేశారు. బటన్ నొక్కడే అభివృద్ధి అని భ్రమింప చేశారు. విశాఖలో రాజసౌధాలు నిర్మించుకున్నారు. తానే మళ్లీ ముఖ్యమంత్రి అయి..అందులో విలాసాలు సాగించాలని అనుకున్నారు. ఇలా చెప్పకుంటూ పోతే అనేకం ఉన్నాయి. ప్రజలను ఓటింగ్ యంత్రాలుగా గుర్తించి వారికి తాయిలాలు పంచి, వారినుంచి ఓట్లు పొందాలని చూశారు. కానీ ప్రజలు జగన్ నైజాన్ని గమనించి గట్టిగా బుద్ధి చెప్పారు. ఇంతటి వికృత ప్రవర్తన కలిగిన వ్యక్తి.. దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరును భ్రష్టు పట్టించారు. తండ్రిలా జగన్ ఏనాడూ ప్రజల గురించి ఆలోచించలేదు. ప్రజలను దూరం పెట్టారు. ఇప్పుడు అధికారం పోగానే నా ప్రజలో అంటూ పొలోమని పోవడం..పరామర్శించడం మాత్రం నేర్చుకున్నారు. ఇలా నమ్మిన ప్రజలే జగన్‌ను గద్దె నెక్కించిన పాపానికి ఐదేళ్లపాటు అష్టకష్టాలు అనుభవించారు. రాజధాని లేకుండా పోయింది. అడుగు మేర రోడ్డు కూడా పడలేదు. లిక్కర్, ఇసుక, భూముల దోపిడీ జరిగింది. ఈ విషయంలో ఎంత చెప్పుకున్నా తక్కువే. ఇంతలా విపరీత ప్రవర్తన ఉన్న జగన్ తన చిన్నాన్న మర్డర్ కేసును తేల్చాలని ఏనాడూ భావించలేదు. ఇప్పుడు కుటుంబానికి న్యాయం చేయడానికి ముందుకు రావడం లేదు. అందుకే జగన్ చుట్టూ ఇలాంటి వారే చేరారు. మాట తప్పను.. మడమ తిప్పను అని పదేపదే చెప్పే వైకాపా అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తన సొంత కుటుంబంలోని తల్లి, చెల్లి విషయంలోనే మాట తప్పి, మడమ తిప్పారు. ప్రేమతో చెల్లికి ఆస్తులు ఇస్తానని అవగాహన ఒప్పందం కుదుర్చుకుని మరీ ఇప్పుడు తూచ్ ఇవ్వనుపో అన్నారు. రాజకీయంగా విభేదించారన్న కారణంగా తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలపై ఏకంగా కోర్టుకెక్కారు. షర్మిల రాజకీయంగా, వ్యక్తిగతంగా ఆరోపణలు చేసి తన పరువు, ప్రతిష్ఠలను దెబ్బతీశారని, ఆమెకు తనపై ప్రేమ లేదని తేలిందని, అందువల్ల చెల్లికి ఇచ్చిన గిఫ్ట్‌డీడ్‌ను రద్దు చేసుకుంటున్నానని వెల్లడించారు. ఆమెను దూరం పెట్టిందే జగన్. ఆమెను రాజకీయంగా దూరం చేసి, ఏకాకిని చేసిన తరవాతనే షర్మిల తెలంగాణలో కాలు మోపారు. తల్లిని పార్టీ బాధ్యతల నుంచి దూరం చేశారు. ఇవన్నీ



కూడా కావాలనే చేసిన జగన్ ఇప్పుడు ఆస్తుల విషయంలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తారని అనుకోవడం మనదే తప్పు. జగన్ ప్రజల ఆస్తులనే తనవిగా చేసుకున్న తీరును గత ఐదేళ్లలో చూశాం. ఎపిని 50 ఏళ్లపాటు వెనక్కి నెట్టారు. ఫ్యూడల్ మనస్తత్వంతో పాలన చేసే వారికి తరతమ భేదాలు ఉండవు. అందుకే ఇప్పుడు ఇంట్లోనూ వాటాలు, ఆస్తుల గొడవలు సృష్టించారు. ఇలాంటి వారు ఎంతకైనా తెగిస్తారని షర్మిల అంటూనే ఉన్నారు. ప్రేమానుబంధాలతో ఆస్తుల్లో వాటా ఇచ్చారన్న కృతజ్ఞత లేకుండా షర్మిల తనకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టిందని జగన్, భారతిలు పేర్కొన్నారు. అంతేగాకుండా అవాస్తవాలు, తప్పుడు ప్రకటనలు చేశారని పేర్కొన్నారు. ఈ చర్యలు తనను రాజకీయంగా వ్యతిరేకించడంతోపాటు వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతీశాయన్నారు. అంతేగాకుండా అన్నాచెల్లెళ్ల అనుబంధంపై ప్రభావం చూపి ప్రేమ, అనుబంధాలను తగ్గించేలా చేశాయన్నారు. రాజకీయ ప్రేరేపితు రాలైన చెల్లి వ్యక్తిగతంగాను బురద చల్లారని, దీంతో ఆవేదనకు గురైన తాను తమ మధ్య ఎలాంటి ప్రేమ మిగలలేదని గుర్తించినట్లు తెలిపారు. అందుకే చెల్లికి ఇవ్వాలన్న వాటాలు ఇవ్వడానికి చేసిన అవగాహన ఒప్పందం, తల్లికి గిఫ్ట్‌డీడ్ అమలు చేయకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. షర్మిల దురుద్దేశపూరిత చర్యల ద్వారా వాటాల బదలాయింపు అక్రమంగా జరిగాయని పేర్కొన్నారు. నిజమే రేపు..ఓటర్లు కూడా తమకు ఓటేయలేదని వారికి ఎలాంటి ప్రయోజనాలు కల్పించబోనని కూడా జగన్ చెప్పే ఆస్కారం ఉంది. జగన్ ప్రవర్తనను గుర్తించి ఓటర్లు ఇప్పటి నుంచే జాగ్రత్తగా ఉండాలి. తన ప్రయోజనాలకు భిన్నంగా ఉండే ఎవరిని కూడా జగన్ క్షమించరు. వారు కుటుంబ సభ్యులైనా, రాజకీయ నేతలైనా, ప్రజలైనా జగన్‌కు ఒక్కటే. ఐదేళ్ల పాలనలో ఇదే అనుసరించారు. ఇప్పుడు కుటుంబంలో అనుసరిస్తున్నారు. చెల్లి షర్మిలకు ఆస్తి పంపకాల్లో భాగం ఇవ్వడానికి కుదిరిన ఒప్పందంలో భాగంగా ట్రస్టీగా తల్లి విజయమ్మ పేరుతో గిఫ్ట్‌డీడ్ చేసిన జగన్ ఇప్పుడు దాన్ని రద్దు చేసుకుంటానంటున్నారు. గిఫ్ట్‌డీడ్‌లో పేర్కొన్న ఆస్తులను ఆటంకాలు లేకుండా అనుభవించవచ్చని, ఇందులో దాతతోపాటు ఎవరూ జోక్యం చేసుకోరనేది ఒప్పందంలో కీలకాంశం. అయితే తనతో సహా ఎవరూ ఆస్తి పంపకాల్లో జోక్యం చేసుకోరని హామీ ఇచ్చాక దానికి విరుద్ధంగా రద్దు చేసుకోవడం చెల్లదని న్యాయనిపుణులు చెబుతున్నారు. తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సంపాదించిన ఆస్తుల్లో తనకు, తన పిల్లలకు దక్కాల్సిన వాటా ఇవ్వకుండా.. సోదరుడు జగన్ అన్యాయం చేశారని మరోవైపు వైఎస్ షర్మిల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అరకొర ఆస్తులిచ్చి వెళ్లగొట్టాలని చూడటమే కాకుండా, ఆస్తుల పంపకానికి సంబంధించి తనతో చేసుకున్న ఒప్పందాన్ని కూడా తుంగలో తొక్కారని మండిపడ్డారు. తల్లిపైనా, చెల్లిపైనా కేసు పెట్టి, కుటుంబాన్ని కోర్టుకీడ్చేంత నీచానికి ఒడిగట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తుల విషయం సెటిల్ చేసుకోవాలంటే.. జగన్‌కు, అవినాష్‌రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడకూడదని తనకు షరతు పెట్టడంపై ఆమె తీవ్రంగా మండిపడ్డారు. మొత్తంగా జగన్ ఆస్తుల గొడవ కారణంగా ఆయన మనస్తత్వం ప్రజలకు అర్థం అయివుండాలి. ఐదేళ్లుగా అనుభవంలోకి వచ్చి ఉండాలి. అందువల్ల ఎపి ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందే. జగన్ లాంటి నేతలు ఆత్మ పరిశీలన చేసుకోవాలి. రాజకీయాల్లో త్యాగాలు చేయని వారిని కూడా ప్రజలు ఆదరించరాదు.

# పత్తి రైతుల సమస్యలను పరిష్కరించాలి

## గవర్నర్‌ను కలిసి విన్నవించిన మాజీమంత్రి



**సూర్యాపేట, అక్టోబర్ 24 :** రాష్ట్రంలో పత్తి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని.. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి కోరారు.తెలంగాణ రైతాంగానికి రూ. 8257 మద్దతు ధరను ఇప్పించాలని కోరారు. అలాగే తెలంగాణ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న రూ. 475 బోనస్‌ను కూడా ఇప్పించాలని డిమాండ్ చేశారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను జగదీశ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పత్తి రైతుల సమస్యలపై రిప్రజెంటేషన్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో పత్తి రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. పత్తి రైతుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. వరదలకు గురైన పత్తి రైతులను ఈ రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని.. ఎక్కడ కూడా వారికి ఒక రూపాయి సాయం చేసినట్లు గానీ.. వారి నష్టాన్ని కూడా అంచనా వేసే ప్రయత్నం కూడా చేయలేదన్నారు. అదే సమయంలో పత్తికి సంబంధించి మన రాష్ట్రం పట్ల కేంద్రం కూడా వివక్ష చూపిస్తుందన్నారు. వాస్తవానికి గుజరాత్ రాష్ట్రం పండించే పత్తి కంటే తెలంగాణ రాష్ట్రం రైతాంగం పండించే పత్తి మంచిదని, నాణ్యమైందని అనేక సందర్భాల్లో (సిసిఐ) కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రశంసించిందిన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. గుజరాత్ రాష్ట్రంలో మాదిరిగా వరుసగా అకాల వర్షాలతో పత్తి తడిసిపోయి దెబ్బతిన్నదని.. రావలసిన దిగుబడి కూడా అందలేదని.. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి వున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం అంచనా ప్రకారం ఎకరానికి 10 నుంచి 12 క్వింటాలు వరకు రావాల్సిన పత్తి ఈ ఏడాది అకాల వర్షాలతో నాలుగు క్వింటాలు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. అందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణ రైతాంగానికి నష్టపరిహారాన్ని కట్టించాలని.. దానిపైన ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. అదేవిధంగా ఇప్పటివరకు సిసిఐకి సంబంధించిన కేంద్రాలను ఎక్కడ కూడా ప్రారంభించలేదని.. అక్కడక్కడ ఒకటి రెండు కేంద్రాలు తెరిచినప్పటికీ వచ్చిన పత్తిలో తేమశాతం ఎక్కువగా ఉందని.. ఆ వంకతో పత్తిని తీసుకోవడానికి నిరాకరిస్తున్నారన్నారు. దీంతో రైతులు తమ పత్తిని దళారులకు క్వింటాను రూ. 5 వేలకు అమ్ముకుని దోపిడీకి గురవుతున్నారన్నారు. రైతులకు ఈసారి పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని.. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుం దన్నారు. మరోవైపు వడ్ల కొనుగోలుకు సంబంధించి ఇప్పటివరకు విధివిధానాలు కూడా సరిగా నిర్వర్తించలే దని తెలిపారు. ఈ విషయాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి తెలంగాణ రైతాంగాన్ని ఆదుకోవాలని గవర్నర్‌కు మెమొరండం అందజేసినట్లు జగదీశ్ రెడ్డి తెలిపారు.

# విద్యార్థులకు చిన్ననాటి నుంచే సంస్కృతి అలవర్చాలి

## మాజీ ఉపరాష్టపతి వెంకయ్యనాయుడు



**హైదరాబాద్,అక్టోబర్ 24 :** భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చిన్నారులకు విద్యార్థి దశ నుంచే అలవాటు చేయాలని మాజీ ఉపరాష్టపతి వెంకయ్యనాయుడు తెలిపారు. కాకర్ల సుబ్బారావు శతజయంతి వేడుకల్లో భాగంగా మాదాపూర్ శిల్పకళా వేదికపై ఇంటర్నేషనల్ స్కూల్ షేక్‌పేట్ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కిమ్స్ ఆసుపత్రి వ్యవస్థాపకులు భాస్కర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ చిన్నారులు ఫోన్లలకు అలవాటు పడి మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారని, వారిని వాటికి దురంగా ఉంచాలన్నారు. చిన్నారులకు ఏం నేర్పిస్తామో వాటినే అలవాటు చేసుకుంటారని చెప్పారు. ప్రస్తుతం విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అధికంగా ఉందన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అకట్టుకున్నాయి. కాకర్ల సుబ్బారావు వైద్య రంగంలో చేసిన కృషిని వివరిస్తూ విద్యార్థులు నాటికను ప్రదర్శించారు.

# జానీ మాస్టర్‌కు బెయిల్

## షరతులతో కూడిన బెయిల్ మంజూరు



**హైదరాబాద్, అక్టోబర్ 24 :** లైంగిక వేధింపుల కేసులో నిందితుడిగా ఉన్న కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు బెయిల్ మంజూరైంది. తనని లైంగికంగా వేధించారన్న మహిళా కొరియోగ్రాఫర్ ఫిర్యాదు మేరకు ఆయనపై పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో రెండు వారాలుగా ఆయన చంచల్‌గూడ జైలులో ఉన్నారు. పోక్సో చట్టం కింద కేసు న మోదవడంతో ఆయనకు ప్రకటించిన నేషనల్ అవార్డును నిలిపివేస్తున్నట్లు అవార్డుల కమిటీ ప్రకటించింది. ఈ అవార్డు ఫంక్షన్ కోసం జానీ మాస్టర్ మధ్యంతర బెయిల్ కూడా పొందారు. తాజాగా మరోసారి తనకు బెయిల్ మంజూ రు చేయాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించగా షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. జానీ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడంటూ ఆయన అసిస్టెంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2017లో జానీ మాస్టర్ పరిచయమయ్యాడు. 2019లో అతని బృందంలో సహాయ నృత్య దర్శకురాలిగా చేరాను. ముంబయిలో ఓ సినిమా చిత్రీకరణ నిమిత్తం జానీ మాస్టర్‌తో పాటు నే ను, మరో ఇద్దరు సహాయకులం వెళ్లాం. అక్కడ హోటల్‌లో నాపై జానీ మాస్టర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే పని నుంచి తొలగిస్తానని, సినిమా పరిశ్రమలో ఎప్పటికీ పని చేయలేవని బెదిరించాడు. దీన్ని అవకాశంగా తీసుకుని.. హైదరాబాద్ నుంచి ఇతర నగరాలకు సినిమా చిత్రీకరణకు తీసుకెళ్లిన సందర్భాల్లో పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. షూటింగ్ సమయంలోనూ వ్యానిటీ వ్యాన్‌లో అసభ్యంగా ప్రవర్తించేవాడు. వేధింపులు భరించలేక జానీ మాస్టర్ బృందం నుంచి బయటకొచ్చేశాను. అయినా సొంతంగా పని చేసుకోనివ్వకుండా, ఇతర ప్రాజెక్టులు రానీయకుండా ఇబ్బంది పెట్టాడని ఫిర్యాదులో బాధితురాలు పేర్కొన్నారు.

# డిపిఆర్ లేకుండానే మూసీ పునరుద్ధరణ

## ప్రభుత్వ తీరుపై మండిపడ్డ ఈటెల

**హైదరాబాద్, అక్టోబర్ 24 :** మూసీ పునరుజ్జీవానికి ఇళ్లు కూల్చడం దేనికని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. మూసీ విషయంలో ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తున్న తీరును భాజపా ఖండిస్తోందన్నారు. భాజపా ఎప్పుడూ పేదల పక్షానే ఉంటుందని స్పష్టం చేశారు. డీపీఆర్ లేకుండా మార్కింగ్ ఎట్లా చేస్తావ్ రేవంత్.. నిన్ను ఎన్నుకుంటే పేదల బతుకు ఇట్లా ఆగం చేస్తావా? గత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ పేరిట క్రమబద్ధీకరణ చేసింది. వాటిని భారాస స్థిరాస్తి వ్యాపారులు పేదలకు విక్రయించారు. మళ్లీ ఇప్పుడు ఆ పార్టీ నేతలే మొసలి కన్నీరు కారుస్తున్నారు. చెరువులన్నీ క్లీన్ చేయండి అభినందిస్తాం. డ్రైనేజీ నీరు మూసీలో కలవకుండా చూడండి. మూసీ ప్రక్షాళనకు మేం వ్యతిరేకం కాదు. అందులో విష రసాయనాలు కలుస్తున్నాయి. వాటిని అరికట్టి డైవర్షన్ చెయ్యి చాలు. ఎక్కడైనా ఎస్టీపీలు పనిచేస్తున్నాయా? పనిచేస్తే ఇంకా దుర్గంధం ఎందుకుంది. గత సీఎం హుస్సేన్ సాగర్‌ను ఎందుకు బాగు చేయలేదు. సచివాలయం బఫర్ జోన్‌లో కట్టలేదా? పేదల ఉసురు మంచిది కాదు.. బుల్డోజర్లకు అడ్డంగా పడుకుంటాం. శుక్రవారం జరిగే మహాధర్నాకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలి‘ అని ఈటల పిలుపునిచ్చారు.



# అమోయ్ కుమార్

- రెండో రోజూ ఈడీ విచారణకు అమోయ్‌కుమార్
- వెలుగు చూసిన రెండు జిల్లాల్లో చేసిన అక్రమాలు
- భూదాన్ భూములపై దర్యాప్తు చేస్తున్న ఈడీ
- అమోయ్ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసిన అధికారులు
- రెండో రోజూ ఒంటరిగా హాజరైన ఐఏఎస్‌ఆఫీసర్



**హైదరాబాద్, అక్టోబర్24:** ఈడీ విచారణలో వెలుగుచూసిన ఐఏఎస్ అమోయ్ కుమార్ అక్రమాలు రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో కలెక్టరుగా పనిచేసిన అమోయ్ కుమార్ అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. రెండో రోజు ఈడీ విచారణలో పలు అక్రమాలు బయటపడ్డాయి. తెలంగాణ రా ష్ట్రంలో ఐఏఎస్ అధికారి అమోయ్‌కుమార్ అక్రమాలు తవ్వేకొద్దీ వెలుగుచూస్తూనే ఉన్నాయి. రెండు రోజు లుగా భూదాన్ భూముల అక్రమాలపై అమోయ్ కుమార్ ను ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. రంగారెడ్డి కలెక్టరుగా పని చేసినపుడు అమోయ్‌కుమార్ మహేశ్వరం మండలం లోని నాగారంలో భూదాన్ భూముల విషయంలో అక్రమాలకు పాల్పడినట్లు తేలింది. గురువారం హైదరాబాద్ నగరంలోని ఈడీ కార్యాలయంలో సీనియర్ ఐఏఎస్ అమోయి కుమార్ ను అధికారులు విచారించారు. ఏడు గంటల పాటు ఇతన్ని విచా రించి పలు విషయాలు రాబట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమోయ్ కుమార్ పలు అక్రమాలకు పాల్పడ్డారని వెల్లడైంది. దీంతో బుధవా రం నుంచి ఇతన్ని ఈడీ అధికారులు విచారిస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ పశుసంవర్ధక శాఖ సంయుక్త కార్యదర్శిగా పనిచేస్తున్న అమోయ్ కుమార్ ఈడీ విచారణ కోసం బషీర్‌బాగ్ కార్యాలయానికి వచ్చారు. అమోయ్ కుమార్ కలెక్టర్‌గా శేరిలింగంపల్లి, నానక్ రాం గూడ భూముల అ క్రమాలు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. వీటి విష యంలోనూ ఈడీ అధికారులు విచారణలో ప్రశ్నలు అడిగారు. ఈ భూముల బాగోతంలో పలువురు బీఆర్ఎస్ నేతలతో పాటు అప్పటి మంత్రుల హస్తం ఉందని చెబుతున్నారు.

### బయటపడిన భూదాన్ బండారం

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలో భూదాన్ భూములైన వందల కోట్ల రూపాయల విలువైన 42 ఎకరాలు అక్రమంగాప్రైవేట్ వ్యక్తులకు బదిలీ చేశారని ఈడీ విచారణలో తేలింది. ఈ భూమికి పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇచ్చారని వెల్లడైంది. హైదరాబాద్ నగర శివారులోని అబ్దుల్లాపూర్మెట్ గ్రామం లో సర్వేనెంబర్ 17 లో పూర్వీకుల నుంచి కొంత మంది రైతులకు సంక్రమించిన 26 ఎకరాల సాగుభూములు బలవంతంగా లాక్కున్నారని ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంలో కోట్ల రూపాయల ముడుపులను అమాయ్ కుమార్ తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి.దీంతో నిజాన్ని నిగ్గు తేల్చేందుకు ఈడీ విచారణ జరుపుతోంది. అమోయ్ కుమార్ స్టేట్‌మెంట్‌ను అధికారులు రికార్డు చేశారు.



# రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

- ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గన్ని బ్యాగులను,టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచుకోవాలి
- జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్

వారధి న్యూస్, జగిత్యాల ప్రతినిధి : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జగిత్యాల రూరల్ మండలంలోని పోరండ్ల,గుల్లపేట గ్రామాల్లో ఐకేపీ ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐకేపీ కేంద్రంలో ఏర్పాటు చేసిన వివరాలు పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా త్రాగునీటి వసతి కల్పించాలని సూచించారు. ఆధార్ పట్టా పాస్ బుక్ వంటి వివరాలను కేంద్రంలో పెట్టాలని సూచించారు.
అనంతరం ఆరబోసిన ధాన్యం యొక్క తేమ శాతాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో సరిపడా ప్యాడి క్లీనింగ్ మెషిన్స్,గన్ని బ్యాగులు,టార్ఫలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.వర్షం పడే అవకాశం ఉన్నందున ఐకేపీ సెంటర్లలో ధాన్యం తడవకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రైతులు ఆరబెట్టిన వరి ధాన్యాన్ని క్లీనింగ్ చేసి కొనుగోలు చేయాలని తెలిపారు.రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్యాడి క్లినర్ మిషన్ పని తీరును కలెక్టర్ పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో, ఆర్డిఓ, శ్రీనివాస్ ,అడిషనల్ డి.ఆర్.డి.ఏ మధన్ మోహన్, డి.ఎస్.ఓ డి.ఎం, తహసీల్దార్ , ఎం.పీ.డీ.వో, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ కమిషన్ చైర్మన్ ఉమ్మడి జిల్లా కేంద్రంలో నవంబర్ 8న పర్యటన

- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో: వెనుకబడిన తరగతుల కులాల అభివృద్ధి, సామాజిక రాజకీయ, ఆర్థిక విశ్లేషణ చేసేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నేతృత్వంలో నవంబర్ 8వ తేదీన మహబూబ్ నగర్ కలెక్టరేట్లు సమావేశం కానున్నట్లు నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు.
నాగర్ కర్నూల్ జిల్లా ప్రజలు బి.సి. కమీషన్ చైర్మన్, బృందం సభ్యులకు తమ తమ అభిప్రాయాలను తెలియజేసేందుకు నవంబర్ 8వ తేదీన మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి ఉదయం 10 గంటలకు చేరుకోవాలని కలెక్టర్ తెలిపారు.
బిసి కమిషన్ సభ్యులు జిల్లాలోని వెనుకబడిన తరగతుల కులాల వారు అనగా ఎస్.సి / ఎస్.టి / బి.సి / మైనారిటీ / సంచార జాతుల వారి సామాజిక, రాజకీయ, మరియు ఆర్థిక విశ్లేషణ పై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.
జిల్లాలోని వివిధ సామాజిక వర్గాల వారు, ప్రజా ప్రతినిధులు, ఆసక్తికలవారు తమ అభిప్రాయాలను వ్రాత పూర్వకముగా బి.సి. కమీషన్ బృందం వారికి అందజేయవచ్చును. అభ్యర్ధనతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన పార్మాట్ ను పూరించి 5 సెట్లను మహబూబ్ నగర్ కలెక్టరేట్ లో బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులకు తమ తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చు అని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు.



# చిన్న పిల్లల గుండె వ్యాధులపై ఉచిత వైద్య శిబిరం

- అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్

వారధి న్యూస్, వనపర్తి : అక్టోబర్ 26న వనపర్తి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్న పిల్లల గుండె వ్యాధుల ఉచిత వైద్య శిబిరం - అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ గుండె సమస్యలు ఉన్న చిన్న పిల్లల కోసం అక్టోబర్ 26న వనపర్తి జిల్లా కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారని, ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ తెలిపారు. ఈ శిబిరం ఎన్.ఎం.డి.సీ లిమిటెడ్ సౌజన్యంతో హృదయ ఫౌండేషన్, హైదారాబాద్ వారి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు టీచర్స్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతుంది. ఈ శిబిరంలో పిడియాట్రిక్ కార్డియాలజీ స్పెషలిస్ట్ లు అందుబాటులో ఉంటారు, 2డి ఎకో సేవలు కూడా అందిస్తారు. శిబిరానికి వచ్చే వారు పాత రిపోర్టులతో పాటు, తెల్ల రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు తెచ్చుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9154289381 నెంబర్ సంప్రదించవచ్చని తెలిపారు.

# ప్రతి ఎకరాకు రెండు పంటలకు నీరు అందించడమే లక్ష్యం

- నీటి పారుదల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



వారధి న్యూస్, హైదరాబాద్: హైదరాబాద్ ఎర్రమంజిల్ లోని నీటి పారుదల శాఖ కార్యాలయంలో ఈఎన్ సి నాగేందర్ రావుతో కలిసి నీటి పారుదల శాఖ అధికారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్టేషన్ ఘనపూర్ రిజర్వాయర్ నుండి నవాబు పేట రిజర్వాయర్ వరకు మెన్ కెనాల్ మరియు డిస్ట్రిబ్యూ యుటర్స్ లో పేరుకుపోయిన పూడికను వెంటనే తొలగించాలని తెలిపారు. అలాగే ఘనపూర్ నుండి నావబుపేట వరకు ఉన్న ప్రధాన కెనాల్ కు పడిన గండిని వెంటనే పూడ్చి వెయ్యడంతో పాటు పూడికను తొలగించాలని కోరారు. అశ్వరవు పల్లి, రైట్ మేన్ కెనాల్ మరియు డిస్ట్రిబ్యూ యుటర్స్ లో పూడిక తొలగించడంతో పాటు,డిస్ట్రిబ్యూటర్స్ ఏర్పాటుకు అవసరమైన భూ సేకరణ సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అశ్వరాయిపల్లి రిజర్వాయర్ కింద ఉన్న పూర్తి ఆయా కట్టుకు నీరు అందించడానికి %ూ% లు మరియు తూములు, స్ట్రక్చర్ మరమ్మాత్తులు వెంటనే చేపట్టాలని సూచించారు. పాముసూరు వద్ద బంజారా మాటు నిర్మాణానికి పంపిన ప్రతిపాదనలకు వెంటనే మంజూరు చెయ్యాలని కోరారు. జపర్గట్ మండలం లోని దంస చెరువుకు పీడర్ ఛానల్ తవ్వకాన్ని వెంటనే చేపట్టాలని, దానికి కావాల్సిన వర్క్ ఎస్టిమేషన్ను ప్రభుత్వనికి పంపించాలని అన్నారు. ధర్మసాగర్ రిజర్వాయర్ కింద ఉన్న నక్కల తూముకు రిపేర్ చెయ్యడం తో పాటు, కూరుకు పోయిన డిస్ట్రిబ్యూ యుటర్స్ లను పురుద్ధించాలని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ 4 డిస్ట్రిబ్యూ యుటర్స్ కి రెగ్యులర్ రేటర్ అమర్చాల్సిన అవసరం ఉందని 3నెలల్లో టెండర్లను పిలిచి పనులను పూర్తి చెయ్యాలని అన్నారు. బొమ్మకూరు లెఫ్ట్ మేన్ కెనాల్ పైన ఖిల్లాషాపూర్ దగ్గర నిర్మాణం చేపడితే ఆపైన ఉన్న గ్రామాలకు నీరు అందించవచ్చని కావున వెంటనే నిర్మాణాన్ని చేపట్టాలని అన్నారు.
పై విషయాలపై సానుకూలంగా స్పందించిన ఈఎన్ సి నాగేశ్వరావ్ వెంటనే అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సీఈ,ఎస్ ఈలు, ఈఈ లు,ఇతర అధికారులు పాల్గొన్నారు.



# ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్క్రుటిని త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:** నాగర్ కర్నూలు జిల్లాలో దరఖాస్తు చేసుకున్న ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల స్క్రుటిని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్, నీటిపారు దల, రెవిన్యూ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుల పురోగతి పై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని నాగర్ కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట పట్టణ ప్రాంతాల పరిధిలో44054 దరఖాస్తులు వచ్చాయని, జిల్లావ్యాప్తం గా గ్రామీణి ప్రాంతాలలో 23,255 దరఖాస్తులు వచ్చాయి, జిల్లా వ్యాప్తంగా మొత్తం 67,309 ఎల్. ఆర్.ఎస్ దరఖాస్తుల, వివరాలను మండలాల వారీగా కలెక్టర్ తెలుసుకుంటూ పెండింగ్ ఎల్.ఆర్. ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల పై పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ.. ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుల స్క్రుటిని ప్రక్రియ 4 దశలలో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించిందని కలెక్టర్ తెలిపారు. ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తు లను సర్వే నెంబర్ వారీగా సంబంధిత రెవెన్యూ గ్రామం/మున్సిపాలిటీ లలో బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన చేసి జిపిఎస్ ద్వారా సదరు భూమి కో ఆర్డినేట్స్ పక్కాగా నమోదు చేస్తూ అదే సమయంలో ఈ భూములు నీటి వనరుల బఫర్ జోన్ ,నాలా, చెరువులు ,హెరిటేజ్ బిల్డింగ్ పరిధి లో వస్తుందో లేదో చెక్ చేసి ధ్రువీకరించాలని అన్నారు. జిల్లాలో పెండింగ్ ఉన్న ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫీల్డ్ లెవల్ సర్వే ధృవీకరణ ప్రక్రియ దరఖాస్తులు యాక్సెప్ట్ లేదా రిజెక్ట్ పక్కాగా జరగాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మొదటి దశలో ధ్రువీకరణ పూర్తి చేసుకున్న దరఖాస్తులను నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా, రోడ్డు వెడల్పు ఓపెన్ స్పేస్ మొదలగు నిబంధనలు లేఔట్ లో పాటించారా అనే అంశాన్ని పరిశీలించి టౌన్ ప్లానింగ్ అధికారి ఆమోదించాలని, ఎల్.ఆర్.ఎస్ క్రింద భూముల క్రమబద్ధీకరణకు జనరేట్ ఐన ఫీజు వివరాలు దరఖాస్తుదారులకు తెలియజేసి త్వరగా చెల్లించేలా ఫాలో అప్ చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు.
ప్రతి మండలం పరిధిలో పెండింగ్ ఉన్న దరఖాస్తులను అధికారులు నిర్దేశిత సమయంలోగా ధ్రువీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం, డిపిఓ రామ్మోహన్రావు, నీటిపారుదల శాఖ ఈఈ మురళి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అరుణ, నాగర్ కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్లు ఇంజనీరింగ్ అధికారులు ,ఎం.పి.ఓ.లు, మున్సిపాలిటీల టౌన్ ప్లానింగ్ అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# విద్యతో పాటు సమాజంలోని పరిణామాలపై అవగహన పెంచుకోవాలి

- పోలీస్ శాఖ పనితీరు, వివిధ అంశాలపై అవగాహన కల్పించాలనే " ఓపెన్ హౌస్"
- జిల్లా ఎస్పి అశోక్ కుమార్

**వారధి న్యూస్, జగిత్యాల ప్రతినిధి :** విద్యార్థులు విద్యతో పాటు సమాజం లో జరుగుతున్న పరిణామాల పై అవగహన పెంచుకోవాలని జిల్లా ఎస్.పి అశోక్ కుమార్ అన్నారు. గురువారం. పోలీస్ ఫ్లాగ్ డే, పోలీస్ అమరవీరుల సంస్మరణలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో పాఠశా లల విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.పి మాట్లాడుతూ పోలీస్ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలపై,పోలీస్ శాఖ పనితీరు, వివిధ అంశాలపై విద్యార్థిని, విద్యార్థు లకు అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో ఓపెన్ హౌస్ కార్యక్రమా న్ని నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్ అంటే ఏమిటి, అది ప్రజలకు శాంతి భద్రతల విషయంలో ఏ విధంగా ఉపయోగపడుతుంది, దాని ఫంక్షన్నింగ్ ఏ విధంగా ఉంటుందో తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, అందు కోసం స్టాల్స్ ను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగహన కల్పిం చడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల కు వివరించిన వాటిలో ఫ్రెండ్లీ పోలిసింగ్ విధానం ద్వారా ప్రజలకు దగ్గర అవుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఉదయం,రాత్రులు బీట్స్,పెట్రోలింగ్ వ్యవస్థలు ఏ విధంగా పని చేస్తాయో తెలిపారు. పోలీసు శాఖ నేరస్తులను సులువుగా గుర్తించడం కోసం అభివృద్ధి చేసిన ఫేస్ రికగ్నిషన్ సిస్టం,పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ వంటి నూతన సాంకేతికతల గురించి వివరించారు. నేరాలు జరగకుండా నివారించడం లో, జరిగిన నేరాన్ని త్వరగా చేదించ చడం లో సి.సి కెమెరాలు ఏవిధంగా ఉపయోగపడతాయో అర్థం చేయిం చారు. మహిళలు,విద్యార్థినుల రక్షణ కోసం ఏర్పాటైన షీ టీమ్ లు,భరోసా సెంటర్ ఏవిధంగా పని చేస్తాయో వారికి వివరించారు. పోలీస్ శాఖ ఉ పయోగించే ఆయుధాలు,వాటి పనితీ రు, ఏ సందర్భాలలో ఉపయో గపడతాయో వివరించడం జరిగింది. బాంబ్ స్క్వాడ్స్ ఏవిదంగా బాంబుల ను నివృత్తి చేస్తుందో, సైబర్ నేరాల గురించి ఏవిధంగా అప్రమత్తంగా ఉండాలో అవగాహన కలిగించారు. ఆన్లైన్లో అపరిచితులతో పరిచయా లకు దూరంగా ఉండాలని, ఏదైనా సైబర్ క్రైమ్ కు గురి అయినట్లయితే వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 కు కాల్ చేసి మీ యొక్క ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. అర్మోరర్లు, బాంబ్ స్క్వాడ్ టీం,ఐ. టి కోర్ ,భరోసా సిబ్బంది,షీ టీమ్, ఫింగర్ ప్రింట్స్, కమ్యూనికేషన్ సిబ్బంది విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరును వివరించడం జరిగింది. ఈ కార్యక్రమాలలో అడిషనల్ ఎస్.పి భీం రావ్,జగిత్యాల డిఎస్పీ రఘుచందర్, ఆర్.ఐ లు కిరణ్ కుమార్, రామక్రిష్ణ, వేణు, ఐటి కోర్, డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ లు శ్రీనివాస్, రఫీక్ ఖాన్, ఫింగర్ ప్రింట్స్ ఇన్స్పెక్టర్ రాజు, ఆర్.ఎస్.ఐ లు విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




## చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి కఠిన శిక్షలు

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి. రజని

వారధి న్యూస్, వనపర్తి: చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన శిక్షలు అనివార్యం అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి. రజని తెలిపారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో విద్యార్థులకు ఆమె ఈ మేరకు సందేశం ఇచ్చారు. సదస్సు సందర్భంగా ఆమె మైనర్ పిల్లల వాహన ప్రయాణం, బాల్య వివాహాలు, మరియు పిల్లల చేత పనులు చేయించడం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సమస్యలు తలెత్తుతాయని వివరించారు. సమాజంలో చట్టాల అమలుకు ప్రతి పౌరుడి సహకారం అవసరమని, యువత చట్టాలపై అవగాహన పెంచుకొని సమాజ సేవకు ముందుకు రావాలని సూచించారు. న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు దేగల కృష్ణయ్య మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనబోమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సఖి కేంద్రం నిర్వాహకురాలు ఎం. కవిత, న్యాయవాదులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## చర్మకారుల సమస్యలను పరిష్కరించాలి

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరశురాములు

వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో: చర్మకారుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరశురాములు అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెప్పులు కుట్టే వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల లోన్ ఇవ్వాలని, అదేవిధంగా టూల్ కిడ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బహుళ జాతి కంపెనీల వల్ల రకరకాల చెప్పులు మార్కెట్లోకి విచ్చలుడిగా రావడం వల్ల, చర్మకారులు తయారు చేసిన చెప్పులకు గిరాకి లేకుండా పోయిందని వృత్తే కనుమరుగయ్యే పరిస్థితి ఉందని వారు అన్నారు. కావున చర్మకారులు కుట్టే చెప్పులకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. జిన్ కుంట లెదర్ పార్క్ ను పనులు ప్రారంభిస్తే దళిత నిరుద్యోగ యువతీ యువకులకు వెయ్యి మందికి పని కల్పించవచ్చని అన్నారు. కానీ పాలకులు పట్టించుకోవడంలేదని అన్నారు. ప్రస్తుతం చర్మకారులు, పట్టణాల్లో సంతల్లో, తెగిపోయిన చెప్పులు కుట్టడం, బూట్లకు పాలిష్ వేయడం వంటి పనులు చేయడం వల్ల కుటుంబం గడవడం కష్టంగా మారిందని అన్నారు. వారికి టూల్ కిడ్స్ ఇచ్చి, పట్టణాల్లో అడ్డాల దగ్గర, బంకులు ఏర్పాటు చేసి ఇవ్వాలని వారి డిమాండ్ చేశారు. చర్మకారుల సమస్యలు పరిష్కారమయ్యేందుకు మండల స్థాయిలో కమిటీలు వేసి, జిల్లా స్థాయిలో జరిగే భారీ ధర్నాకు తరలిరావాలని ఆయన కోరారు. జిల్లా పరిషత్ ఆఫీసు నుంచి 16% నిధులు గత మూడు నాలుగు సంవత్సరాల నుంచి ఎస్సీ కార్పొరేషన్ చెల్లించవలసిన నిధులు 52 లక్షల రూపాయలు బకాయిలు ఉన్నాయి. వాటిని వెంటనే చెల్లించి ఇయర్ మార్క్ ఫండ్ కింద చర్మకారులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల లోన్ లోను ఇస్తే, తోలు, అధునాతన టెక్నాలజీ, కొనుక్కొని వృత్తిని కొనసాగించడానికి అవకాశం ఉంటుందని అన్నారు. చెప్పులు కుట్టే వారంతా దళితులు, ఆర్థికంగా ఎనకబడినవారు కావున ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి వారిని ఆదుకోవాలని కోరినారు. పనిచేస్తున్నప్పుడు రంపం శరీరానికి తగిలి గాయాలైనప్పుడు వారి పరిస్థితి దుర్భరంగా మారుతుందని అన్నారు. చర్మకారులు ఆదుకునేందుకు ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న, జిల్లా ఉపాధ్యక్షులు హనుమగళ్ల హనుమంత్, పులిజాల అశోక్ బంతిని రాజు సంఘం సీనియర్ నాయకులు హనుమ గళ్ళ సత్యనారాయణ నందిపేట భాస్కర్ కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా యూనివర్సిటీ గేమ్స్ లో సెలక్ట్ అయినా జనగామ ఏకశీల డిగ్రీ కళాశాలకు చెందిన టైక్ వాండో విద్యార్థిని బానోతు రుద్ర



వారధి న్యూస్, జనగామ : వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించిన ఆల్ ఇండియా యూనివర్సిటీ గేమ్ సెలక్షన్లో భాగంగా ఈ రోజు జనగామ జిల్లా ఏకశీల డిగ్రీ విద్యార్థిని బానోతు రుద్ర 62 కేజీల విభాగంలో ఫైట్లో సెలక్ట్ కావడం జరిగింది. నవంబర్ లో 12 నుండి 15 వరకు జరుగబోయే ఆల్ ఇండియా యూనివర్సిటీ గేమ్స్ లో పార్టిస్పెషన్ లో రుద్ర పాల్గొన బోతుంది. జనగామ ఏకశీల డిగ్రీ కళాశాల యాజమాన్యం ప్రిన్సిపాల్ మల్లిఖార్జున మాట్లాడుతూ... మా కళాశాల విద్యార్థి బానోతు రుద్ర ఇప్పటికి చాలా మెడల్స్ సాధించింది మా కళాశాలకు జనగామ కి మంచి పేరు తీసుకువచ్చింది. ఇప్పుడు కూడా ఆల్ ఇండియా యూనివర్సిటీలో మెడల్ సాధించాలని కోరుకుంటున్నాము. విద్యార్థి రుద్ర మాట్లాడుతూ... స్పోర్ట్స్లో నాకు సపోర్ట్ చేసిన ప్రిన్సిపాల్ మల్లికార్జున కు, యాజమాన్యానికి నాగరాజు కు నా కోచ్ ఎండీ అబ్బాస్ మాస్టారు కు ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతున్నని రుద్ర అన్నారు.

# నిర్వాసితులకు అండగా ఉంటాం

- అన్ని వసతులతో ఆర్ అండ్ ఆర్ కాలనీని నిర్మిస్తాం
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో : నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని, ముంపు గ్రామాల ప్రజలు ఎవరు అధైర్య పడొద్దని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం కొల్లాపూర్ మండలంలోని ఎర్రగుట్ట, బొల్లారం తండా, వడ్డే గుడిసెలు, అంజన్న గిరి, బోరబండ తండా, దూల్య నాయక్ తండా గ్రామాలు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న గ్రామస్థులను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచనల మేరకు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సందర్శించి, గ్రామస్తులతో కలసి ముంపు ప్రాంతాలను పర్యటించి సమస్యలను కలెక్టర్ గుర్తించారు. ఒంపుకు గురవుతున్న ఆయా గ్రామాల ప్రజల అవసరాలు, పునరావాసానికి కావలసిన సదుపాయాలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముంపు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం తరఫున అన్ని సదుపాయాలు కల్పించి మంచి ఆర్ అండ్ ఆర్ కాలనీని నిర్మించి, ఆ కాలనీలో ప్రభుత్వ పాఠశాల, ప్రాథమిక ఆసుపత్రి, విశాలమైన సిసి రోడ్లు, అండర్ డ్రైనేజ్, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలతోపాటు ప్రజలకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించడం జరుగుతుందని, అందుకు మంత్రివర్యులతోపాటు, జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో నిర్వాసితులకు అండగా ఉంటామని కలెక్టర్ ఈ సందర్భంగా గ్రామస్తులకు వివరించారు. గ్రామస్తులు తమకు ఇల్లు కట్టుకునేందుకు నివాసస్థల లకుకు పట్టాలు ఇవ్వాలని, ఫారెస్ట్ అధికారుల నుంచి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, ముంపులో కోల్పోయిన భూములకు భూములు ఇచ్చే విధంగా చూడాలని రైతులు, గ్రామస్తులు కలెక్టర్ కు విన్నవించుకున్నారు. 125, 176 సర్వేనెంబర్ రైతులకు తగిన పరిహారం చెల్లించాలని రైతులు కలెక్టర్ ను కోరారు. ఎర్రగట్టు, బొల్లారం లో గ్రామంలో ఫారెస్ట్ అధికారులతో కలిసి గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ఫారెస్ట్ భూమి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 64 కుటుంబాలు నివసిస్తున్నారని, ఇండ్ల నిర్మాణాన్ని ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారని, ఈ సందర్భంగా కలెక్టర్కు పలువురు గ్రామస్తులు తెలియజేశారు. బోరబండ తండా గ్రామపంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 125,176 భూముల కు సంబంధించిన రైతులకు పరిహారం ఆర్ అండ్ ఆర్ కాలనీకి షిఫ్టింగ్ కావాలని గ్రామ-స్తులకు కలెక్టర్ తెలియజేశారు. అంత ముందు తమ గ్రామానికి సందర్శించి వచ్చిన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ను ఆయా గ్రామాల ప్రజలు పుష్ప గుచ్చం, శాలువాతో సత్కరించారు. కలెక్టర్ వెంట కొల్లాపూర్ ఆర్డీవో యాదగిరి, తహసిల్దార్, వివిధ శాఖల అధికారులు కొల్లాపూర్ మాజీ జెడ్పిటిసి హనుమంతు నాయక్, ఆయా ముంపు గ్రామాలకు సంబంధించిన ప్రజలు ఉన్నారు.

## ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ



**వారధి న్యూస్ నాగర్ కర్నూలు బ్యూరో:** బల్మూర్ మండలం లో గురువారం వివిధ చెరువులలో చేప పిల్లలను ఎమ్మెల్యే వంశీకృష్ణ నాయకులు మత్స్య కార్మికులతో కలిసి చెరువులలో వదిలారు. బల్మూరు గ్రామ శివారులో నల్లచెరువు, తుమ్మెన్ పేట గోదల్, కొత్తపల్లి గ్రామాల్లో ఉన్నటువంటి చెరువులలో చేప పిల్లలను స్థానిక నాయకులతో కలిసి వదిలారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్య శాఖ ఆధ్వర్యంలో 100 శాతం రాయితీపై ఉచిత చేప పిల్లలను విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముదిరాజులు గంగపుత్ర సోదరులందరూ కూడా ఈ యొక్క చేపల పెంపకం వాటి అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. మత్స్యశాఖ సహకర సంఘాల సొసైటీ సభ్యులు చెరువులో విడిచిన చేపలను సంఘాలు సొసైటీల వారిగా విభేదాలు లేకుండా సమస్యలను పరిష్కరించుకోవాలని. ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా ఏర్పాటు చేస్తున్న ఈ యొక్క చేప పిల్లల పంపిణీ అన్ని చెరువులలో కూడా వేసి వాటి అమలు బాధ్యత సొసైటీలు చూసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి రజిత, మండల పార్టీ అధ్యక్షులు వెంకటరెడ్డి నాయకులు నర్సింగరావు కాశన్న యాదవ్, నర్సింగ్ రావు , రాంప్రసాద్ , గౌడ్ జంగయ్య ఖదీర్ శైలేష్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ వెంకటయ్య, శ్రీనివాసులు మైసన్న అధికారులు ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలి

- అసాంఘిక కార్యకలాపాలకు నివారణకు ప్రత్యేకంగా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి
- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**వారధి న్యూస్, జగిత్యాల ప్రతినిధి :** ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్ సూచించారు. గురువారం వార్షిక తనిఖీలో భాగంగా బీర్పూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు.ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా భరోసా కల్పించాలని,బాధితులకు ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్ ని సంప్రదించవచ్చని అన్నారు.పోలీస్ స్టేషన్ లో పెట్రోల్ కార్, బ్లూ కోట్ సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని, పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు దూరంగా ఉన్నప్పటికీ 10 నిమిషాల్లో చేరుకునే విధంగా పని చేస్తున్నారని తెలిపారు.పోలీస్ స్టేషన్ అధికారులు,సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అన్నారు.ఈ సందర్భంగా పెండింగ్ లో ఉన్న కేసులు,పెండింగ్ ఉన్న కేసులపై ఎస్.పి రివ్యూ చేయడం జరిగింది. పోలీస్ స్టేషన్ ల పరిధిలోని కేసుల నమోదు, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన వివరాలని అడిగి తెలుసుకున్నారు.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణ లో 5% అమలు చేసిన తీరును, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వారి యొక్క డ్యూటీ ల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో 5% విధానాన్ని పాటిస్తూ పరిశుభ్రంగా ఉండేటట్లు అదేవిధంగా ఫైల్స్, క్రమపద్ధతిలో నిర్దేశిత ప్రదేశాల్లో ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు.రికార్డ్ రూమ్, రైటర్ రూమ్ తదితర అన్నివిభాగాలు తిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం సిబ్బంది తో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ అంతా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు బాధ్యతాయ-ుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. పోలీస్ శాఖ నూతన టెక్నాలజీ అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తున్న దాని గురించి అధికారులకు సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు.సిబ్బంది కి ఏమైనా ఉంటే తమ దృష్టి కి తీసుకొని రావాలని సూచించారు.ఈ యొక్క కార్యక్రమంలో డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,బీర్పూర్ ఎస్.ఐ కుమారస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీ పాలనలో ఏఐ వినియోగం : లోకేశ్



**ముంబయి, అక్టోబర్ 24 :** ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్‌తో ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ముంబయిలో భేటీ అయ్యారు. ఏపీ పాలనా వ్యవహారాల్లో వేగవంతమైన, మెరుగైన సేవలకు ఏఐ టెక్నాలజీని వినియోగించుకోనున్నట్లు మంత్రి లోకేశ్.. జెన్సన్‌కు వివరించారు. అమరావతిలో ఏర్పాటు చేయనున్న ఏఐ యూనివర్సిటీకి తగిన సూచనలు ఇవ్వాల్సిందిగా కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన జెన్సన్.. రానున్న రోజుల్లో ఏఐ టెక్నాలజీ ద్వారా అంతర్జాతీయంగా ఎలాంటి విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయో వివరించారు. స్పీచ్ రికగ్నిషన్, మెడికల్ ఇమేజింగ్, సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ సంస్థల్లో ఏఐ వినియోగానికి అవసరమైన కంప్యూటింగ్ పవర్ టూల్స్, అల్గారిథమ్‌లను ఎన్విడియా అందిస్తోందని వెల్లడించారు.



## శ్రీశైలానికి వరదప్రవాహం

### నాలుగు క్రస్ట్ గేట్లు ఎత్తి నీటి విడుదల

**శ్రీశైలం,అక్టోబర్24 :** శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతుంది. గురువారం ఉదయం ప్రాజెక్టు నాలుగు క్రస్ట్ గేట్లను ఎత్తి నాగార్జున సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు గేట్ల ద్వారా 41,590 క్యూసెక్కుల నీరు వస్తుండగా.. విద్యుత్ ఉత్పత్తి ద్వారా మరో 28,92 క్యూసెక్కులు వరద వస్తున్నది. అలాగే సుంకేశుల నుంచి 1,18,776 క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి వస్తున్నది. కాగా, సాయంత్రం వరకు రిజర్వాయర్‌కి 1,89,328 క్యూసెక్కుల నీరు ఇన్‌ఎ÷-లో వచ్చి చేరుతున్నది. ఈ క్రమంలో నాలుగు గేట్లను ఎత్తి 1,12,800 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. కుడి, ఎడమగట్లలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది. కుడిగట్టు జల విద్యుత్ కేంద్రం ద్వారా 9127 క్యూసెక్కులు, ఎడమగట్టు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా మరో 96,600 క్యూసెక్కుల వరద సాగర్ వైపు పరుగులు తీస్తున్నది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు. ప్రస్తుతం నీటి నిల్వ 215 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం పూర్తిస్థాయిలో నీటి నిల్వ ఉందని అధికారులు వివరించారు.

## పెరిగిన శ్రీశైలం హుండీ ఆదాయం

**శ్రీశైలం, అక్టోబర్ 24 :** జ్యోతిర్లింగ క్షేత్రం, అష్టాదశ శక్తిపీఠ క్షేత్రమైన శ్రీశైల భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి హుండీ ద్వారా ఆదాయం భారీగా సమకూరింది. ఆలయ హుండీలను గురువారం లెక్కించారు. చంద్రావతి కల్యాణ మండపంలో పటిష్టమైన భద్రత, నిఘా మధ్య ఆలయ అధికారులు సిబ్బందితోపాటు శివసేవకులు ఉభయ దేవాలయాలు, పరివార దేవాలయాల హుండీలను లెక్కించారు. గత 28 రోజులుగా స్వామి అమ్మవార్లకు భక్తులు చెల్లించిన మొక్కులు, కానుకలు నగదు రూపంలో రూ.2,58,56,737 ఆదాయంగా వచ్చినటు ఈవో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అలాగే, 379 గ్రాముల బంగారు ఆభరణాలు, సుమారు 8.80 కేజీల వెండి ఆభరణాలు సైతం లభించాయని పేర్కొన్నారు. వీటితో పాటు యూఎస్‌ఏ డాలర్లు 1093, కెనడా డాలర్లు 215, యూకే పౌండ్స్ 20, యూఏఈ ధీర్హామ్స్ 10, మలేషియా రింగేట్స్ 21, మాల్దీవ్స్ రుఫియాస్ 10, ఈరోస్ 10, సింగపూర్ డాలర్లు రెండు, మారిటియస్ 25 కరెన్సీ కరెన్సీని కానుకలుగా భక్తులు సమర్పించారని ఈవో వివరించారు.

## కొనుగోళ్ల కోసం సోయా రైతుల ఆందోళన

**ఆదిలాబాద్, అక్టోబర్ 24 :** తేమ పేరిట సోయా పంటను కొనుగోలు చేయడం లేదని నిరసిస్తూ రైతులు ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలో ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద నిరసన తెలుపుతూ అంతర్రాష్ట్ర రహదారిపై బైఠాయించారు. దీంతో ట్రాఫిక్ జామ్ అయింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాధిక మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డితో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. బేల సబ్ మార్కెట్ యార్డులో కొనుగోళ్ల కోసం సొసైటీ అధికారులు బుధవారం నుంచి గ్రామాలవారీగా సోయా కొనుగోళ్ల కోసం షెడ్యూల్‌ను ప్రకటించారని తెలిపారు. దీంతో సోయా పంటను తీసుకొచ్చామని పేర్కొన్నారు. కానీ, మార్కెట్ యార్డులో సొసైటీ అధికారులు తేమ శాతం అధికంగా ఉండడంతో కొనుగోలుకు నిరాకరించారని మండిపడ్డారు. మార్క్‌ఫెడ్ అధికారులు భేషరతుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.



## ఇన్ని లక్షల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి

- విలువలు లేని వారు సమాజానికి చేటు
- జగన్ ఆస్తుల వ్యవహారంపై చంద్రబాబు మండిపాటు

**అమరావతి, అక్టోబర్ 24 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మరోసారి ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు తీవ్ర విమర్శలు గుప్పించారు. తండ్రి సంపాదించిన ఆస్తి ఆయన భార్యకు రాదా అని ప్రశ్నించారు. 2004లో జగన్ ఆదాయం ఎంత..ఇవన్నీ ఎక్కడినుంచి వచ్చాయి ఈ లక్షల కోట్లు అని నిలదీశారు. ఇలాంటి వారితో రాజకీయం చేయలంటే సిగ్గుగా ఉందని విమర్శిం చారు. వంకర రాజకీయాలు, చిల్లర రాజకీయాలు ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. విలువలు లేని మనుషులు సమాజానికి చేటని విమర్శలు చేశారు. ప్రభుత్వంలో ఉండగా ఎప్పుడై నా ఇచ్చారా ప్రజలను ఆదుకున్నారా అని అడిగా రు.. ఇప్పుడేమో రూ. 10లక్షలు ఇచ్చే శక్తి ఇప్పుడు వచ్చిందా అని ప్రశ్నించారు. జగన్ దగ్గర ఉన్న డబ్బు ప్రజలకు ఇవ్వాలని.. అలా అయినా అవినీతి డబ్బు ప్రజలకు చేరుతుందని అన్నారు. ఐదేళ్ల ఇంట్లో నుం చి తనను బయటకు రానివ్వలేదని మండిపడ్డారు. ఇప్పుడు తిడుతున్నారుగా వారిని ఆపాలంటే ఎంత సేపు ఒక్కనిముషమని వార్నింగ్ ఇచ్చారు. విలువలు లేని రాజకీయం చేసి అందులో హీరోయిజం చేయాలనుకుంటే ఇక కలేనని విమర్శించా రు.. ఆస్తిలో వాటా ఇవ్వనంటూ తల్లి, చెల్లిని జగన్ రోడ్డుపైకి లాగారు. మమ్మల్ని నిందిస్తూ జగన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. జగన్ లాంటి వ్యక్తులతో రాజకీయాలు చేస్తాననుకోలేదు. ఆస్తిలో వాటా ఇవ్వాలంటే జగన్‌ను విమర్శిం చకూడదని షరతు పెట్టారు. ఇలాంటి వారితో రాజకీయం చేయాలంటే సిగ్గనిపి స్తోంది. వైకాపాలో ఉన్నామని చెప్పుకొనేందుకు ఆ పార్టీ నేతలు సిగ్గుపడుతున్నారు. జగన్ ప్రభుత్వం దాచిపెట్టిన చీకటి జీవోలపై విచారణ జరిపిస్తాం. చీకటి జీవోల్లోని అక్రమాలు నిగ్గుతేల్చి గత తప్పిదాలు సరిదిద్దుతాం' అని సీఎం తెలిపారు.

## అంబేద్కర్ విగ్రహానికి గోడ నిర్మిస్తే ఊరుకోం

### జిల్లా కేంద్రంలో అంబేద్కర్ సంఘం పత్రికా సమావేశం



**సంగారెడ్డి , అక్టోబర్ 24 :** సంగారెడ్డి జిల్లా కేంద్రం అంబేద్కర్ సంఘం కార్యాల యంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో జిల్లా అధ్యక్షులు పంబల్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ట్యాంక్బండ్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి గోడ నిర్మించడాన్ని సంగారెడ్డి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదని, ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో అక్కడి నుండి ఆ మహనీయుని విగ్రహాన్ని తొలగించాలని చూస్తేనే రాష్ట్ర దళిత సంఘాల భారీ నిరసనతో నాటి ముఖ్య మంత్రి చంద్రబాబు తొలగించకుండా విరమించుకున్నాడని నేడు అదే తరహాలో అలాంటి దుశ్చర్యకు పాల్పడుతున్న రేవంత్ రెడ్డికి కూడా అదే తరాహాలో గురువుకు ఎదురైనదే శిష్యునికి తప్పదని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నామని పేర్కొన్నారు.ట్యాంక్ బండ్ పై మహనీయుని అంబేద్కర్ విగ్రహాన్ని యధా స్థితిలో ఉంచాలని నిర్మించిన గోడను తక్షణమే తొలగించాలని లేనిపక్షంలో అంబేద్కర్ వాదుల ఆగ్రహానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం గురి కావడం తధ్యమని ఈ సందర్భంగా తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంబల్ల దుర్గాప్రసాద్ మేకల విజయరావు మోహన్ రాజు జిల్లా కార్యదర్శులు బాబూలాల్ ప్రశాంత్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## దాచేపల్లిలో డయేరియాతో ఇద్దరు మృతి

### పరిస్థితిని సమీక్షించిన మంత్రి నారాయణ

**గుంటూరు, అక్టోబర్ 24 :** పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం అంజనాపురం కాలనీలో వాంతులు, విరేచనాలతో ఇద్దరు మృతి చెందిన ఘటనపై మంత్రి పొంగూరు నారాయణ సమీక్ష నిర్వహించారు. నీరు కలుషితం కావడం కారణంగా మరణించారా.. లేక వేరే కారణాలున్నాయా? అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదని అధికారులు మంత్రికి తెలిపారు. స్థానికంగా ఉన్న బోర్ల నీటిని విజయవాడ ల్యాబ్‌కు పరీక్షల కోసం పంపాలని మంత్రి ఆదేశించారు. అన్ని బోర్లను మూసివేసి వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు. ఇద్దరు మృతి చెందడంతోపాటు మరో ఆరుగురు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని కలెక్టర్ తెలిపారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేయడంతోపాటు పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు వివరించారు. డ్రైనేజీల్లో మురుగును తొలగించడంతోపాటు అన్ని మంచి నీటి బోర్లను తనిఖీ చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఇతర మున్సిపాలిటీల నుంచి సిబ్బందిని రప్పించాలన్నారు. సాధారణ పరిస్థితి వచ్చే వరకు మున్సిపల్, వైద్యారోగ్య శాఖ అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, జేసీ సూరజ్, ఆర్డీఎంఏ హరికృష్ణ, డీఎంహెచ్ వో రవికుమార్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఏపీ హైకోర్టుకు ముగ్గురు న్యాయమూర్తులు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 :** ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ముగ్గురు కొత్త న్యాయమూర్తులు నియమితులయ్యారు. ప్రస్తుతం ఏపీ హైకోర్టులోనే న్యాయవాదులుగా సేవలందిస్తున్న కుంచం మహేశ్వరరావు, తూట చంద్ర ధనశేఖర్, చల్లా గుణరంజన్‌లను అదనపు జడ్జిలుగా నియామకానికి రాష్ట్రపతి ఆమోదం లభించింది. వీరి నియామకం కోసం ఇటీవల సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిలతో చర్చించిన తర్వాత వీరిని అదనపు జడ్జిలుగా నియమిస్తున్నట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి 'ఎక్స్'లో వెల్లడించారు.

## ఆస్తులపై ప్రేమతో బంధాలు.. అనుబంధాలు మార్చారు

- జగన్ బెయిల్ రద్దుకు కుట్ర ఓ పచ్చి అబద్ధం
- షేర్లను ఎప్పుడైనా బదిలీ చేసుకునే అధికారం
- జగన్ వ్యవహారంపై షర్మిల ఘాటు సమాధానం

**అమరావతి, అక్టోబర్ 24 :** చెల్లిపై ప్రేమతో జగన్ షేర్లు బదిలీ చేశారనేది పచ్చి అబద్ధమని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. జగన్ బెయిల్ రద్దుకు కుట్ర అనడం శతాబ్దపు పెద్ద జోక్ అని వ్యాఖ్యానించారు. ఆస్తుల వ్యవహారంలో ఆమె.. జగన్‌కు పలు ప్రశ్నలు సంధించారు. ఆస్తులపై ప్రేమతో రక్త సంబంధం, అనుబంధాలను మార్చారు. కుటుంబ విషయాలను రోడ్డు మీదకు తీసుకువచ్చారు. అది చాలదన్నట్లు ఇప్పుడు కోర్టుల వరకు తీసుకెళ్లారు. ఆస్తులను లాక్కోవడానికి కారణంగా చెబుతున్నారు కానీ వాస్తవం కాదు. ఈడీ కేసులు, బెయిల్ రద్దవుతుందని కారణాలు చెబుతున్నారు. సరస్వతి కంపెనీ షేర్లను ఈడీ అటాచ్ చేయలేదు. రూ.32 కోట్ల విలువైన కంపెనీ భూమిని ఈడీ అటాచ్ చేసింది. కంపెనీ షేర్లను ఎప్పుడూ ఈడీ అటాచ్ చేయలేదు. ఏ సమయంలోనైనా షేర్లను బదిలీ చేసుకోవచ్చు. ఏ కంపెనీ ఆస్తులనైనా ఈడీ అటాచ్ చేసినా.. షేర్ల బదిలీని ఆపలేదు. 2016లో ఈడీ అటాచ్ చేసినందున షేర్ల బదిలీ చేయకూడదని జగన్ వాదిస్తున్నారు. షేర్లు బదిలీ చేస్తే బెయిల్ రద్దవుతుందని వాదిస్తున్నారు. 2019లో 100శాతం వాటాలు బదలాయిస్తామని ఎంవోయూపై సంతకం ఎలా చేశారు. అప్పుడు మీ బెయిల్ సంగతి గుర్తుకు రాలేదా? 2021లో క్లాసిక్, సండూరు షేర్ల కొనుగోలుకు ఎలా అనుమతి ఇచ్చారు? షేర్లను రూ.42 కోట్లకు కొనుగోలుకు తల్లికి ఎలా అనుమతి ఇచ్చారు? అప్పుడు మీ బెయిల్ సంగతి గుర్తుకు రాలేదా? 2021లో జగన్, అతని భార్య షేర్లను తల్లి గిఫ్ట్‌డీడ్ ఎలా ఇచ్చారు? అని షర్మిల ప్రశ్నించారు. ఇటీవల జగన్ ఓడాక ఈ ప్రాజెక్టును వదులుకోవడం ఇష్టం లేదు. భారతి సిమెంట్స్ బ్యానర్ కింద సరస్వతి సిమెంట్ చేపట్టాలని యత్నం. అందుకే ఇప్పుడు ఈడీ అటాచ్ అంశాన్ని లేవనెత్తారు. షేర్లు బదిలీ చేయలేమని జగన్ చెబుతున్నారు. కంపెనీ భూమి తప్ప షేర్లు అటాచ్ చేయనందున షేర్లు బదిలీ చేయవచ్చని వివరించారు.



## పల్లె ప్రకృతి వనంలో పిచ్చి మొక్కలను తొలగించి పండ్లు, పూల మొక్కలు పెంచాలి

### జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్



**వారధి న్యూస్, జగిత్యాల ప్రతినిధి :** పల్లె ప్రకృతి వనంలో పిచ్చి మొక్కలను తొలగించి పండ్లు, పూల మొక్కలు పెంచాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ సూచించారు. గురువారం జగిత్యాల రూరల్ పోరండ్ల గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, వైకుంఠ ధామం, కంపోస్ట్ డంపింగ్ యార్డులను ఆర్డీఓ శ్రీనివాస్ తో కలెక్టర్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె ప్రకృతి వనంలో పిచ్చి మొక్కలను తొలగించాలని తెలిపారు. వైకుంఠ ధామం పరిశీలించి ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని, నీటి సదుపాయం కల్పించాలని,టాయిలెట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి శానిటేషన్ చేయించాలని గ్రామ కార్యదర్శిని కలెక్టర్ ఆదేశించారు.ప్రతి గ్రామ పంచాయతీ లో ట్రాక్టర్ ద్వారా తడి చెత్త, పొడి చెత్త వేరు వేరుగా ప్రతి ఇంటి నుండి సేకరించడం జరుగుతున్నదని తెలిపారు.పొడి చెత్తను సెగ్రిగేషన్ షెడ్డు ద్వారా క్రాప్ డీలర్లకు అమ్మాలని సూచించారు. పొడి చెత్త అనేది ప్లాస్టిక్, గాజు ఇతర భూమిలో కలవని చెత్త అని పేర్కొన్నారు. తడి చెత్త అనేది కూరగాయల వేస్ట్ అని దానితో కంపోస్టు, వర్మీ కంపోస్టు గాని తయారు చేయించాలని తెలిపారు. డంపింగ్ యార్డును ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయించాలని అధికారులని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్,ఎమ్మార్వో శ్రీనివాస్, ఎంపిడిఓ,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని, మోడీ, అమిత్ షాలతో ఒమర్ భేటీ

### కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్దరణపై వినతి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 :** జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి దిల్లీలో పర్యటిస్తోన్న నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా గురువారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలతో భేటీలో జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కోరారు. ఇదే విషయమై కేంద్రాన్ని కోరుతూ ఇటీవల ఒమర్ మంత్రివర్గం తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. దానికి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆమోదం కూడా తెలిపారు. తాజాగా భేటీలో ఆ తీర్మానాన్ని ప్రధానికి అందించనున్నట్లు తెలుస్తోంది. ప్రధానిని కలుసుకోవడానికి ముందు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఒమర్ భేటీ అయిన సంగతి తెలిసిందే. జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా కల్పించాలనే అంశంపై వీరిద్దరూ చర్చించినట్లు సమాచారం. ఈమేరకు జాతీయమీడియా కథనాలు వెల్లడించాయి. ఈ భేటీలో కొత్తగా ఎన్నికైన ప్రభుత్వానికి కేంద్రం మద్దతు తెలపడంతో పాటు, రాష్ట్ర హోదా పునరుద్ధరణపై కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు సమాచారం. జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంగా మారిన తర్వాత తొలిసారి ఇటీవల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఎన్‌సీ- కాంగ్రెస్ కూటమి విజయం సాధించగా.. ఒమర్ అబ్దుల్లా సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని రాష్ట్ర కేబినెట్ తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఈ తీర్మానాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా సైతం ఆమోదించారు. జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా పునరుద్ధరణ అంశంపై వీరిద్దరూ చర్చించినట్లు సమాచారం. ఈ పునరుద్ధరణ ప్రక్రియను ప్రారంభించే యోచనలో కేంద్రం ఉందని, ఈ మేరకు హామీ లభించిందని కథనాలు వెలువడ్డాయి. జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంగా మారిన తర్వాత తొలిసారి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్‌సీ-కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. 90 స్థానాల శాసనసభలో ఎన్‌సీ 42 సీట్లలో, కాంగ్రెస్ 6 స్థానాల్లో నెగ్గింది.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com
Public Voice
స్పందన



# ఆదరణలేని తోలుబొమ్మలాట

సినిమాలు, టి.వి.లు లేని రోజుల్లో వృత్తి కళాకారుల ప్రదర్శనలకు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. అలిసి పోయిన పల్లె ప్రజలకు జానపదుల ప్రదర్శనలు సేదతీర్చేవి. గ్రామాల్లో జానపద కళాకారులు వివిధ రకాలైన ప్రదర్శనలు ఇచ్చేవారు. ముందు తరాలవి శ్రమైక జీవన విధానం. కష్టజీవులే ఎక్కువ మంది. రోజంతా కాయకష్టం చేసి ఇళ్లకు చేరిన వారి అలసట తీర్చి వారికి సాంత్వన చేకూర్చే కళా రూపాలే జనపదాలు. అలాంటి వాటిలో తోలు బొమ్మలాట ప్రధాన మైనది.తోలు బొమ్మలాట ఒక జానపద కళారూపం. తాను స్వయంగా అనుకరించలేని జానపదుడు కావ్యాల్లోనూ, పురాణాల్లోను వర్ణింపబడిన పాత్రల ఆహార్య విశేషాలను స్వయంగా సృష్టించు కున్నాడు. తన భాషతో ఆ మూగ చిత్రాలకు ప్రాణం పోశాడు. రకరకాల విన్యాసాలను వాటి చేత చేయించాడు. తాను స్వయంగా వెనుకనుండి ఈ పాత్రలను కదిలించాడు. కదులుతున్న ఆ జీవంలేని బొమ్మలతో జీవ నిబద్ధమైన ఒక దృశ్యాన్ని ప్రదర్శించడం లోనే జానపదుడి కళాత్మకత దాగి ఉంది. సుసంపన్నమైన హిందూ ఇతిహాసాలను తెర మీదకి తెచ్చిన ఒక గొప్ప ప్రక్రియ తోలు బొమ్మలాట. ఒక సామూహిక సంగీత, నాట్య ప్రదర్శన కళారూపమైన తోలు బొమ్మలాట, జానపదుని మొదటి రంగస్థల ప్రదర్శన కళా రూపాన్ని గుర్తించ వచ్చు.పూర్వం రాజాస్థానాల లోని పండితులు తమ ప్రభువులను సంతోష పెట్టడానికి బొమ్మలను తయారు చేసి మానవులుగా నటింపచేస్తే సృజనాత్మకంగా ఉంటుందని భావించి తోలు బొమ్మలను తయారుచేసి, తెల్లటి పంచెను తెరగా అమర్చి, దానిపైన దీపం కాంతిలో బొమ్మల నీడలను పడేటట్లు చేసి బొమ్మలాటను ప్రదర్శించేవారు. ఈ విధంగా తోలు బొమ్మలాట పుట్టిందని, ఈ ఆట పండితుల చేత మెరుగులు దిద్దుకున్నదని, చెప్పడానికి అమర కోశం లోని శ్లోకాలను నిదర్శనంగా పేర్కొనవచ్చు.మహాభారతంలో తోలు బొమ్మలాట ప్రస్తావన ఉంది. భగవద్గీతలో సత్త్వ, తమో, రజో గుణాలు మూడు దారాలని, అవి పరమాత్ముని చేత మానవ జీవన గమనంలో లాగబడు తుంటాయని చెప్పబడిరది. మానవుడు బొమ్మ అయితే అతనికున్న సూత్రాలు ఈ మూడు గుణాలు. ఆడిరచేవాడు జగన్నాటక సూత్రధారి అన్న అర్థంలో ఉన్న ఈ భాగం తోలు బొమ్మలాటలకు సంబంధించిన ప్రస్తావన. భారతీయ జానపద ప్రదర్శన కళల్లో అతి ప్రాచీనమైన దృశ్య రూపకానికి చెందినది తోలు బొమ్మలాట. క్రీ.పూ 3 వ శతాబ్దం నాటికే తెలుగు దేశంలో తోలు బొమ్మలాట ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తోంది.చరిత్రకారుల ప్రకారం తోలు బొమ్మలు క్రీ.పూ 2500 సం.నకు పూర్వం, పురాతన నాగరికత అయిన హరప్పా, మొహంజోదారో కొన్ని వేల కిలోమీటర్ల వరకూ వ్యాపించినట్లు చెపుతారు. క్రీ.పూ 3 వ శతాబ్ధానికి చెందిన అశోకుని శిలా శాసనాల్లో జంబూ ద్వీపానికి బొమ్మలాట ప్రదర్శన రంగంగా ఆపాదించారు. పతంజలి మహాభాష్యంలో తన కాలపు వినోద సాధనాలను వివరిస్తూ మూడు ప్రధానమైన వాహికలను వివరిస్తూ వాటిలో బొమ్మలాట ఒక ప్రధనమైన వాహిక అని వివరించారు. తేరి గాథ అను బౌద్ధ గ్రంథంలో బొమ్మలాటకు సంబంధించిన ప్రస్తావన ఉంది. వాత్సాయనుని కామసూత్రాల్లో బొమ్మలలోని రకాలు, బొమ్మలాటల్లోని తేడాలు చర్చింప బడినాయి. కన్యలను ఆకర్షించడానికి బొమ్మలాటల ప్రదర్శన అవసరమని వాత్సాయనుని వివరణ. నాటకానికి, తరువాత పరోక్షంగా తోలుబొమ్మలాట సినిమాకు మూలమైంది. కదలికలోని ఆనందం కనుక్కున్న మనిషి ఆలోచనలో నుండి పుట్టిందే బొమ్మలాట. స్థిరత్వం నుండి చలనం వైపుకు పయనించడంలో భాగంగా ప్రాచీన మానవుడు బొమ్మలాటను సృష్టించు కున్నాడు. కథ చెప్పడం మొదలైన తరువాత ఆ కథలోని పాత్రలు తెరమీద కనిపిస్తే, నటిస్తే చూడాలన్న జనపదుడి తపనలో నుండి బొమ్మలాట పుట్టింది. బొమ్మలతో ఆడుకోవడం అతి ప్రాచీన కళ. కొయ్యబొమ్మలాటలు, కట్టెబొమ్మ లాటలు, తొడుగు బొమ్మలాటలు, తళ్ళబొమ్మ లాటలు, బుట్టబొమ్మ లాటలు, తోలుబొమ్మలాటలు అని బొమ్మలాటలు అనేకము ఉన్నాయి. రంగస్థలంపై పొడవాటి గుంజలపై తెల్లటి వస్త్రాన్ని లేదా పంచెను ముందు భాగంలో గట్టిగా లాగి కడతారు. తెర భూమి నుండి నిలువుగా ఉండకుండా కొంచెం ఏటవాలుగా కడతారు. ఈ విధంగా కట్టడం వల్ల బొమ్మలను ఆడిరచే టప్పుడు బొమ్మలకు కాళ్ళు అడ్డు తగలకుండా ఉంటుంది. తోలు బొమ్మల ప్రతిబింబాలు సరిగ్గా తెరపై పడడానికి తెరలోపలి నుండి పూర్వం కాగడాలు ఉపయోగించేవారు. విద్యుత్ సౌకర్యం అభివృద్ధి చెందిన తర్వాత ఎక్కువ కాంతిని ఇచ్చే విద్యుత్ బల్బులను వాడుతున్నారు.ప్రదర్శన సంబంధమైన కదలికలకు అనుగుణంగా ప్రధాన గాయకుడు పాడుతూ వుంటే, మిగిలిన వారు వంతలుగా పాడుతారు. వంతల్లో స్త్రీలు ప్రధానంగా ఉంటారు. రాగం తీయడం, ముక్తాయింపు, సంభాషణ ధోరణిలో స్త్రీగొంతు ముఖ్యపాత్ర వహిస్తుంది. స్త్రీ పాత్రలకు స్త్రీలే పాడతారు.తోలు బొమ్మలాటలో సామాజిక స్థితిగతులకు దర్పణంగా నిలిపి, పాత్రల ద్వారా సమాజంలో ఉండే దురాచారాలను, మూఢ నమ్మకాలను ఎండగడతారు. ఇందులో సామెతలు, లోకోక్తులు, పొడుపు కథలు, నీతికథలు మొదలైనవి చోటు చేసుకుంటాయి. అదేవిధంగా అభినయాలకు స్వభావానుగుణంగా తేల్చడానికి వాద్యానికి సంబంధించి హార్మోనియం, తాళాలు, తొక్కుడుబిళ్ల, మద్దెల, డప్పు, గజ్జెలు వంటివి ప్రధాన భూమికను నిర్వహిస్తాయి. తోలు బొమ్మల ప్రదర్శనలో రామాయణం, భారతం లకు సంబంధించిన కథా వస్తువులు ఉంటాయి. లంకా దహనం, సతీసులోచన, యయాతి, అంగద రాయబారం, మైరావణ వధ, విరాటపర్వం, పద్మవ్యూహం, ఉత్తర గోగ్రహణం వంటి కథలతో తోలు బొమ్మలను ప్రదర్శిస్తారు. తోలు బొమ్మలు ఆంధ్ర రాష్ట్రంలో ప్రాచీన ఓడరేవులైన కళింగపట్నం, భీమునిపట్నం, కోరంగి, మచిలీపట్నం, వాడరేవు, కొత్తపట్నాల నుంచి విదేశాలకు భారతీయులతో పాటు వెళ్ళాయి. పర్షియా, టర్కీ ల మీదుగా గ్రీసు దేశంలో ప్రవేశించిన తోలు బొమ్మలు, గ్రీసులో నూతన రూపం సంతరించుకుని ఉత్తరాఫ్రికా లోని ముస్లిం దేశాలకు, 17వ శతాబ్దంలో ఇటలీకి, అక్కడినుండి ఫ్రాన్స్ లోని వెర్సయిల్స్, పారిస్, పేలేరాయల్ నగరాలకు వ్యాపించాయి. తోలు బొమ్మలు కాలానుగుణంగా ఆయాదేశాల్లో భిన్నరూపాలు ధరించినప్పటికీ, భారతదేశం వీటికి మాతృక అని చెపుతారు. తోలుబొమ్మల ఆటలు క్రమేపీ కనుమరుగు కాక తప్పని స్థితి నెలకొంది. తోలు బొమ్మల కళారూపం అంతరించి పోవడానికి గల కారణం నాటకాల ప్రభావం ఉధృతంగా ఉండడం, పద్యనాటకాల ప్రాధాన్యత పెరగడం, నాటకాలలో శాస్త్రీయతకు, సాంకేతిక పరిజ్ఞానానికి ఉన్నతస్థానం లభించడం, సినిమాలు ప్రజలను సమ్మోహితులను చేయడం, తెరపై ప్రేక్షకులకు కావలసినవి అందించడం, అదేవిధంగా ఇంట్లోనే జనరంజకం అన్న నేపథ్యంలో విస్తృతంగా ఛానల్స్ వచ్చి ప్రపంచ తీరు తెన్నులను మార్చడం వంటి ఎన్నో కారణాలు తోలుబొమ్మలు లాంటి కళారూపాల మనుగడకు సవాలుగా నిలిచాయి. ఇలాంటి విషమ పరిస్థితుల్లో, మన ప్రాచీన కళా రూపాల ఆనవాళ్ళు అని చెప్పడానికి వాటిని బ్రతికించు కోవలసిన అవసరం ఎంతైనా అవసరం.

# ఇండియాలో జమ్ముకశ్మీర్ విలీనం

అక్టోబర్ 26, 1947న నాటి జమ్ముకశ్మీర్ రాచరిక రాజ్య పాలకుడైన మహారాజ హరి సింగ్ భారత ప్రభుత్వంతో ''ఇనుస్ట్రుమెంట్ ఆఫ్ ఆక్సెషన్ (విలీన సాధన/ప్రవేశ పత్రం)''పై సంతకం చేయడంతో జమ్ముకశ్మీర్ ప్రాంతం చట్టబద్ధంగా భారతదేశంలో అంతర్భాగంగా విలీనం కావడం జరిగింది. 2020 నుంచి ప్రతి ఏట 26 అక్టోబర్‌న ప్రభుత్వం అధికారిక సెలవు దినం ప్రకటించింది. 77వ జె అండ్ కె విలీన దినోత్సవాన్నిల పర్వదినంగా భావిస్తూ ర్యాలీలు, బాణాసంచా పేల్చడం, జాతీయ గీతాలాపన చేయడం లాంటి వేడుకలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. కాశ్మీరీ వేర్పాటువాదులు, పాకిస్థానీ సానుభూతి పరులు ఈ రోజున విలీన దినానికి బదులుగా ''బ్లాక్ డే'' పాటించడం కూడా అక్కడక్కడ కొనసాగుతోంది. భారత్‌కు స్వాతంత్య్రం ఇస్తూనే వలస పాలకులు అఖండ భారత్‌ను మతపరమైన ప్రాతిపదికగా రెండు దేశాలుగా విభజించడం, ముస్లిమ్‌లు పాకిస్థాన్ వైపు, హిందువులు భారత్ వైపు వలసలు వెళ్లడం, అల్లర్లు/హత్యలు/దోపిడీలు లాంటి హృదయవిదారక ఘటనలు మిగిలేచిన విభజన గాయాలు నేటికీ ఇంకా మాసిపోలేదు. నాటి పరిస్థితుల్లో భారతదేశవ్యాప్తంగా 570కి పైగా ప్రిన్స్‌లీ స్టేట్స్ లేదా రాచరిక రాజ్యాలు ఉండగా వాటిని భారత్ లేదా పాకిస్థాన్‌లో విలీనం కావాలని సూచించారు. 15 ఆగష్టు 1947న 560కి పైగా రాచరిక పాలన ప్రాంతాలు భారత్‌లో విలీనం కావడానికి అంగీకరించగా జమ్ముకశ్మీర్, హైదరాబాదు, జూనఘడ్ ప్రాంత రాజ్యాలు మాత్రం విలీనాన్ని వ్యతిరేకించాయి. నాటి జమ్ముకశ్మీర్ రాజు మహరాజ హరి సింగ్ భారత్‌లో విలీనానికి ఇష్టపడక, పాకిస్థాన్‌తో సాధారణ సంబంధాలను కొనసాగిస్తూ స్వతంత్ర రాచరిక రాజ్యంగా ఉంటామని తెలిపారు. అక్టోబర్ 1947లో పాకిస్థానీ గిరిజన పాస్తూన్ వర్గ దళంతో పాటు పాక్ సైన్యం కూడా కాశ్మీర్‌ను ఆక్రమించుకోవాలనే నెపంతో పాకిస్థాన్ ఏకపక్షంగా దూకుడు పెంచి ''ఆపరేషన్ గుల్మార్గ్'' దండయాత్ర ప్రయత్నాలు ప్రారంభించి మహారాజను లొంగదీసుకోవాలని శ్రీనగర్ వైపు దళంగా కదిలారు. ఈ దుర్మార్గపు దండయాత్రలో ఉత్తర కశ్మీర్ బారముల్లా ప్రాంతంలో 11,000లకు పైగా సాధారణ ప్రజలు హత్యలు చేయబడ్డారు. శాంతి భద్రతలు చేయి దాటడంతో మహారాజ హరి సింగ్ భయంతో తమను కావాడాలని భారత్‌ను కోరడం, భారత్‌లో విలీనం అయితేనే కాపాడుతామని భారత ప్రభుత్వం తెలుపడం, 26 అక్టోబర్ 1947న ''ఇనుస్ట్రుమెంట్ ఆఫ్ ఏక్సెషన్ లేదా విలీన/ప్రవేశ సాధన పత్రం'' పత్రంపై సంతకం చేయడంతో పాకిస్థానీ దండయాత్ర దళాన్ని భారత సైన్యం నిలువరించి జమ్ముకశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేసుకుంది. ఇనుస్ట్రుమెంట్ ఆఫ్ ఏక్సెషన్ తమకు సమ్మతం కాదని, కశ్మీర్ మా భూభాగమని నాటి నుంచి నేటి వరకు పాకిస్థాన్ పోరాటాలు, యుద్ధాలు, ఉగ్రవాద దాడులు, అంతర్జాతీయ వేదికలపై ప్రస్తావనలు చేస్తూనే ఉన్నది. ఈ విషయం 1948లో ఐరాస వేదికకు చేరగా, 01 జనవరి 1949న కాల్పుల విరమణతో పాటు వాస్తవాదీన రేఖ (ఎల్ ఓ సి) విషయంలో అంగీకారం కుదరడం, గిల్జిట్/బలూచిస్థాన్ ప్రాంతాలు పాకిస్థాన్ వైపు, ఇతర ప్రాంతాలు




భారత్ వైపు విభజించబడ్డాయి. నాటి నుంచి నేటి వరకు 1965, 1989, 19999 (కార్గిల్ వార్) లాంటి పలు సందర్భాల్లో పాకిస్థాన్ దూకుడుగా భారత్‌పై ఒత్తిడి లేదా పోరాటాలు చేయడం, ఉగ్రమూకల్ని ఉసిగొల్పడం, వేర్పాటువాదులకు వంత పలకడం, భారతాన్ని అస్థిరపరిచే విఫల కుతంత్రాలు చేయడం, ఓటమి చవి చూడడం కొనసాగుతూనే ఉన్నది. ఆగష్టు 05 ఆగష్టు 2019న జమ్ముకశ్మీర్ రాష్ట్రానికే సంబంధించిన ప్రత్యేకమైన 370, 35ఏ ఆర్టికిల్స్ రద్దు కావడంతో పాటు జె అండ్ కె కేంద్రపాలిత ప్రాంతంగా లేదా యూనియన్ టెరిటరీగా రూపాంతరం చెందడం మనకు తెలుసు. ఇప్పటికైనా బలమైన భారతదేశం ప్రదర్శించే ఓపికను బలహీనతగా భావించకుండా, పాకిస్థాన్ ప్రభుత్వం, వేర్పాటువాదులు, ఉగ్రమూకలు తోకలు ముడువాలని, లేదంటే మరో చావు దెబ్బ తినడానికి సిద్ధంగా ఉండాలని పౌర సమాజం సూచిస్తున్నది. భరతమాత నుదిటి బొట్టు వలె అందమైన జె అండ్ కె ప్రాంతం శాంతియుత వాతావరణంలో ముందుకు సాగాలని కోరుకుందాం, జమ్ముకశ్మీర్‌కు విలీన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేద్దాం.

# డ్రోన్ పనితీరు భళా..



వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ప్రపంచంలో డ్రోన్ ఇంజినీరింగ్ మరింత అధునాతనంగా, విస్తృతంగా మారడంతో, ఈ మానవరహిత ఎగిరే యంత్రాలు 21వ శతాబ్దపు సాంకేతిక వినియోగంలో అంతర్భాగంగా మారాయి.డ్రోన్ చిన్న, పైలట్ లేని విమానం లాంటిది. దీనిని అధికారికంగా మానవరహిత వైమానిక వాహనం అని పిలుస్తారు. సరళంగా చెప్పాలంటే, ఇది ఎగిరే రోబోట్, దీనిని దూరం నుండి నియంత్రించవచ్చు. వీటిని నావిగేట్ చేయడానికి ప్రత్యేక సెన్సార్లను కలిగి ఉంటాయి. ప్రారంభంలో, సైన్యం ప్రధానంగా లక్ష్య సాధన, సమాచారాన్ని సేకరించడం వంటి వాటి కోసం డ్రోన్‌లను ఉపయోగించింది. వివిధ రకాల డ్రోన్‌లు ఉన్నాయి, ప్రతి ఒక్కటి నిర్దిష్ట ప్రయోజనాల కోసం రూపొందించబడ్డాయి. ఏరియల్ ఫోటోగ్రఫీ, ఎక్స్‌ప్రెస్ షిప్పింగ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, జియోగ్రాఫికల్ మ్యాపింగ్, బిల్డింగ్ ఇన్‌స్పెక్షన్‌లు, క్రాప్ మానిటరింగ్, కార్గో ట్రాన్స్‌పోర్ట్, లా ఎన్‌ఫోర్స్‌మెంట్, వాతావరణ అంచనా వంటి రంగాలు డ్రోన్‌ల వినియోగం విరివిగా వుంది. నిర్మాణ రంగంలో కమర్షియల్ డ్రోన్స్ మెత్తం మార్కెట్‌లో 40% వాటాని ఆక్రమించుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ఓర్వకల్లులో డ్రోన్ హబ్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించడం వెనుక అనేక కారణాలు ఉన్నాయి. ప్రత్యేక హబ్ ఏర్పాటుతో తయారీ పరిశ్రమలు, డ్రోన్ టెస్టింగ్ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. అమరావతి డ్రోన్ సదస్సులో స్ట్రాటజిక్ ఫ్రేమ్ వర్క్ ఫర్ బిల్డింగ్ ఏపీ డ్రోన్ ఎకో సిస్టంపై కీలక పత్రంలో ఈ విషయాలను తేటతెల్లం చేస్తోంది. శిక్షణ, సర్టిఫికేషన్, అసెంబ్లింగ్ యూనిట్లు, రిపేర్లు, నిర్వహణ సేవలు, ఎకోసిస్టం అభివృద్ధి చెందుతుంది. ఈ సదుపాయాలతో అంకుర పరిశ్రమలు పెరుగుతాయి ఆంధ్రప్రదేశ్‌లో డ్రోన్ సంబంధిత వ్యాపారాలకు అవసరమైన అన్ని అనుమతులను సింగిల్ విండో విధానంలో ప్రభుత్వం అందిచటానికి విధి విధానాలను రూపొందిస్తోంది. దగ్గరలో ఉన్న కర్నూలు విమానాశ్రయంలోని రన్‌వేను డ్రోన్ల పరిశీలనకు వినియోగించుకోవచ్చు. డ్రోన్ తయారీ పరిశ్రమలకు అవసరమైన అనుబంధ కంపెనీల ఏర్పాటుకు పది వేల ఎకరాల వరకు అందుబాటులో ఉంటుంది. హైదరాబాద్ బెంగళూరు నగరాలకు దగ్గరగానూ ఉంటుంది. ఇక్కడ ఏర్పాటు చేసే సంస్థలకు అనుమతులన్నీ ప్రభుత్వమే సమకూర్చుతుంది. ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించడం వల్ల డీజీసీఏ అనుమతులు అక్కర్లేదు. ఏపీలో ఇతర ప్రాంతాల్లోనూ డ్రోన్ పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులివ్వనున్నారు. అయితే అవసరమైన డీజీసీఏ, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అనుమతులు, ఇతర లైసెన్సులు వారే సమకూర్చుకోవాల్సి ఉంటుంది. డ్రోన్ల రంగంలో మన దేశ వాటా కేవలం 3 శాతం దీన్ని కనీసం 20 శాతానికి పెంచాలని కేంద్రం భావిస్తోంది. ఇందులో రానున్న విస్తృత అవకాశాలను అందిపుచ్చుకునేందుకు వీలుగా ఏపీ ప్రభుత్వ విధానాలు రూపొందిస్తోంది. డ్రోన్ల వినియోగానికి విస్తృత అవకాశాలున్న మ్యాపింగ్, సర్వే, వ్యవసాయం, ఫొటోగ్రఫీ, తనిఖీలు, నిఘా రంగాలను కీలకంగా భావిస్తోంది 'విభిన్న రంగాలు, ప్రభుత్వ శాఖల్లో డ్రోన్ల వినియోగం, ప్రోత్సాహకాలు, కృత్రిమ మేధతో అనుసంధానం, తయారీ రంగాన్ని ప్రోత్సహించే వాణిజ్య విధానం వంటివి అందుబాటులోకి తేవడం. తద్వారా డ్రోన్ అనుకూల వాతావరణాన్ని రాష్ట్రంలో కల్పించాలని యోచిస్తోంది. ఏపీలో డ్రోన్ల రంగం ద్వారా ఐదేళ్లలో ఆరువేల కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ రంగంలో వెయ్యి కోట్ల పెట్టుబడులు, 12,500 మందికి ఉపాధి కల్పించేలా ముసాయిదా డ్రోన్ పాలసీని ప్రకటించింది. వివిధ రంగాలలో డ్రోన్ వినియోగం వల్ల అనేక అంకుర సంస్థలు వీటిని తయారు చేయడానికి ముందుకు వస్తున్నాయి వాటికి కావల్సిన సాంకేతిక పరిజ్ఞానం రూపకల్పన విడిభాగాల తయారీ నిర్వహణ వంటి కార్యకలాపాల ద్వారా అంకుర సంస్థలు ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నాయి. దీని ద్వారా ఉపాధి కల్పన కలుగుతోంది. వివిధ పరిశ్రమలలో డ్రోన్‌ల వినియోగం వల్ల సామర్థ్యాలు మెరుగుపడటమే కాకుండా పెట్టుబడి పెరుగుదల నూతన ఆవిష్కరణకు దోహదపడుతున్నాయి. వ్యవసాయ రంగంలో, డ్రోన్ల ఉపయోగం ఖచ్చితమైన వ్యవసాయానికి అమూల్యమైన సాధనాలుగా మారాయి. పంట పర్యవేక్షణ, నేల విశ్లేషణ కోసం వీటిని విస్తృతంగా ఉపయోగిస్తారు. వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం వ్యవసాయ నిర్వహణ మెరుగుపడిరది. రైతులు నిర్ణయాలు తీసుకోవడానికి, నీటిపారుదల పద్ధతులను మెరుగు పరుచుకోవడానికి, సామూహిక సత్యరక్షణ చర్యలకు రైతులు తాజా డ్రోన్ సాంకేతికతను ఉపయోగించుకుంటున్నారు, మరింత స్థిరమైన, సమర్థవంతమైన వ్యవసాయ పద్ధతులకు డ్రోన్‌లు దోహదపడుతున్నాయి. ఇంధన రంగం, ముఖ్యంగా చమురు, గ్యాస్, పునరుత్పాదక ఇంధన పరిశ్రమలు, వాణిజ్య డ్రోన్ వినియోగంలో గణనీయమైన పెరుగుదలను సాధించింది. ముఖ్యంగా ఆఫ్‌షోర్ విండ్ టర్బైన్‌లు లేదా రిమోట్ పైప్‌లైన్‌ల వంటి కష్టతరమైన ప్రాంతాలలో మౌలిక సదుపాయాల తనిఖీ కోసం డ్రోన్‌లు ఉపయోగించబడతాయి.

# దూరమవుతున్న మానవసంబంధాలు

భారతదేశం సాంప్రదాయాలకు,సంస్కృత్తులకు పుట్టినిల్లు ప్రపంచంలో ఏ దేశంలో లేనివిధంగా భారతదేశం ఆచార వ్యవహారాలకు,గౌరవం,మర్యాదలకు పుట్టినిల్లు.మనదేశంలో మొదటి వ్యవసాయం ఆధారపడి జీవించేవారు.దేశానికి పట్టుకొమ్మలు గ్రామాలు.పూర్వకాలంలో ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లో నివసించడానికి ఎక్కువ ఇష్టపడేవారు. గ్రామాలలోఎక్కువగా ప్రజలు వివిధ కులవృత్తులు, వ్యవసాయం, పశుపోషణ,వీటిపై ఆధారపడి జీవించేవారు.ఆనాడు ప్రజలతో డబ్బులు ఎక్కువగా అందుబాటులో లేవు.వస్తుమార్పిడి విధానం అమలులో ఉండేది.డబ్బుల స్థానంలో వస్తువులు ఒకరికి మరోకరు మార్చుకొని జీవించే వారు. ఆనాటికాలంలో ఉమ్మడి కుటుంబాలు ఎక్కువగా ఉండేవి.ఒక ఇంట్లో నాలుగు కుటుంబాల సభ్యులు కలిసిమెలిసి జీవించేవారు.ఆకుటుంబ యజమాని తండ్రి ఆకుటుంబ పోషణ బాధ్యత తల్లిది.తాత,నానమ్మ ,నాన్న, అమ్మ,బాబాయ్, పిన్ని,అన్ని,అక్క,తమ్ముళ్ళు,ఇలా చాలామంది కలిసి జీవించేవారు ఆనాటి మర్యాదలు వేరు, పెద్దవాళ్లు చాలా గౌరవించేవారు .ఒక తల్లి& తండ్రి ఇద్దరు ఐదు&ఆరు మంది పిల్లలను పోషించేవారు.వాళ్ళకు చదువు సంధ్యలు చెప్పించేవారు.ఈరోజు ఎవరికివారే యమునా తీరే అనే విధంగా దూరంగా జీవిస్తున్నారు.సమిష్టికుటుంబాలు పోయి వ్యష్టి కుటుంబాలు ఏర్పడ్డాయి. బందాలు లేవు, బంధుత్వాలు తెలియవు.ఎవరు మనోడు ఎవరు బయటి వాళ్ళు తెలియదు.ఎపుడు స్వార్థపూరితంగా తన మన తేడా లేకుండా మోసం చేసుకుంటున్నారు.ప్యాషన్ల పేరుతో పట్టణ ప్రాంతాల్లో నివసించడానికి ఇష్టపడుతున్నారు.అద్దె ఇళ్ళలో నివసిస్తు అనాథలుగా బతుకుతున్నారు. చుట్టాలు&అయినవాళ్ళు ఎవరు తెలియకుండా పిల్లలను పెంచుతున్నారు కారణం స్వార్థపు ఆలోచనలు.ఈరోజు మనుషులో మానవత్వం చచ్చిపోయింది.రాక్షస ఆనందం పొందుతున్నారు.డబ్బే పరమావధిగా భావించి అయినవారి ప్రేమను ఆత్మీయులను మరిచిపోతున్నారు.జన్మనిచ్చిన తల్లిదండ్రులను పుట్టిన ఊరును కలిసి తిరిగిన స్నేహితులను ,ఆడుకున్న స్థలాలను మరిచిపోతున్నారు.మనం ఎక్కడి నుండి వచ్చాం అనేది మరిచిపోయి.



పొగరుతో, అహంకారంతో అందరిని దూరం చేసుకుంటున్నారు.ఇపుడు ఉన్న కాలంలో మానవ సంబంధాలు సన్నగిల్లుతున్నాయి.పూర్వకాలంలో ఆస్తులకు,అంతస్తులు,డబ్బుకు,బంగారు కు విలువనిచ్చేవారు కాదు.తోడబుట్టినవారు ఇరుగుపొరుగు వారు అంతా కలిసి మెలిసి జీవించేవారు. ఈరోజు అవేవి మచ్చుకైనా కనబడుటలేదు.డబ్బుకు,ఆస్తులకు,అయిన వారిని ఆత్మీయులను తోడబుట్టిన వారిని స్వార్థం ఆలోచించి చంపడానికైనా వెనుకాడటం లేదు.వృద్ధ తల్లిదండ్రులను కంటికి రెప్పలా కాపాడిన వారిని అనాధ రామాలయంలో వదిలి పెడుతున్నారు.వావి వారుసులు మరిచిఅఘాయిత్యాలకు వెనుకాడటం లేదు. మనుషులుగా బతుకడంలేదు.యంత్రాలుగా జీవిస్తున్నారు.కారణం వారికి ప్రేమ,దయ,సేవాగుణం,కరుణ,జాలి,సహాయం, తోడ్పాటు చేసే ఏగుణాలు లేవు.మోసంతో స్వార్థంతో భయపెట్టో,బాధపెట్టో,ఆక్షణం దొరికే ఆనందం కోసం ఆలోచిస్తున్నారు.ఎదుటివారి ప్రేమ తెలియదు. తోటివారికి సహాయం చేసే గుణం ఉండదు.ఇతరులపై జాలిచూపే మనస్సు ఉండదు.కష్టలలో తోడు నిలిచే నిజాయితీ లేదు.ఇరుగు పోరుగు వారితో కలిసి మెలిసి జీవించే ఆలోచన ఉండదు.ఇవన్నీ మనిషిని స్వార్థపరునిగా చేసి ఒంటరి వాణి చేసి అన్ని ఉన్న అనాదిగా మార్చుతున్నాయి.డబ్బు, ఐశ్వర్వం,హోదా అన్ని ఉన్న ఓదార్పు కోసం ఇష్టపడుతున్నారు.ఏది ఏమైనా రోజు రోజుకు మనిషి యాంత్రికంగా మారిపోయాడు.ఈవిధంగా మానవ సంబంధాలు కనుమరుగై పోతున్నాయి అనడంలో ఎలాంటి అనుమానం లేదు.

మాచర్ల మధుసూధన్ గౌడ్.
సింగోటం"గ్రా||, "కొల్లాపూర్" మం "
నాగర్ కర్నూల్" జిల్లా ".
9908677543

# కవీ సేద్యకారుడే !

కవీ సేద్యకారుడే
సాహిత్యం పండిస్తాడు
సంఘ హితం కోరుతాడు !
కవీ రైతు
సమాజానికి రెండు కళ్ళు
సహజీవనానికి రెండు కాళ్ళు !
హలంతో భూమిపై గీస్తాడు రైతు
కలంతో కాగితంపై రాస్తాడు కవి!
విత్తనాలు జల్లుతాడు వాడు
అక్షరాలు అల్లుతాడు వీడు !
నీటిని గుమ్మరిస్తాడక్కడ
సిరా చిమ్మరిస్తాడిక్కడ!
ఎరువులు వాడుతాడు వాడు
తలపులు కూరుతాడు వీడు!
అతివృష్టి అనావృష్టి ఉండకూడదక్కడ
వక్ర సృష్టి , వాణిజ్య దృష్టి ఉండకూడదిక్కడ !
పంటలు పండించే రైతు
ఆకలి బాధ తీరుస్తాడు
సాహిత్యం పండించే కవి
సంఘ హితం కోరుతాడు !

పి. లక్ష్మణ్ రావ్
అసిస్టెంట్ రిజిస్ట్రార్ (సహకార శాఖ )
విజయనగరం
9441215989

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com






## పుల్లని త్రేన్పులు వస్తున్నాయా?

ఆహారం తిన్న తర్వాత విరేచనాలు కావడం సర్వసాధారణం. కానీ కొన్నిసార్లు పుల్లటి త్రేన్పు వస్తుంది. ఇది అసౌకర్యాన్ని కలిగిస్తుంది , నోటిలో రుచిని కూడా పాడుచేయవచ్చు. ఇది ఛాతీ , గొంతులో మంటను కూడా కలిగిస్తుంది. పుల్లని త్రేన్పు అనేక కారణాలను కలిగి ఉంటుంది. వాటిలో ఒకటి ఎక్కువగా నూనెతో కూడిన ఆహారాన్ని తినడం. అతిగా తినడం సహా.. ఈ పుల్లటి త్రేన్పు, అసిడిటీని పోగొట్టుకోవడానికి కొన్ని హెూం రెమెడీస్ చెప్పాము. జీలకర్ర జీర్ణక్రియకు మంచిదని భావిస్తారు. తిన్న తర్వాత పుల్లగా అనిపిస్తే జీలకర్ర నీళ్లు తాగండి . ఇది జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. ఒక చెంచా జీలకర్ర పొడిని 1 గ్లాసు నీటిలో కలిపి తాగవచ్చు. లేదా జీలకర్రను నీటిలో వేసి మరిగించి తాగవచ్చు. ఆహారం తిన్న తర్వాత గ్యాస్ , బెల్చింగ్ ఉంటే, పుదీనా ఆకులను ఉపయోగించండి. పుదీనా ఆకులు శీతలీకరణ ప్రభావాన్ని కలిగి ఉంటాయి. ఇది గుండెల్లో మంటను తగ్గిస్తుంది , ఎసిడిటీని తగ్గిస్తుంది. ఇది పుల్లని త్రేన్పు, గ్యాస్ నుండి ఉపశమనం అందిస్తుంది. సోంపు పొట్టకు చాలా మేలు చేస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల గ్యాస్ట్రిక్, అసిడిటీ , పుల్లని త్రేన్పుసమస్యలకు సహాయపడుతుంది. సోంపు జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని పెంచుతుంది , ఆహారాన్ని సులభంగా జీర్ణం చేస్తుంది. కాబట్టి భోజనం తర్వాత అర చెంచా సోంపు తినండి. అల్లం కడుపుకు మంచిదని భావిస్తారు. పుల్లటి త్రేన్పుల విషయంలో అల్లం సేవించడం మేలు చేస్తుంది. అల్లంలో యాంటీఆక్సిడెంట్ , యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. అల్లం రసం తాగడం వల్ల గ్యాస్, ఎసిడిటీ , సోర్ టీ సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. పుల్లటి త్రేన్పు ఉంటే ఇంగువ నీరు తాగండి. ఇంగువ నీరు తాగడం వల్ల కడుపు నొప్పి, గ్యాస్, ఆమ్లత్వం , పుల్లని త్రేన్పునుండి ఉపశమనం లభిస్తుంది. దీని కోసం, 1 గ్లాసు గోరువెచ్చని నీటిని తీసుకుని, దానికి 1 చిటికెడు ఇంగువ వేసి త్రాగాలి. ఇది మీకు ఏ సమయంలోనైనా ఉపశమనం ఇస్తుంది.



## ప్రతీరోజు ఒక అరటిపండు తింటే..

మార్కెట్ లో మనకు ఏడాది పొడవునా లభించే పండ్లలో అరటి పండ్లు మొదటి స్థానంలో ఉంటాయి అనడంలో ఎటువంటి సందేహం లేదు. అరటిపండు వల్ల ఎన్నో రకాల లాభాలు ఉన్నాయి అన్న విషయం మనందరికీ తెలిసిందే.అరటి పండ్లను తరచుగా తినడం వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలను కూడా పొందవచ్చు.. వీటిని చిన్నపిల్లల నుంచి పెద్దవారి వరకు ప్రతి ఒక్కరు ఇష్టపడి తింటూ ఉంటారు. అయితే ప్రతిరోజూ ఒక అరటిపండు తింటే అనేక లాభాలను పొందవచ్చు అని చెబుతున్నారు. మరి తరచూ అరటి పండ్లను తింటే ఎలాంటి లాభాలు కలుగుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. . అరటిపండ్లలో విటమిన్లు, మినరల్స్, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మనల్ని ఎన్నో వ్యాధుల నుంచి రక్షిస్తాయి..అరటిపండ్లలో ఫ్రక్టోజ్, కార్బోహైడ్రేట్లు, గ్లూకోజ్, సుక్రోజ్ వంటి చక్కెరలు మెండుగా ఇవి మన శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. అరటిపండ్లలో ఫైబర్ కంటెంట్ కూడా ఉంటుంది. ఇది మన జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. అలాగే మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలను నయం చేయడానికి సహాయపడుతుందట. అరటిపండ్లలో విటమిన్ సి, విటమిన్ బి6, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. అంతేకాదు ఈ పండులో యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయట. ఇవి మన శరీరాన్ని హెల్తీగా ఉంచుతాయి. అరటిపండును తింటే రక్తపోటు పెరుగుతుందన్న భయం కూడా ఉండదట. ఎందుకంటే ఇది రక్తపోటును నియంత్రించడానికి, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడుతుందని చెబుతున్నారు. ఈ పండులో ఉండే పొటాషియం గుండెను ఆరోగ్యంగా ఉంచుతుందట. ఈ పండులోని ఫైబర్ కంటెంట్ కడుపు పూతలను తగ్గించడానికి కూడా సహాయపడుతుందట. అరటి పండ్లలో ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం కూడా ఉంటుంది. ఇది మన ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుంది.



## డ్రైఫ్రూట్స్ తింటే బరువు తగ్గుతారా!

బరువు తగ్గడం అన్నది అంత ఈజీ విషయం కాదు అన్న విషయం మనందరికీ తెలిసిందే. ఎందుకంటే బరువు పెరగడం ఎంత ఈజీనో, బరువు తగ్గడం అన్నది అంత కష్టమైన పని. బరువు తగ్గడం కోసం ఎన్నెన్నో ప్రయత్నాలు కూడా చేస్తూ ఉంటారు. కొందరు అయితే తినడం మానేస్తూ ఉంటారు.కొందరు రకరకాల ప్రయత్నాలు కూడా చేస్తుంటారు. వాటితో పాటు కొన్ని రకాల పనులు చేస్తే తప్పకుండా బరువు తగ్గుతారని చెబుతున్నారు. మరి అందుకోసం ఏం చేయాలో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. బరువు తగ్గించడంలో డ్రై ఫ్రూట్స్ ఎంతో బాగా ఉపయోగపడతాయట. అందులో ఖర్జూరం కూడా ఒకటి. కాగా ఖర్జూరాలు మన ఆరోగ్యానికి చేసే మేలు అంతా ఇంతా కాదు. ఇవి మీరు బరువు తగ్గడానికి కూడా బాగా సహాయపడతాయి. అలాగే ఈ ఖర్జూరాల్లో ఫైబర్ కంటెంట్ పుష్కలంగా ఉంటుంది. అంటే వీటిని తింటే మీ కడుపు ఎక్కువ సేపు నిండుగా ఉంటుందట. దాంతో మీరు తినాలనే కోరికను చాలా వరకు తగ్గిస్తుంది. అలాగే దీనిలో నేచురల్ షుగర్స్ పుష్కలంగా ఉంటాయి. అంటే ఇవి ఒక రోజుకు అవసరమైన ఎనర్జీని మీకు అందిస్తాయి. అసలిపోకుండా పనిచేయడానికి కూడా సహాయపడతాయని చెబుతున్నారు.అలాగే అంజీర పండ్లలో మన ఆరోగ్యానికి అవసరమైన ఎన్నో రకాల పోషకాలు ఉంటాయి. ఈ అంజిరా పండ్లు కూడా బరువు తగ్గించడానికి ఎంతో బాగా ఉపయోగ పడతాయట. అంజీర పండ్లు కూడా డ్రై గా దొరుకుతాయి. ఈ పండ్లలో ప్రోటీన్ పుష్కలంగా ఉంటుంది. అలాగే దీనిలో కేలరీలు తక్కువగా, ఫైబర్ కంటెంట్ మెండుగా ఉంటుంది. ఇది మీరు అతిగా తినకుండా చేసి బరువు తగ్గేలా చేస్తుంది. బరువు తగ్గడానికి నానబెట్టిన అంజీర పండ్లను తినాలనీ చెబుతున్నారు. జీడిపప్పు తినడం వల్ల కూడా ఈజీగా బరువు తగ్గవచ్చు అని చెబుతున్నారు. జీడిపప్పును ప్రతిఒక్కరూ ఇష్టంగా తింటారు. ఈ డ్రై ఫ్రూట్స్ టేస్టీగా ఉండటమే కాదు. మన ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయట. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునే వారికి ఇవి ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయట. ఈ డ్రై ఫ్రూట్స్ మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. ఇది మీరు బరువు తగ్గడానికి, ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపర్చడానికి సహాయపడుతుందట. అయితే జీడిపప్పులో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి మీరు బరువు తగ్గాలనుకుంటే జీడిపప్పులను ఎక్కువగా తినకపోవడమే మంచిది. మోతాదులో తింటేనే మీరు బరువు తగ్గుతారు. లేదంటే బరువు పెరిగిపోతారు. పిస్తాలు చాలా టేస్టీగా ఉంటాయి. అయితే ఇవి మీరు ఫాస్ట్ గా బరువు తగ్గడానికి కూడా సహాయపడతాయి. పిస్తాలను తింటే మీరు ఇబ్బంది లేకుండా బరువు తగ్గుతారని నిపుణులు చెబుతున్నారు. అలాగే బాదంపప్పు ఎండు ద్రాక్ష వంటివి కూడా బరువు తగ్గడానికి ఎంతో బాగా ఉపయోగపడతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

## చపాతీ ఎక్కువ తింటున్నారా?



చపాతీ గురించి చెప్పాల్సిన అవసరం లేదు. ఈ ఫుడ్ ను చాలా మంది ఇష్టపడతారు కూడా. సింపుల్ గా ఉండే ఈ ఫుడ్ ను వెయిట్ లాస్ కోసం వినియోగిస్తారు. ఎందుకంటే చపాతీ అంటే వెంటనే మన గుర్తుకు వచ్చేది వెయిట్‌లాస్ బెస్ట్ డైట్ ఫుడ్. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో చాలా మందికి ప్రధాన ఆహారం ఈ చపాతీనే. చపాతీ లేకుండా వారికి రోజు గడవదంటే నమ్మరు కావచ్చు మీరు. ఫిట్నెస్ మీద శ్రద్ధ పెడుతున్నవారు ఈ చపాతీ మీదనే ఎక్కువ డిపెండ్ అవుతుంటారు. దీన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మంచి ఆరోగ్యానికి సొంతం చేసుకోవచ్చని చాలా మంది నమ్ముతారు. అయితే ఈ ఆరోగ్య సమస్యలున్నవారు మాత్రం చపాతీ తినడం మానుకోవాలని నిపుణులు అంటున్నారు. అవేంటో ఓ సారి తెలుసుకుందాం.. ఎప్పుడు అలసిపోయినట్లు అనిపిస్తుందా? అయితే మీరు కచ్చితంగా చపాతీ తినకపోవడమే మంచిది. ఎందుకంటే గోధుమలలోని కార్బోహైడ్రేట్ రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. దీనివల్ల అలసట, నీరసం మరింత పెరుగుతాయి. ఇది శక్తిని తగ్గించి ఆకలిని పెంచుతుంది. కాబట్టి, అలసటగా ఉంటే చపాతీ తినకపోవడమే మంచిది. మీకు ఏదైనా థైరాయిడ్ సమస్య ఉంటే చపాతీకి దూరంగా ఉండటమే చాలా మంచిది అంటున్నారు నిపుణులు. ఎందుకంటే గోధుమలలో గ్లూటెన్ పెద్ద మొత్తంలో ఉంటుంది. ఇది ఆటో ఇమ్యూన్ థైరాయిడ్ వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. దీని వల్ల థైరాయిడ్ సమస్య కూడా తీవ్రం అవుతుంది అంటున్నారు నిపుణులు. ఇటీవలి కాలంలో మధుమేహంతో బాధపడే వారి సంఖ్య గణనీయంగా పెరిగి పోతుంది. ఇక మధుమేహ వ్యాధిగ్రస్తులు అన్నానికి బదులు గోధుమ చపాతీ ఎక్కువగా తినడం అలవాటు చేసుకుంటున్నారు. కానీ మధుమేహ వ్యాధిగ్రస్తులు చపాతీ తినకపోవడమే బెటర్. ఇందులో అమిలోపెక్టిన్ అనే స్టార్చ్ మాలిక్యూల్స్ ఉంటాయి. కాబట్టి బ్లడ్ షుగర్ ఎక్కువగా ఉన్నవారు చపాతీని తక్కువగా తీసుకోవాలి అంటున్నారు నిపుణులు. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు. చాలామంది అన్నం మానేసి చపాతీ తింటారు. అయితే చపాతీలు ఎక్కువగా తింటే బరువు పెరుగుతారనిపిస్తుంది. గోధుమల్లో ఉండే గ్లూటెన్‌లోని కార్బోహైడ్రేట్లు శరీరంలో కొవ్వును నిల్వ చేస్తాయి. కాబట్టి వీటికి దూరంగా ఉండాలి. లేదంటే ఇవి చాలా సులభంగా బరువు పెరగడానికి దారితీస్తాయి. కాబట్టి వీలైనంత వరకు చపాతీకి దూరంగా ఉండటం మంచిది. చపాతీ ఎక్కువగా తినడం వల్ల గ్యాస్, ఎసిడిటీ, అజీర్ణం వంటి సమస్యలు కూడా వస్తాయి అంటున్నారు నిపుణులు. అలాగే, గోధుమలలోని గ్లూటెన్ పేగులలో మంటను కలిగిస్తుంది. ఇది జీర్ణ సమస్యలను కూడా కలిగిస్తుంది. కాబట్టి పొట్ట సంబంధిత సమస్యలతో బాధపడేవారు దీనిని తీసుకోకుండా ఉండటం ఆరోగ్యానికి మంచిది.


## కాళ్లు, మొహం వంటివి ఉబ్బుతున్నాయా?

ప్రస్తుతం చాలా వ్యాధులు భయాందోళనకు గురి చేస్తున్నాయి. వయసు మీద పడిన తర్వాత రావాల్సిన వ్యాధులు కూడా చిన్న వయసులోనే వస్తున్నాయి. చిన్నపిల్లలకే కండ్లు కనిపించకపోవడం, కాళ్ల నొప్పులు రావడం వంటివి తరచూ చూస్తున్నాం. ఇది పక్కన పెడితే.. బస్ లో ప్రయాణం చేస్తున్నప్పుడు లేదంటే ఎక్కువ సేపు ఒకే ప్లేస్ లో కూడా కూర్చున్నప్పుడు కాళ్లు, మడమ వంటివి వాస్తుంటాయి. అంటే ఒక్కోసారి ఉన్నట్లుండి పాదాలు, మోకాళ్లలో వాపు వస్తుంది.. ఇలా ఎందుకు జరుగుతుందో తెలియక చాలా మంది భయపడుతుంటారు. శరీరంలో ఆకస్మిక వాపు, నొప్పిని ఎడెమా అని పిలుస్తారు. అయితే పాదాలు, మోకాలు, చీలమండలలో వాపు రావడమే ఈ ఎడెమా. కేవలం ఈ శరీర భాగాల్లో మాత్రమే కాదు కొన్నిసార్లు ముఖం మీద కూడా కనిపిస్తుంది. ఈ సమస్య గర్భిణీలు, వృద్ధులలో ఎక్కువగా కనిపించినా ప్రస్తుతం నేటి ఆధునిక జీవితంలో కూడా ఈ సమస్య మరింత ఎక్కువ కనిపిస్తుంది. కణజాలంలో అదనపు ద్రవం పేరుకుపోయినప్పుడు ఈ సమస్య ఏ వ్యక్తిలోనైనా సంభవించవచ్చు. ఎక్కువ సేపు కూర్చున్నప్పుడు లేదా నిలబడినప్పుడు చాలా మందిలో ఈ సమస్య కనిపిస్తుంది. ఈ సమస్య సాధారణంగా వేసవిలో కనిపిస్తుంది. అంతేకాదు మీ వంటల్లో లేదా డైలీ లైఫ్ లో ఎక్కువ ఉప్పు తీసుకోవడం, మందుల దుష్ప్రభావాలు ఎడెమా సమస్యలను కలిగిస్తాయి. స్పష్టమైన కారణం లేకుండా వాపును అనుభవిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఇంట్లో ఉపశమనం పొందాలంటే, ఉబ్బిన ప్రదేశంలో 15 సెకన్ల పాటు నొక్కాలి. అయితే ఇలా చేస్తున్నప్పుడు మీకు వెంటనే ఎముక కనిపిస్తే, వెంటనే డాక్టర్ వద్దకు వెళ్లడం మంచిది. దీని తరువాత కొన్ని పరీక్షలు చేయించుకుంటే ఎడెమా ఉందా లేదా అని డాక్టర్ తనిఖీ చేస్తారు. కొందరికి కాలేయ వ్యాధి, మూత్రపిండాల వ్యాధి ఉంటుంది. ఇలాంటి వ్యాధులతో బాధపడేవారిలో ఎడెమాను పూర్తిగా నిరోధించడం కష్టమే అంటున్నారు నిపుణులు.



## రాత్రి పూట తినడం లేదా !

మనలో చాలామంది రాత్రిపూట తినడం మానేస్తూ ఉంటారు. రాత్రి సమయంలో తినకుండా ఏవో చిన్న చిన్న ఆహార పదార్థాలు తిని అలాగే పడుకుంటూ ఉంటారు. అంటే నైట్ పూట ఆహారాన్ని స్కిప్ చేస్తూ ఉంటారు అని చెప్పవచ్చు.కానీ అలా అస్సలు చేయకూడదని వైద్యులు చెబుతుంటారు. ఒకవేళ రాత్రిపూట డిన్నర్ ని స్కిప్ చేస్తే ఏం జరుగుతుందో ఇప్పుడు మనం తెలుసుకుందాం..బరువు తగ్గుతామని రాత్రిపూట తినకపోతే మీరు పెద్ద తప్పు చేసినట్టే అని చెబుతున్నారు. ఎందుకంటే రాత్రిపూట తినకపోవడం వల్ల మీ శరీరంలో పోషకాహార లోపాలు ఏర్పడతాయట. అంటే మీరు పోషకాహార లోపానికి గురవుతారన్న మాట. అయితే ఇది మీ శారీరక విధులను ప్రభావితం చేస్తుందని,దీనివల్ల మీరు బలహీనంగా మారుతారని, అలాగే రక్తహీనత సమస్యను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. రాత్రిపూట తినకపోతే లేనిపోని అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకున్నట్టే అవుతుందట. ఒకరకంగా చెప్పాలంటే ఇది ఒక చెడు అలవాటు అంటున్నారు. చాలామంది రాత్రిపూట తినకుండా ఉంటే బరువు తగ్గుతారని అపోహ పడుతూ ఉంటారు. రాత్రిపూట నిద్రలో ఉన్నప్పుడు శారీరక శ్రమ చేయకపోయినా మన మెదడు పనిచేస్తుంది. దీనివల్ల మరుసటి రోజు మీరు బలహీనంగా ఉంటారు. బాగా అలసిపోయినట్టుగా అనిపిస్తుందట. కొన్ని కొన్ని సార్లు లేవడానికి కూడా మీరు బద్ధకిస్తూ ఉంటారు. అలా రాత్రిపూట తినని వారి ఉదయాన్నే కొంచెం అర్లీగా ఎక్కువగా తింటూ ఉంటారు. ఇలా చేయడం అసలు మంచిది కాదట. రాత్రిపూట తినకపోవడం వల్ల సరిగ్గా నిద్రరాదు. అలాగే రోజు మీరు బద్ధకం, అలసటగా భావిస్తారు. కాబట్టి ఎట్టిపరిస్థితిలో డిన్నర్ ను స్కిప్ చేయొద్దు అని చెబుతున్నారు వైద్యులు. అలాగే మీరు రాత్రి భోజనం చేయడం మానేస్తే అది మీ జీర్ణవ్యవస్థను కూడా ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందట. జీర్ణక్రియ విఫలమైతే మీ ఆరోగ్యం దెబ్బతింటుందని, కాబట్టి మర్చిపోకుండా డిన్నర్ చేయాలనీ చెబుతున్నారు. దీనివల్ల మీ శరీరానికి అవసరమైన శక్తి అందుతుంది. సరైన ఆహారం, నిద్ర మన రోజును మరింత ఆనందంగా ఉంచుతాయి. అలాగే మన జీవనశైలిని మెరుగుపరుస్తాయని చెబుతున్నారు.



www.varadhinews.com
వారధి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్

## పార్లమెంటరీ కమిటీ ముందు సెబీ చీఫ్ గైర్హాజరు

### సమావేశాన్ని వాయిదే వేసిన కమిటీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 :** పార్లమెంటరీ కమిటీ సమావేశానికి సెబీ చీఫ్ మాధబి పురీ బచ్ గైర్హాజరయ్యారు. దేశంలోని నియంత్రణ సంస్థల పనితీరును సమీక్షించేందుకు సెబీ చీఫ్‌కు పార్లమెంటరీ కమిటీ సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో గురువారం ఆమె కమిటీ ముందు హాజరుకావాల్సి ఉంది. అయితే కొన్ని ముఖ్యమైన కారణాలరీత్యా తాను హాజరుకాలేనని కమిటీకి తెలియజేశారు. దీంతో రివ్యూ కమిటీ సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలుస్తోంది. సెబీ చీఫ్ గైర్హాజరుపై ప్యానెల్‌కు నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ స్పందించారు. మొదటి కమిటీ సమావేశంలో రెగ్యులేటరీ పనితీరుపై సమీక్షించాలని భావించాం. మీటింగ్ కోసం సంబంధిత వ్యక్తులకు నోటీసులు పంపాం. వారు సమావేశం నుంచి మినహాయింపు కోరారు. కానీ మేం దాన్ని తిరస్కరించాం. ఆ తర్వాత తాను, తన బృందంతో కలిసి మీటింగ్‌కు హాజరవుతామని తెలిపారు.

## జగన్ మనస్తత్వం మరోసారి నిరూపితమైంది : తులసిరెడ్డి

**విజయవాడ, అక్టోబర్ 24 :** జగన్ మనస్తత్వం ఏంటో మరోసారి నిరూపిత మైందని కాంగ్రెస్ సీనియర్ నేత తులసిరెడ్డి అన్నారు. డబ్బుకోసం తల్లి, చెల్లిని కూడా దూరం పెట్టగలనని ఆయన మళ్లీ నిరూపించారని వ్యాఖ్యా నించారు. కడపలో మీడియాతో తులసిరెడ్డి మాట్లాడారు. కుటుంబ ఆస్తిపాస్తుల విషయంలో జగన్‌కు డబ్బే ప్రధానమన్నారు. ఆస్తుల వాటా విషయం భవిష్యత్తులో రాజకీయంగా ఆయనకు చాలా నష్టాలను తెచ్చిపెడుతుందని చెప్పారు.



## ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం శుభవార్త

- 57 కి.మీ.ల మేర కొత్త రైల్వే లైన్ ఏర్పాటు
- రూ.2,245 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం
- కేంద్ర కేబినేట్ ఆమోదించినట్లు అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 :** ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అమరావతికి 57 కి.మీ.ల మేర కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్టు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. రాజధాని నిర్మాణం జరుగనుండడంతో రైల్వే లైన్ మరింత దోహదపడనుంది రూ.2,245 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపింది. హైదరాబాద్, కోల్‌కతా, చెన్నై సహా దేశంలోని ప్రధాన మెట్రో నగరాలతో రాజధాని అమరావతిని కలుపుతూ కొత్త రైల్వే ప్రాజెక్టు చేపట్టనున్నట్టు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా కృష్ణా నది పై 3.2 కి.మీ పొడవైన వంతెన నిర్మాణం చేపట్టనున్నారు. ఏపీలో కొత్త రైల్వే లైన్ అమరావతి మీదుగా ఎర్రుపాలెం నుంచి నంబూరు మధ్య ఏర్పాటు కానుంది. ఈ రైల్వే లైన్‌తో దక్షిణ, మధ్య, ఉత్తర భారత్‌తో అనుసంధానం మరింత సులువు కానుంది. అమరావతి స్తూపం, ఉండవల్లి గుహలు, అమర లింగేశ్వరస్వామి ఆలయం, ధ్యానబుద్ధ ప్రాజెక్టుకు వెళ్లే వారికి సులువైన మార్గంగా అభివృద్ధి చేయనున్నారు. మచిలీపట్నం, కృష్ణపట్నం, కాకినాడ పోర్టులను అనుసంధానిస్తూ ఈ రైల్వేలైన్ ఏర్పాటు కానుంది. బిహార్‌లో రూ.4,553 కోట్ల అంచనా వ్యయంతో రైల్వే ప్రాజెక్టుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. నర్కతియాగంజ్–రక్సాల్– సీతామఢీ–దర్భంగా; సీతామఢీ–ముజఫర్‌పుర్ కారిడార్ డబ్లింగ్ పనులు చేపట్టనున్నారు. మొత్తంగా 256 కిలోమీటర్ల పొడవైన ఈ ప్రాజెక్టుతో ఉత్తరప్రదేశ్, ఉత్తర బిహార్‌లకు ప్రయోజనం చేకూరనుంది. ఏపీ, బిహార్‌లలో చేపట్టే ఈ రైల్వే ప్రాజెక్టులను నాలుగేళ్లలో పూర్తి చేయనున్నారు. అంతరిక్ష రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు రూ.1,000 కోట్ల వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ఫండ్ దాదాపు 40 స్టార్టప్‌లకు తోడ్పాటు అందించే అవకాశం. అంతర్జాతీయంగా పోటీతత్వాన్ని బలోపేతం చేయడంతో పాటు ఆత్మనిర్భర్ భారత్‌కు మరింత ప్రోత్సహం కల్పించేలా ఈ నిధి ఉపయోగపడనుంది.

# కెనడా ప్రధాని ట్రుడోపై అసంతృప్తి జ్వాల

- వివాదమవుతున్న పలు నిర్ణయాలు
- సొంత పార్టీ ఎమ్మెల్యేలే నిరసన గళం
- వచ్చే ఎన్నికల్లో విజయం అనుమానమన్న సర్వే



**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 :** కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోపై స్వపక్షంలోనే అసంతృప్తి భగ్గుమంది. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రకటనలు దేశంలో తీవ్ర అసంతృప్తిని కలుగ చేస్తున్నాయి. ముఖ్యంగా భారత్ వ్యతిరేక వైఖరి పట్ల తీవ్ర వ్యతిరేకత వస్తోంది. అందుకే ఆయన రాజీనామా చేయాలని 24 మంది లిబరల్ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం ఆ పార్టీ ఓ క్లోజ్డ్‌డోర్ సమావేశం నిర్వహించింది. ఈ ఏడాది జూన్, సెప్టెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో తీవ్రంగా దెబ్బతినడానికి ప్రధాని ట్రూడో వైఖరే కారణమని అందులో సభ్యులు అసంతృప్తి వ్యక్తంచేశారు. దీనిపై ట్రూడో సన్నిహితుడిగా పేరున్న ఇమిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ మాట్లాడుతూ ఇది చాలా రోజులుగా నలుగుతున్న విషయం. ప్రజలు దీనిని బయటపెట్టడం అవసరం. ఎన్నికల్లో ఏం జరిగింది అనే విషయాన్ని ఎంపీలు నిజాయతీగా ప్రధానికి వెల్లడించారు. ఆయనకు వినడం ఇష్టం ఉన్నా లేకపోయినా వారు మాత్రం చెప్పేశారని రిపోర్టర్ల వద్ద వ్యాఖ్యానించారు. ట్రూడో రాజీనామా చేయాలన్న లేఖపై మొత్తం 153 మంది ఎంపీల్లో 24 మంది సంతకాలు చేశారని కెనడా బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ వెల్లడించింది. అక్టోబర్ 28 వరకు డెడ్‌లైన్ విధించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే మైనార్టీలో ఉన్న ప్రభుత్వానికి ఇది మరింత సవాలుగా మారనుంది. జూన్, సెప్టెంబర్ ఎన్నికల్లో లిబరల్స్ బలమైన రెండు స్థానాలను కోల్పోయారు. అంతేకాదు.. పార్టీ వచ్చే ఎన్నికలకు చేసే సన్నాహాలు కూడా దారుణంగా ఉన్నాయని ఎంపీలు అభిప్రాయపడ్డారు. పార్టీ ఎంపీ ఎరిస్కిన్ స్మిత్ మాట్లాడుతూ పరిస్థితులను చక్కదిద్దడానికి ట్రూడోకు ఇంకా సమయం ఉందని వ్యాఖ్యానించారు. మీ సహచరులు అసంతృప్తి వ్యక్తంచేసినప్పుడు దానిని వినడం చాలా ముఖ్యమన్నారు. ఈ సమావేశ సమయంలో ట్రూడో విలేకర్లతో మాట్లాడుతూ తాము బలంగా, సమష్టిగా ఉన్నామని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలకు తానే నాయకత్వం వహిస్తానని వెల్లడించారు. చాలాకాలం లిబరల్స్‌తో కలిసి ప్రభుత్వాన్ని నడిపిన ఎన్‌డీపీ కూడా ఈసారి బ్రిటిష్ కొలంబియా ఎన్నికల్లో తీవ్రంగా దెబ్బతింది. అక్కడ కన్జర్వేటివ్ పార్టీ ఎవరూ ఊహించని స్థాయిలో బలపడింది. ఇటీవల నానోస్ రీసెర్చి సర్వేలో అక్టోబర్ 15 నాటికి ప్రజల్లో 39శాతం మద్దతు కన్జర్వేటివ్‌లకు ఉండగా.. లిబరల్స్‌కు కేవలం 23శాతం మాత్రమే ఉన్నట్లు వెల్లడైంది. ఇక న్యూడెమోక్రాట్స్‌కు 21శాతం మంది సానుకూలంగా ఉన్నట్లు తేలింది. ఖలిస్థానీ మద్దతుదారులను లక్ష్యంగా చేసుకొని భారత ప్రభుత్వ ఏజెంట్లు పనిచేస్తున్నారని, వారికి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగులతో సంబంధాలున్నాయని కెనడా ఆరోపిస్తోంది. ఈ ఆరోపణలకు సంబంధించి కేవలం తమవద్ద గతంలో నిఘా సమాచారం మాత్రమే ఉందని ప్రధాని జస్టిన్ ట్రూడో ఇటీవల అంగీకరించారు. ఈ ఆరోపణలతో ఇరుదేశాల మధ్య సంబంధాలు తీవ్రస్థాయిలో దెబ్బతిన్నాయి. ఇదిలావుంటే వలసల నియంత్రణకు కెనడా ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. తమ దేశంలోకి అనుమతించే వలసదారుల సంఖ్యను భారీగా తగ్గించేందుకు సిద్ధమైంది. మరోసారి అధికారంలోకి రావాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు అక్కడి వార్తాపత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. ఈ కథనాల ప్రకారం.. 2024లో 4,85,000 మందిని శాశ్వత నివాసితులుగా కెనడా గుర్తించింది. అయితే, 2025లో ఈ సంఖ్య 3,80,000లకు మాత్రమే పరిమితం చేసింది. 2027 నాటికి 3,65,000 మందికి మాత్రమే ప్రవేశం కల్పించాలని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. 'కెనడాలో తాత్కాలిక విదేశీ ఉద్యోగుల సంఖ్యను తగ్గిస్తున్నాం. కంపెనీలకు సంబంధించి కొన్ని కఠిన నిబంధనలు తీసుకురానున్నాం. నియామకాల విషయంలో కంపెనీలు స్థానికులకు ఎందుకు ప్రాధాన్యత ఇవ్వలేదో వెల్లడించాల్సి ఉంటుంది' అని ఆయన పేర్కొన్నారు. వచ్చే ఏడాది కెనడాలో ఎన్నికలు జరగనున్నాయి. ఈక్రమంలో చేపట్టిన సర్వేల్లో ట్రూడో నేతృత్వంలోని లిబరల్ ప్రభుత్వం వెనకంజలో ఉంది. వలసల కారణంగా నిరుద్యోగం పెరిగిపోతుండటంతో పాటు, దేశీయంగా ఇళ్ల కొరత విపరీతంగా ఉంది. దీంతో అధికార ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. అందులోభాగంగా ఇటీవల విదేశీ విద్యార్థులకు స్టడీ పర్మిట్లు, వర్కర్లకు పని అనుమతులపై మరిన్ని ఆంక్షలు తీసుకురానున్నట్లు ప్రకటించింది. తాజాగా వలసదారుల సంఖ్యను తగ్గించేందుకు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

## కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌లో నిర్మాణాలు

- నెహారెడ్డి తదితరులపై చర్యలు తీసుకున్నారో చెప్పండి
- విశాఖ గ్రేటర్ మున్సిపల్ అధికారులకు హైకోర్టు ప్రశ్న




**అమరావతి, అక్టోబర్ 24 :** విశాఖ జిల్లా భీమిలిపట్నం పరిధిలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌లో నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టిన వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి కుమార్తె నెహారెడ్డి ఇతర బాధ్యులపై ఏం చర్యలు తీసుకున్నారని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఏపీ హైకోర్టు ప్రశ్నించింది. ఇక ఈ వ్యవహారంపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారా.. అని ఆరా తీసింది. వివరాలతో నివేదిక సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. భీమిలి బీచ్ వద్ద సీఆర్‌జడ్ ప్రాంతంలో సముద్రానికి అతి సమీపంలో శాశ్వత కాంక్రిట్ నిర్మాణం చేపడుతున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ ప్రజాప్రయోజన వాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై గురువారం విచారణ జరిపిన ధర్మాసనం సముద్రానికి అతి సమీపంలో చేపట్టిన శాశ్వత నిర్మాణాలను తొలగించాలని జీవీఎంసీని ఆదేశించింది. ఈ వ్యాజ్యం నిన్న మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపించారు. కాగా వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కూతురు నేహారెడ్డి భీమిలి బీచ్ వద్ద సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రహరీ నిర్మాణాన్ని చేపట్టారు. నేహా రెడ్డి సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ హైకోర్టులో పిల్ కూడా దాఖలు చేశారు. బీచ్‌లో కాంక్రీట్ నిర్మాణాలను అనుమతించవద్దని అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. నేహా రెడ్డికి సెప్టెంబర్ 2న జీవీఎంసీ నోటీసులు జారీ చేసింది. 24 గంటల్లో ఆక్రమణలు తొలగించాలని.. లేదంటే తామే తొలగిస్తామని హెచ్చరించింది. ఈ క్రమంలో అక్రమ నిర్మాణాలు కూల్చివేసేందుకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. విశాఖ జిల్లా భీమిలి బీచ్ వద్ద సముద్రానికి అతి సమీపంలో సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘించి నేహారెడ్డి కాంక్రీట్ గోడను నిర్మించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ అధికారులకు ఇప్పటికే హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. భీమిలి బీచ్ సమీపంలో శాశ్వత నిర్మాణాలపై జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ పిల్ వేశారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. కూల్చివేత విషయంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో వివరిస్తూ స్థాయి నివేదికను సమర్పించాలని గత నెలలో హైకోర్టు నిర్దేశిరచి ఆపై తదుపరి విచారణను సెప్టెంబరు 11వ తేదీకి వాయిదా వేసింది. భీమిలి బీచ్ సమీపంలో శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ తరఫున న్యాయవాది పొన్నాడ శ్రీవ్యాస్ వాదనలు వినిపించారు.

## ఆరేళ్లయినా కార్యకలాపాలు ఏవీ?

- సరస్వతీ పవర్‌కు భూములను రద్దు చేయండి
- తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

**అమరావతి, అక్టోబర్ 24 :** ఆస్తి కోసం తల్లి, చెల్లిని బ్లాక్‌మెయిల్ చేసిన జగన్‌ను మాజీ సీఎం అని పిలవాలన్నా అసహ్యం వేస్తోందని మాజీ మంత్రి, తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆస్తి ఇవ్వనంటూ కోర్టుకెళ్లడం ఆయన క్రూర మనస్తత్వానికి నిదర్శనమని దుయ్యబట్టారు. జగన్ అనుభవిస్తున్న ఆస్తి ప్రజలదని వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సోమిరెడ్డి మాట్లాడారు. సరస్వతీ పవర్‌కు కేటాయించిన ప్రభుత్వ భూమి లీజు 30 ఏళ్లకు జగన్ పొడిగించుకున్నారని సోమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ 6 ఏళ్ల వరకూ కార్యకలాపాలు ప్రారంభించకపోవడం నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. ఆ భూ కేటాయింపులను ప్రభుత్వం ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలని నిలదీశారు. నిబంధనలకు విరుద్ధంగా సరస్వతి పవర్ యాజమాన్యం వ్యవహరించినందున కేటాయింపులు రద్దు చేయాలని సీఎం చంద్రబాబును కోరారు. ప్రజల ఆస్తులు కూడగట్టుకున్న జాబితాలో జగన్‌ది దేశంలో 2వ స్థానమని ఆరోపించారు. కాంగ్రెస్‌తో ఆయన జరుపుతున్న మంతనాలు ఇప్పటికే బయటకు తెలిశాయన్నారు. ఏ తల్లి అయినా తన పిల్లలందరినీ సమానంగా చూసుకుంటుందని.. కానీ జగన్ క్రూరత్వం గ్రహించే షర్మిలతో విజయమ్మ ఉండాల్సి వస్తోందన్నారు. జగన్ క్రూరత్వంపై ఓ దర్శకుడు సినిమా సన్నివేశం తీశారంటూ వీడియోను సోమిరెడ్డి ప్రదర్శించారు. జగన్ ఒప్పుకుంటే సరస్వతీ పవర్ 1500 ఎకరాలను 3 భాగాలు చేసి ఒక భాగం రైతులకిచ్చి.. మిగిలిన 2 భాగాలను జగన్, షర్మిలకు సమానంగా పంచుతామన్నారు.


## కాశ్మీర్‌లో రెచ్చిపోయిన ఉగ్రవాదులు

### కాల్పుల్లో ఒకరికి తీవ్ర గాయాలు

**శ్రీనగర్, అక్టోబర్ 24 :** జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. పుల్వామాలోని స్థానికులపై ఒక్కసారిగా కాల్పులకు తెగబడ్డారు. గురువారం ఉదయం జిల్లాలోని త్రాల్ ప్రాంతంలో జరిపిన కాల్పుల్లో ఒక కార్మికుడు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. బటాగుండ్ గ్రామంలో టెర్రరిస్టులు కాల్పులు జరపడంతో బిజ్నోర్‌కు చెందిన శుభమ్ కుమార్ చేతికి బుల్లెట్ గాయమైందని అధికారులు వెల్లడించారు. ఉగ్రవాదుల కోసం ఆర్మీ అధికారులు గాలిస్తున్నారు. ఆదివారం ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు కార్మికులు, ఒక వైద్యుడు మరణించిన ఘటన తీవ్రకలకలం రేపింది. నాలుగురోజుల్లోనే మరోసారి దాడికి పాల్పడటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వారంరోజుల్లో ఉగ్రవాదులు మూడుసార్లు కాల్పులకు పాల్పడటం కలకలం రేపింది.

# కొత్త రైల్వేలైన్‌తో అమరావతి అనుసంధానం

- కేంద్రానికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు
- రాష్ట్రంలోని ప్రాజెక్టులకు 3 నెల్లలో భూ సేకరణ
- రహదారుల అభివృద్ధికి ప్రత్యేక స్థానం
- వర్చువల్‌గా పాల్గొన్న సీఎం, డిప్యూటి సీఎం



**అమరావతి, అక్టోబర్ 24 :** అమరావతికి రైల్వేలైన్ మంజూరు చేసిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. అశ్వినీ వైష్ణవ్ నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఏపీ భాజపా అధ్యక్షురాలు పురంధేశ్వరి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. కొత్త రైల్వేలైన్ ఏర్పాటుతో అమరావతి దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానం కానుందన్నారు. విశాఖ రైల్వే జోన్ అంశం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. భూసేకరణ సహా ఇతర అంశాల్లో రాష్ట్ర సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. రూ.45,300 కోట్లతో నాలుగు గ్రీన్‌ఫీల్డ్ రహదారుల నిర్మాణం జరగనుందని, 6 ప్రాజెక్టులు బిడ్డింగ్ దశలో ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. 15 ప్రాజెక్టులు నిలిచిపోయాయని, 75 ప్రాజెక్టులకు భూసేకరణ సమస్యలు, 23 ప్రాజెక్టులకు అటవీ అనుమతుల సమస్యలు ఉన్నాయన్నారు. మొత్తం 95 ప్రాజెక్టులకు వివిధ సమస్యలు ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలో చేపట్టబోయే ప్రాజెక్టులన్నింటికీ 3 నెలల్లో భూసేకరణ పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. బెంగళూరు–కడప–విజయవాడ ఎక్స్‌ప్రెస్ వేకు సమస్యలు ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టుకు 15 రోజుల్లో పర్యావరణ అనుమతులు సాధించా లన్నారు. నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తి చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. దాదాపు రూ.18 వేల కోట్లతో పనులన్నీ పూర్తి చేయనున్నట్లు చెప్పారు. రెండున్నరేళ్లలో రూ.50 వేల కోట్లతో పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. హైదరాబాద్ నుంచి మచిలీపట్నానికి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం జరగ నుందన్నారు. ఎకో గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా ఏపీ మారనుందని తెలిపారు. ఆక్వా, హార్టికల్చర్ ఎగుమతులకు అవకాశాలు ఉన్నాయని చంద్రబాబు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు చరిత్రాత్మక రోజు అని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు అభివర్ణించారు. ఎన్డీయే ప్రభుత్వంపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉందన్నారు. పరిటాల వద్ద మల్టీ మోడల్ కార్గో టెర్మినల్ వస్తుందని వెల్లడించారు. ఏపీలో 73 రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. 160కి.మీ వేగంతో వెళ్లేలా సెమీ హైస్పీడ్ రైల్వేలైన్ల నిర్మాణం. మొత్తం మూడు కారిడార్లను అప్‌గ్రేడ్ చేస్తున్నాం. అమరావతి–హైదరాబాద్, అమరావతి– చెన్నై కారిడార్ల అభివృద్ధి. అమరావతి బెంగళూరు కారిడార్ అప్‌గ్రేడ్ చేస్తున్నాం. రైల్వే లైన్ ద్వారా అమరావతికి ప్రత్యక్ష అనుసంధానం ఉంటుంది. పరిశ్రమల స్థాపన, ప్రజా రవాణాకు మెరుగైన వ్యవస్థలా ఉంటుంది. బహుళ ట్రాకింగ్ సులభతరంతో పాటు రద్దీని తగ్గిస్తుందని కేంద్ర మంత్రి వివరించారు. అలాగే రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి కేంద్ర రూ.252.42 కోట్లు మంజూరు చేసింది. శ్రీకాకుళం జిల్లా రణస్థలం వద్ద ఆరువరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ కారిడార్ నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేసిందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

www.varadhinews.com
వారధి
తెలుగు దిన పత్రిక
SPORTS
క్రీడలు




# బౌలింగ్‌లో సత్తా చాటిన టీమిండియా

## వాషింగ్టన్ సుందర్-7, అశ్విన్-3కు వికెట్లు

## రెండో టెస్ట్‌లో టీమిండియా ఆధిపత్యం

## న్యూజిలాండ్ 259 ఆలౌట్.. భారత్ 16/1

**పుణె :** న్యూజిలాండ్‌తో రెండో టెస్ట్‌లో టీమిండియా ఆధిపత్యం చెలాయిస్తోంది. గురువారం పుణె వేదికగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో ముందుగా బౌలింగ్‌లో సత్తా చాటిన టీమిండియా.. అనంతరం ఆచితూచి బ్యాటింగ్ చేసింది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 11 ఓవర్లలో వికెట్ నష్టానికి 16 పరుగులు చేసింది. రోహిత్‌శర్మ(0) డకౌటవ్వగా.. యశస్వి జైస్వాల్(6 బ్యాటింగ్), శుభ్‌మన్ గిల్(10 బ్యాటింగ్) మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడారు. న్యూజిలాండ్ బౌలర్లలో టీమ్ సౌథీ ఓ వికెట్ తీసాడు. అంతకుముందు న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 79.1 ఓవర్లలో 259 పరుగులకు ఆలౌటైంది.డెవాన్ కాన్వే(141 బంతుల్లో 11 ఫోర్లతో 76), రచిన్ రవీంద్ర(105 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 65) హాఫ్ సెంచరీలతో రాణించగా.. మిచెల్ సాంట్నర్ (51 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 33) పర్వాలేదనిపించాడు. భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్(7/59), రవిచంద్రన్ అశ్విన్(3/64) కివీస్ పతనాన్ని శాసించారు. 147 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒకే ఇన్నింగ్స్ ఆఫ్ స్పిన్నర్లే 10 వికెట్లు తీయడం ఇదే తొలిసారి.టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌ను ఓపెనర్లు టామ్ లాథమ్(15), డెవాన్ కాన్వే నిదానంగా నడిపించారు. భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచిన ఈ జోడీని అశ్విన్ విడదీసాడు. తన తొలి ఓవర్‌లోనే టామ్ లాథమ్(15) వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. క్రీజులోకి వచ్చిన విల్ యంగ్ కూడా జిడ్డు బ్యాటింగ్‌తో కాన్వేకు అండగా నిలిచాడు. అతన్ని అశ్విన్ కీపర్ క్యాచ్‌గా బోల్తా కొట్టించాడు. ఈ వికెట్ విషయంలో ముందుగా అంపైర్ నాటౌట్ ఇచ్చాడు. కానీ షార్ట్ లెగ్‌లో ఫీల్డింగ్ చేసిన సర్ఫరాజ్ ఖాన్.. రోహిత్ శర్మతో పట్టుబట్టి రివ్యూ తీసుకున్నాడు. రిప్లేలో బంతి బ్యాట్‌కు తాకినట్లు తేలడంతో విల్ యంగ్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. క్రీజులోకి రచిన్ రవీంద్ర రాగా.. న్యూజిలాండ్ 92/2 లంచ్‌బ్రేక్‌కు వెళ్లింది.సెకండ్ సెషన్‌లో డెవాన్ కాన్వే 109 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. రచిన్‌తో కలిసి ఆచితూచి ఆడిన అతను సెంచరీ దిశగా మారాడు. క్రీజులోప్రమాదకరంగా మారిన ఈ జోడీని అశ్విన్ విడదీసాడు. కాన్వేను కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో మూడో వికెట్‌కు నమోదైన 62 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కాన్వే ఔటైనా.. టామ్ బ్లండెల్‌తో కలిసి డారిల్ మిచెల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. 83 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 59 పరుగుల భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని వాషింగ్టన్ సుందర్ విడదీసాడు. స్టన్నింగ్ డెలివరీతో రచిన్ రవీంద్రను క్లీన్ బౌల్డ్ చేశాడు. ఈ వికెట్ న్యూజిలాండ్ పతనాన్ని శాసించింది. టామ్ బ్లండెల్‌ను కూడా ఇదే తరహాలో సుందర్ క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో న్యూజిలాండ్ 201/5 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. చివరి సెషన్‌లోనూ వాషింగ్టన్ సుందర్ చెలరేగాడు. డారిల్ మిచెల్(18), టామ్ బ్లండెల్(3), గ్లేన్ ఫిలిప్స్(9), మిచెల్ సాంట్నర్(33), టీమ్ సౌథీ, ఆజామ్ పటేల్‌లను పెవిలియన్ చేర్చి న్యూజిలాండ్‌ను తక్కువ స్కోర్‌కే పరిమితం చేశాడు. కాగా వాషింగ్టన్ సుందర్ వికెట్ల వేటను ప్రారంభించాడు. మిగిలిన అన్ని వికెట్లను తన ఖాతాలోనే వేసుకుని కెరీర్‌లో ఉత్తమ గణాంకాలు అందుకున్నాడు. సుందర్ సాధించిన ఏడు వికెట్లలో అయిదు బౌల్డ్ చేయడంతోనే సాధించాడు. బంతిని గింగరాలు తిప్పుతూ న్యూజిలాండ్ బ్యాటర్లను బోల్తాకొట్టించాడు. అయితే ఇద్దరు కలిసి కివీస్ 10 వికెట్లు తీసిన అశ్విన్-సుందర్.. అరుదైన ఘనతలు సాధించారు. టెస్టుల్లో ఓ ఇన్నింగ్స్‌లో అన్ని వికెట్లను పడగొట్టిన తొలి కుడిచేతి వాటం ఆఫ్ స్పిన్నర్ల భారత జోడీగా సుందర్ - అశ్విన్ రికార్డు సాధించారు. 92 ఏళ్ల భారత టెస్టు క్రికెట్ చరిత్రలో అంతకుముందు వరకు ఓ ఇన్నింగ్స్‌లో పది వికెట్లను కుడిచేతి వాటం ఆఫ్ స్పిన్నర్లే తీయలేదు. ఈ ఆల్‌టైమ్ రికార్డును యాష్-వాషింగ్టన్ నెలకొల్పారు. కాగా, భారత్ గడ్డపై టెస్టుల్లో తొలి రోజు మొదటి ఇన్నింగ్స్‌లో పది వికెట్లు స్పిన్నర్లే తీయడం ఇది ఆరోసారి. ఈ ఘనతను అంతకంటే ముందు భారత్ నాలుగు సార్లు సాధించగా, ఇంగ్లండ్ ఒక్కసారి సాధించింది. ఇదే ఏడాది ధర్మశాల వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో భారత్ స్పిన్నర్లు తొలి రోజు పది వికెట్లు పడగొట్టాడు. అలాగే 1973లో (వర్సెస్ ఇంగ్లండ్), 1964లో (వర్సెస్ ఆస్ట్రేలియాపై), 1956లో (వర్సెస్ ఆస్ట్రేలియా) తీశారు. 1952లో భారత్‌పై ఇంగ్లండ్ స్పిన్లర్లు ఈ ఘనత సాధించారు.

### వాషింగ్టన్ సుందర్ ఆట తీరుతోనే సమాధానం చెప్పాడు

తొలి టెస్టను టీమిండియా కోల్పో యిం ది. బెంగళూరు వేదికగా జరిగిన ఆ టెస్టులో భారత్ 8 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. ఈ ఓటమి నేపథ్యంలో టీమిం డియా పూణేలో జరుగుతున్న రెండో టెస్టుకు పకడ్బందీగా బరిలోకి దిగింది. రాహుల్, కులదీప్ యాదవ్, సిరాజ్ కు విశ్రాంతి ఇచ్చింది. వారి స్థానంలో వా షింగ్టన్ సుందర్, గిల్, ఆకాష్ దీప్ కు స్థానం కల్పించింది. ఇందులో గిల్, ఆకా ష్ దీప్ విషయంలో పెద్దగా విమర్శలు రాలేదు. వాషింగ్టన్ సుందర్ ను జట్టు లోకి తీసుకోవడం పట్ల చాలామంది నొసలు చిట్లించారు. అసలు అతడికి అవకాశం ఎందుకు ఇచ్చారంటూ సోష ల్ మీడియా వేదికగా విమర్శలు చేశారు. అతడు పెద్దగా ఆడటం లేదని.. అతడి స్థానంలో ఇంకెవరికైనా అవకాశం క ల్పించి ఉంటే బాగుండేదని వ్యాఖ్యానిం చారు. అయితే ఇలాంటి విమర్శకులం దరికీ వాషింగ్టన్ సుందర్ తన ఆట తీరుతోనే సమాధానం చెప్పాడు. స్పిన్ కు సహకరిస్తున్న పూణే మైదానంపై బంతిని గింగిరాలు తిప్పాడు. ఒకటి కా దు రెండు కాదు ఏకంగా 7 వికెట్లు పడగొట్టాడు. దీంతో తాను ఇలాంటి బౌలర్ నో.. తనను ఎందుకు ఎంపిక చేశా రో విమర్శకులందరికీ అదిరిపోయే సమాధానం చెప్పాడు.



# టెస్టుల్లో నాలుగో స్థానానికి ఎగబాకిన దక్షిణాఫ్రికా

టీమిండియా అగ్రస్థానంలో కొనసాగుతున్నప్పటికీ విజయశాతాన్ని గణనీయంగా కోల్పోయింది. దాదాపు ఆరు శాతం చేజార్చుకుంది. మరోవైపు ఆసియాలో దశాబ్దం తర్వాత టెస్టుల్లో గెలుపు రుచి చూసిన దక్షిణాఫ్రికా నాలుగో స్థానానికి ఎగబాకింది. 47.62 విజయశాతంతో ఫైనల్ బెర్తు అవకాశాలు మెరుగుపర్చుకుంది. రెండు, మూడు స్థానాల్లో ఆస్ట్రేలియా (62.50), శ్రీలంక (55.56) ఉన్నాయి. టాప్-3 జట్లతో పోలిస్తే ప్రస్తుతానికి సౌతాఫ్రికా విజయశాతం తక్కువగా ఉన్నప్పటికీ, తమ తదుపరి మ్యాచ్‌లు సఫారీలను టేబుల్ టాపర్‌గా నిలిచేలా ఊరిస్తున్నాయి. బంగ్లాదేశ్‌తో దక్షిణాఫ్రికా మరో టెస్టు ఆడనుంది. ఆ తర్వాత సొంతగడ్డపై శ్రీలంక, పాకిస్థాన్‌లతో రెండేసి టెస్టులు ఆడనుంది. స్వదేశంలో సఫారీలను లంక, పాక్ ఓడించడం అంత సులువు కాదు. ఈ నేపథ్యంలో తమ మిగిలిన మ్యాచ్‌ల్లో సౌతాఫ్రికా హాట్ ఫేవరేట్‌గా మారింది. మరోవైపు ఈ మ్యాచ్‌లన్నీ గెలిస్తే దక్షిణాఫ్రికా డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంటుంది. అయిదు మ్యాచ్‌ల్లో నాలుగు గెలిచినా వాళ్లకు అవకాశం ఉంటుంది. అయితే భారత్, ఆస్ట్రేలియా, శ్రీలంక ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో భారత్ స్థానం ప్రమాదంలో పడింది. టాప్-2లో నిలిచి ఫైనల్‌కు చేరాలంటే అయిదు విజయాలు సాధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం నాలుగు గెలిచి, ఒకటి డ్రా చేసుకున్నా టైటిల్ పోరుకు అర్హత సాధించే అవకాశం ఉంటుంది. అయితే టీమిండియా తమ తదుపరి పోరుల్లో న్యూజిలాండ్‌తో ఒకటి, ఆస్ట్రేలియాతో అయిదు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. కంగారూల గడ్డపై రోహిత్ సేన విజయాలు సాధించడం అంత ఈజీ కాదు. కాగా న్యూజిలాండ్ (44.44), ఇంగ్లండ్ (43.06) అయిదు, ఆరు స్థానాల్లో ఉన్నాయి. బంగ్లాదేశ్ (30.56), పాకిస్థాన్ (25.93), వెస్టిండీస్ (18.52) పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉన్నాయి. న్యూజిలాండ్ మినహా మిగిలిన జట్లు రేసు నుంచి దాదాపుగా నిష్క్రమించాయి.



# ధోనీ వల్లే నా కెరీర్ నాశనమైంది!

## భారత మాజీ క్రికెటర్ మనోజ్ తివారి

భారత మాజీ క్రికెటర్ మనోజ్ తివారి తన కెరీర్ ధోని వల్లే నాశనం అయిందని సంచనల ఆరోపణలు చేశాడు. 'ఇది జరిగి చాలా కాలం అయ్యింది. గడిచిపోయిన దాన్ని తిరిగి తవ్వకూడదని అనొచ్చు. కానీ నాకు ఇప్పటికీ, ఎప్పటికీ ఈ బాధ ఉంటుంది... టీమిండియా క్రికెటర్‌గా సరిగ్గా రాణించలేకపోయాననే లోటు, నన్ను జీవితాంతం వెంటాడుతూనే ఉంటుంది.దానికి నేనేం చేయలేను. ఇది జీవితం.. అన్నీ మరిచిపోయి ముందుకు వెళ్లాల్సిందే.. నేను నా ఆటో బయోగ్రఫీ రాస్తే అందులో కచ్చితంగా అన్నీ బయటపెడతాను. నేను ప్లేయర్‌గా మంచి ఫామ్‌లో ఉన్నప్పుడు, ఆడించకుండా కూర్చోబెట్టారు. అలా అవకాశం ఇవ్వకుండా నా ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసి, క్రికెటర్‌గా నన్ను ఎదగకుండా కుట్ర చేశారు.. వెస్టిండీస్‌పై సెంచరీ చేసిన తర్వాత మళ్లీ మరో మ్యాచ్ ఆడడానికి 6 నెలల సమయం పట్టింది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, సురేష్ రైనా వంటి ప్లేయర్లు ఫెయిల్ అవుతున్నా కూడా వారికి వరుస అవకాశాలు దక్కాయి. సెంచరీ చేసిన తర్వాత 8 నెలల వరకూ నాకు ఎందుకు అవకాశం ఇవ్వలేదో ధోనీ ఇంతవరకూ సమాధానం చెప్పలేదు. నా క్రికెట్ కెరీర్ నాశనం అవ్వడానికి ధోనీయే కారణం.. ఆ ఫ్రస్టేషన్ నాలో ఎప్పటికీ పోదు.. ' అంటూ కామెంట్ చేశాడు భారత మాజీ క్రికెటర్ మనోజ్ తివారి... 2008లో అంతర్జాతీయ ఆరంగ్రేటం చేసిన మనోజ్ తివారి, మొదటి మ్యాచ్‌లో 2 పరుగులు చేసి బ్రెట్ లీ బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. మొదటి 5 మ్యాచుల్లో తక్కువ స్కోర్లకే అవుటైన మనోజ్ తివారి, 2011 డిసెంబర్‌లో జరిగిన వన్డే మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై సెంచరీ బాదాడు. 104 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచిన మనోజ్ తివారి, మళ్లీ మ్యాచ్ ఆడేందుకు 2012 జూలై వరకూ వెయిట్ చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత 6 మ్యాచులు ఆడినా ఓ హాఫ్ సెంచరీ మినహా పెద్దగా పర్ఫామెన్స్ చూపించకపోవడంతో మళ్లీ టీమిండియా నుంచి పిలుపు దక్కించుకోలేకపోయాడు మనోజ్ తివారి.. మొత్తంగా తన కెరీర్‌లో 12 వన్డేలు, 3 టీ20 మ్యాచులు ఆడిన మనోజ్ తివారి, వన్డేల్లో ఓ సెంచరీ, ఓ హాఫ్ సెంచరీతో పాటు 5 వికెట్లు కూడా తీశాడు. 119 ఫస్ట్ క్లాస్ మ్యాచుల్లో 51.78 సగటుతో 27 సెంచరీలు, 35 హాఫ్ సెంచరీలతో 8752 పరుగులు చేసిన మనోజ్ తివారి, 163 లిస్టు ఏ మ్యాచుల్లో 5466 పరుగులు చేశాడు.

# టెస్టుల్లో మరో మైలురాయిని అందుకున్న అశ్విన్

భారత క్రికెట్ జట్టు వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఇప్పుడు టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన ఏడో బౌలర్‌గా నిలిచాడు. న్యూజిలాండ్ క్రికెట్ జట్టుతో పుణెలో జరుగుతున్న రెండో టెస్టు సిరీస్‌లో అతను ఈ రికార్డును సాధించాడు. దీంతో పాటు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) చరిత్రలో కూడా అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. న్యూజిలాండ్‌పై మూడో వికెట్ తీసిన అశ్విన్ ఈ మైలురాయిని సాధించాడు. అశ్విన్ దింతో ఆస్ట్రేలియా దిగ్గజం నాథన్ లియాన్ (530)ను అధిగమించి ప్రపంచ క్రికెట్‌లో అత్యధిక టెస్టు వికెట్లు తీసిన ఏడో బౌలర్‌గా నిలిచాడు. సుదీర్ఘమైన టెస్ట్ ఫార్మాట్‌లో ముత్తయ్య మురళీధరన్ (800), షేన్ వార్న్ (708), జేమ్స్ అండర్సన్ (704), అనిల్ కుంబ్లే (619), స్టువర్ట్ బ్రాడ్ (604), గ్లెన్ మెక్‌గ్రాత్ (563) మాత్రమే అశ్విన్ కంటే ఎక్కువ వికెట్లు తీశారు. ఇక మరోవైపు అశ్విన్ డబ్ల్యూటీసీ మూడు రౌండ్స్ లో కలిపి మొత్తం 39 మ్యాచ్‌లు ఆడాడు. అందులో అతను దాదాపు 20 సగటుతో 189 వికెట్లు పడగొట్టాడు.ఈ లిస్ట్ లో అశ్విన్ తర్వాత ఆస్ట్రేలియా స్పిన్నర్ 43 టెస్టుల్లో 26.70 సగటుతో 187 వికెట్లు పడగొట్టాడు. ఈ జాబితాలో 22.81 సగటుతో 175 వికెట్లు పడగొట్టిన ఆస్ట్రేలియా ఆటగాడు పాట్ కమిన్స్ మూడో స్థానంలో ఉన్నాడు. అయితే, అశ్విన్ మినహా మరే భారత బౌలర్ కూడా 150 వికెట్లను అందుకోలేకపోయారు. ఇక ప్రస్తుతం




జరుగుతున్న టీమిండియా, న్యూజిలాండ్ రెండో టెస్ట్ మ్యాచ్ లో 4 వికెట్లు కోల్పోయి 198 పరుగులతో ఆడుతోంది.

# సర్ఫరాజ్ తుది జట్టులో ఉండాల్సిందే!

## టీమిండియా మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా

టీమిండియా నయా బ్యాటింగ్ సెన్సేషన్ సర్ఫరాజ్ ఖాన్‌కు రోజురోజుకు మాజీల నుంచి మద్దతు పెరుగుతోంది. సర్ఫరాజ్‌కు ఇప్పటికే భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ సపోర్ట్ చేయగా.. తాజాగా టీమిండియా మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా కూడా మద్దతు ఇచ్చాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ 2024-25లో సర్ఫరాజ్‌కు ఛాన్స్ ఇవ్వాలని ఆకాశ్ సూచించాడు. అతడిని పక్కనపెట్టేందుకు కారణం ఏదీ కనిపించడం లేదన్నాడు. ఆస్ట్రేలియా సిరీస్ కోసం ఈ వారంలోగా బీసీసీఐ జట్టును ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. బుధవారం ఓ వర్చువల్ ఇంటరాక్షన్‌లో ఆకాశ్ చోప్రా మాట్లాడుతూ 'బోర్డర్-గవాస్కర్ ట్రోఫీకోసం బీసీసీఐ ఇంకా జట్టును ప్రకటించలేదు. స్క్వాడ్‌లోనే కాదు తుది జట్టులోనూ సర్ఫరాజ్ ఖాన్ ఉండాల్సిందే. ఆస్ట్రేలియా గడ్డపై భారీ టెస్టు సిరీస్‌ను భారత్ ఆడబోతోంది. సర్ఫరాజ్ ఎక్కడైనా రాణిస్తాడనే నమ్మకం ఉంది. న్యూజిలాండ్‌పై సూపర్ సెంచరీ చేశాడు. అంతకుముందు ఇంగ్లండ్‌పైనా దూకుడుగా ఆడాడు. ఆసీస్‌తో పర్యటనకు సర్ఫరాజ్‌ను పక్కనపెట్టేందుకు కారణం ఏదీ కనిపించడం లేదు. ఆస్ట్రేలియా పర్యటనలో అతడు కచ్చితంగా ఉంటాడని భావిస్తున్నా' అని అన్నాడు. 'ప్రతి పనికి ఓ డెడ్‌లైన్ ఉంటుంది. లేకపోతే ఫలితం అనుకున్నవిధంగా రాదు. క్రికెట్‌లో పరుగులు చేయకుండా, వికెట్లు తీయకుండా ఉంటే.. ఎంతటి ఆటగాడికైనా ఇబ్బందులు తప్పవు. జాతీయ జట్టు తరఫున ఆడే ప్రతిఒక్కరికీ నిబంధనలు ఒకేలా ఉంటాయి. కేవలం కేఎల్ రాహుల్ గురించి మాత్రమే నేను మాట్లాడడం లేదు. వ్యక్తిగత ప్రదర్శన మెరుగ్గా ఉంటే జట్టులో ఉంటారు. బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌లో ఫర్వాలేదనిపించిన మద్దతుగా నిలిచాం.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com

Movie Time మూవీ టైమ్



హెబ్బా పటేల్

# సరికొత్త లవ్‌స్టోరీ

చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'ధూం ధాం'. సాయి కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్ పై ఎంఎస్ రామ్ కుమార్ నిర్మిస్తున్నారు. సాయి కిషోర్ మచ్చా దర్శకుడు. గోపీ మోహన్ స్టోరీ, స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. నవంబర్ 8వ తేదీన ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ నేపథ్యంలో డైరెక్టర్ మారుతి ఈ సినిమా టీజర్‌ని రిలీజ్ చేశారు. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో టీజర్ చాలా బాగుందని, మూవీ టీమ్‌కు మారుతి బెస్ట్ విషెస్ తెలిపారు. హీరో, హీరోయిన్లు చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ లవ్ స్టోరీతో టీజర్ ప్రారంభమైంది. ఈ లవ్‌స్టోరీతో పాటు తండ్రీ కొడుకుల మధ్య ఎమోషనల్ బాండిరగ్ ఈ సినిమాలో చూపించబోతున్నట్లు టీజర్‌తో తెలుస్తోంది. చేతన్ కృష్ణ చేసిన విలేజ్ యాక్షన్ సీక్వెన్స్ ఆకట్టుకుంటోంది. వెన్నెల కిషోర్ పెళ్లి సందడిలో డిజైన్ చేసిన కామెడీ ట్రాక్ ఎంటర్‌టైనింగ్‌గా ఉంది. లవ్, ఫ్యామిలీ, ఎమోషన్, యాక్షన్, కామెడీ..ఇలా థియేటర్‌లో ప్రేక్షకుడు చూసి ఎంజాయ్ చేసే అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈ టీజర్ ఇంప్రెస్ చేస్తోంది అని చిత్ర యూనిట్ తెలిపింది. 'ఇదొక భిన్న ప్రేమకథా చిత్రం. ఇప్పటివరకు వచ్చిన ప్రేమకథలతో పోలిస్తే ఇది చాలా వినూత్నంగా ఉంటుంది. ముఖ్యంగా హీరో, హీరోయిన్ల పాత్రలు అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తాయి. ఈ పాత్రలతో ప్రేక్షకులు ట్రావెల్ అవుతారు. ఇక వినోదం పుష్కలంగా ఉంది. ఈ సినిమా తప్పకుండా అందర్నీ మెప్పిస్తుంది' అని దర్శకుడు సాయికిషోర్ మచ్చా అన్నారు.



# రాజా సాబ్..ఇది పెద్ద షాకే !

ఊరించి ఊరించి కొంచెం ఆలస్యం చేసినా ది రాజా సాబ్ టీమ్ పెద్ద షాకే ఇచ్చింది. ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా ఏదైనా స్పెషల్ ట్రీట్ ఉంటుందని ఆశించిన అభిమానులకు అంచనాలకు మించి ట్విస్ట్ అందించింది.రెండు నిమిషాల మోషన్ పోస్టర్ లో మొదటిసారి డార్లింగ్ లుక్ ని చాలా విభిన్నంగా రివీల్ చేసింది. తెల్లబడిన గెడ్డం, అక్కడక్కడా రంగు నెరసిన జుట్టు, నోట్లో దొరలు తాగే పాత కాలం చుట్ట వెరసి ఊహించని రీతిలో రివీల్ చేసింది. వీడియోలో లైవ్ విజువల్స్ లేకపోయినా హారర్ కాన్సెప్ట్ ని యానిమేషన్ రూపంలో డిజైన్ చేసి దానికి తమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ని జోడిరచడం కొత్తగా ఉంది. సబ్జెక్టు లైన్ గురించి ఇప్పుడు క్లారిటీ వచ్చేసింది. ది రాజా సాబ్ ఒక కంప్లీట్ హారర్ కామెడీ మూవీ. చూస్తుంటే ప్రభాస్ డ్యూయల్ రోల్ చేసిన సంకేతాలు కనిపిస్తున్నాయి. ఒకటి యంగ్ గా అమ్మాయిల మనసులు దోచేసే వింటేజ్ లుక్ కాగా మరొకటి పాడుబడిన బంగాళాను ఒకప్పుడు రాజ్యమేలిన రాజుల కాలం నాటి మహారాజ్ లుక్. రెండూ దేనికవే ఫ్యాన్స్ కి కిక్ ఇచ్చేలా ఉన్నాయి. దర్శకుడు మారుతీ తాను ఎలాంటి సబ్జెక్టు హ్యాండిల్ చేశానో స్పష్టత ఇచ్చేసినట్టే. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ భారీ బడ్జెట్ తో రూపొందించిన ది రాజా సాబ్ కు నాలుగు వందల కోట్ల దాకా బడ్జెట్ అయ్యిందనే టాక్ ఉంది. వచ్చే ఏడాది ఏప్రిల్ లో విడుదల కాబోతున్న ది రాజా సాబ్ కు సంబంధించి ఎలాంటి ఆలస్యం ఉండబోవడం లేదు. ఈ ఏడాది చివర్లోగా షూటింగ్ పూర్తి చేసి తర్వాత మూడు నెలలు పోస్ట్ ప్రొడక్షన్ , ప్రమోషన్ కు కేటాయించబోతున్నారు.



# దీపావళి కానుకగా రిలీజ్

దీపావళి కానుకగా రిలీజ్‌శివకార్తికేయన్ నటిస్తున్న బాహుభాషా బయోగ్రాఫికల్ యాక్షన్ మూవీ 'అమరన్'. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్, సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, గాడ్ బ్లెస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం దీపావళి కానుకగా ఈనెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో హీరో నాని ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ట్రైలర్ ఇండియన్ ఆర్మీ ఆఫీసర్ అమరవీరుడు మేజర్ ముకుంద్ వరదరాజన్ స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని పరిచయం చేస్తుంది. మేజర్ ముకుంద్, అతని కుమార్తె హార్ట్ టచ్చింగ్ ఫుటేజ్‌తో ట్రైలర్ ప్రారంభమైంది. మేజర్ ముకుంద్ వరదరాజన్ పాత్రలో శివకార్తికేయన్, అతని భార్యగా సాయి పల్లవి, ఆన్-స్క్రీన్ డాటర్ క్యారెక్టర్స్‌లోకి ట్రైలర్ నేచురల్‌గా ట్రాన్స్‌ఫర్మేషన్ అవ్వడం కట్టిపడేసింది. తన దేశానికి సేవ చేయడంలో మేజర్ ముకుంద్ నిబద్ధత గూస్ బంప్స్ తెప్పించింది. ట్రైలర్‌లో ధైర్యం, త్యాగం థీమ్స్‌తో పాటు మేజర్ ముకుంద్ సైనిక జీవితం, ఫ్యామిలీ బాండిరగ్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేశారు అని చిత్ర బృందం తెలిపింది. హీరో నితిన్ ఫాదర్ సుధాకర్ రెడ్డి, సిస్టర్ నిఖిత రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగులో శ్రేష్ట్ మూవీస్ బ్యానర్ ద్వారా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు.